## బ్యాంకులు ఆదివారం పని చేస్తయ్




2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 24 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 259 | పేజీలు:12 | వెల రూ.5

## ఇళయరాజాపై పోస్టల్ స్టాంపు



సంగీతజ్ఞుడిని అపూర్వంగా గౌరవించిన ఆస్ట్రేలియా

2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



## అత్యంత సంపన్నుడు అదానీ

ఆస్తుల్లో అంబానీని మించిపోయిండు

ఈ ఇద్దరి తరువాత మూడో స్థానంలో లక్ష్మీ నివాస్ మిట్టల్

భారత దేశంలో సంపన్నుల జాబితా విడుదల 2

## ఆ గణేశుడి లడ్డు వెల రూ.1.01 కోట్లు



రాజేంద్రనగర్‌లోని కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో వేలం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కీర్తి రిచ్‌మండ్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాస్‌లోని ...మిగతా 2లో

దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం

# పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలె



## కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలు చర్యలు ప్రారంభించండి

తక్షణమే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో చర్చలు జరపండి

విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం బ్యూరో) :** దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం ఎంసీహెచ్ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో విద్యుత్ శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై సీఎం అధికారులను ప్రశ్నించారు. దీంతో విద్యుత్ ఉత్పత్తికి జీ9 బొగ్గు అవసరమని అధికారులు తెలిపారు. సింగరేణిలో జీ9 బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవనీ, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని స్పష్టం చేశారు. జీ9 బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతతో ఎలా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని, పిట్ హెడ్ కాకుండా దూరంగా ఎందుకు యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించారనీ, దానికి బొగ్గు సరఫరాతో పడే అదనపు భారం ఎంతని ప్రశ్నించారు. నాడు రాజకీయ కారణాలతోనే పిట్‌హెడ్‌పై కాకుండా దూరంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో రాష్ట్రంపై దాదాపు రూ.40 వేల కోట్ల భారం పడుతోందని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ9 బొగ్గును సింగరేణి సరఫరా చేయలేదని, సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు వివరించారు. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాలపై కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే, తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## ఉద్యోగ సంఘాలతో చర్చలు సఫలం

## రెండు డీఏలకు ఓకే చెప్పిన ప్రభుత్వం 2

ఈనెలలోనే పీఆర్సీపై నిర్ణయానికి హామీ

ప్రభుత్వం ఒక్కో సమస్యను పరిష్కరిస్తోంది : ఉద్యోగ సంఘాల నేత లచ్చిరెడ్డి

## ఇంటి ముంగిటికి మీ సేవ

- డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ
- 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభంలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** 'గుడ్ గవర్నెన్స్'కు టెక్నాలజీని జోడించి 'డిజిటల్ గవర్నెన్స్'లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్‌కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవా పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే... జనన,మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికేట్‌లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్‌లు తదితర మీ సేవా సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవా ఏజెంట్లు, మీ సేవా వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలిదశలో 'క్యూర్' ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని... ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు.

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ప్రతిష్టాత్మకంగా చేయాలె



- దేశ విదేశాల్లో రోడ్‌షోలు
- వార్‌రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ
- అధికారులంతా స్ఫూర్తితో భాగస్వాములు కావాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం బ్యూరో) :** తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే ఈ చారిత్రక ఘట్టంలో అధికారులంతా భాగస్వాములై సమ్మిట్‌ను విజయవంతం చేయాలని సూచించారు. బుధవారం రాష్ట్ర ...మిగతా 2లో

భారీ వర్షాలొస్తున్నయ్..

## కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలె

- రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలె
- మంత్రి పొంగులేటి ఆదేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 ( మనం బ్యూరో ) :** అల్పపీడనంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్తితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలనీ, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.



ప్రతి జిల్లాలో 24 గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటికి రావొద్దనీ, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లొద్దని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ప్రజలకు సూచించారు.

## మరో ఇద్దరు శిశువుల మృతి

ఆదిలాబాద్ రిమ్స్ అగ్నిప్రమాదంలో ఐదుకు చేరిన మరణాలు

ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆసుపత్రిలో జరిగిన ఘోర అగ్నిప్రమాద ఘటన తీవ్ర విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి ...మిగతా 2లో

## నిమ్స్‌లో వైరలవుతున్న అవినీతి వైరస్




- కొనుగోలు నుంచి చికిత్స వరకూ అన్నిట్లోనూ చేతి వాటమే
- ఒకరి నుంచి ఒకరికి అంటుకుంటున్న అక్రమార్జన జబ్బు
- తక్షణమే ప్రక్షాళన చేయాలె

3

## అమెరికా హాల్ ఆఫ్ ఫేమ్‌లో నిసర్గ పేరు 2

షార్జాలో భారతీయుడి

## హత్య

జులైలో ఘటన.. ఇప్పుడు కారులో శరీరభాగాలు

భార్యాకుమారుడి మిస్సింగ్

**షార్జా, సెప్టెంబర్ 23 :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఒక భారతీయుడి హత్యా ఘటన చోటు చేసుకుంది. షార్జాలో జులైలో ఈ హత్య జరగ్గా.. ఇప్పుడు కారులో అతడి శరీరభాగాలు కనిపించాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి హత్య తర్వాత నుంచి భార్యాకుమారుడి ఆచూకీ కూడా లేకుండాపోయింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. కర్ణాటకలోని ఉడుపి జిల్లాకు చెందిన అల్విన్ ప్రకాశ్ కుందర్.. భార్య టీనా, కుమారుడితో కలిసి ...మిగతా 2లో



## మంటలు రేపనున్న సూపర్ ఎల్‌నినో

అక్టోబర్ నుంచి 2027 ఫిబ్రవరి దాకా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం

4.5 లక్షల మందిని హతమారుస్తుందన్న క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక

భయంగొలిపే మరిన్ని అంశాలను వెల్లడించిన రిపోర్టు

**న్యూయార్క్, సెప్టెంబర్ 23 :** ప్రపంచవ్యాప్తంగా పేద దేశాల్లో సూపర్ ఎల్ నినోతో లక్షల సంఖ్యలో ప్రాణాలు పోతాయని క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక హెచ్చరిస్తోంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి మధ్యలో కనీసం 4.5 లక్షల మంది ఎండ వేడికి దుర్మరణం పాలబడే ప్రమాదముందని అది తెలిపింది. మన దేశంలోనూ వేల సంఖ్యలో మరణాలు సంభవించొచ్చని నివేదిక వెల్లడించింది.

**1996-2025ను బేస్ లైన్ గా తీసుకొని తయారు చేసిన ఈ రిపోర్టు**

పేద దేశాలపై ఎక్కువ దృష్టి సారించింది. ఆఫ్రికాలోని 'సాహిల్ రీజియన్' (ఆఫ్రికా మధ్యలోని 9 దేశాల్లో ఐదువేల కిలోమీటర్లు విస్తరించిన ప్రాంతం)లో 66,800 మంది వేడిమి కారణంగా.. అదనంగా ...మిగతా 2లో

## అగ్రరాజ్యాలకు సూపర్ పవరేం లేదు

- సైనిక శక్తితో శాంతిని సాధించలేం
- ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్

**న్యూయార్క్, సెప్టెంబర్ 23:** ప్రపంచ వ్యవహారాల్లో బలవంతుడిదే రాజ్యమన్న ఆలోచనా విధానాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తప్పుబట్టారు. అగ్ర రాజ్యాలు తమ శక్తిసామర్థ్యాలు అంత సూపర్ పవర్ కాదని గుర్తించాలని ఆయన మంగళవారం ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశంలో పేర్కొన్నారు. కేవలం సైనిక శక్తి ఆధారంగా శాంతిని స్థాపించలేమని ఇటీవలి కాలంలో రుజువైపోయిందని తెలిపారు. అందుకే పరస్పరం ఆధారపడిన ప్రపంచాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. బలమైన రాజ్యాల మధ్య పెరిగిపోతున్న పోటీ, ప్రపంచం ఎదుర్కొంటున్న ఇతర సవాళ్ల నేపథ్యంలో దేశాలు పరస్పర సహకారాన్ని వీడరాదని ఆయన చాలాకాలంగా కోరుతున్నారు. ప్రపంచంలో విభేదాల చీలికలు విస్తృతమవుతున్నాయని తాజా ప్రసంగంలో పేర్కొన్నారు. రగులుతున్న యుద్ధాలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కృత్రిమ మేధ నుంచి ఎదురవుతున్న



సవాళ్లు, ఇతర సమస్యలను ఆయన లేవనెత్తారు. భవిష్య ప్రపంచాన్ని విశ్వాసరాహిత్యం, చీలికలు, లాభాపేక్షల ఆధారంగా నిర్మించడానికి బదులు పరస్పర సహకారం నిండినదిగా రూపొందిద్దామని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ గుటెరస్ పిలుపునిచ్చారు.

# బ్యాంకులు ఆదివారం పని చేస్తయ్

ఢిల్లీ, సెప్టెంబర్ 23 : బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు సమ్మె తలపెట్టిన నేపథ్యంలో ఆదివారం బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. దీంతో ఈ నెల 27న బ్యాంకు శాఖలు పని చేయనున్నాయి. సమ్మె నేపథ్యంలో బ్యాంకు వినియోగదారులకు, కస్టమర్లకు ఇబ్బందులు రాకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది.

సాధారణంగా నాలుగో శనివారం, ఆదివారం బ్యాంకులు పనిచేయవు. 28 నుంచి (సోమ, మంగళ, బుధ) మూడు రోజుల సమ్మె నేపథ్యంలో మొత్తంగా ఐదు రోజుల పాటు బ్యాంకు సేవలకు విఘాతం కలగనుంది. ఈ క్రమంలో ఆదివారం బ్యాంకులు తెరిచేలా నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఆర్బీఐ కూడా అందుకు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఆదివారం పనిచేయనున్నాయని ఆర్థిక శాఖ తెలిపింది.

**స్మార్ట్‌ఫోన్లకు భద్రమైన టెంపర్డ్ గ్లాస్**

వారంలో అయిదు రోజుల పనిదినాల విధానం అమలు చేయాలనే ఒప్పందాన్ని ఆమోదించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. 2024 మార్చిలో కుదిరిన ఒప్పందం ప్రకారం వారానికి అయిదు రోజులే పని చేసి, రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేసేందుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. దీంతోపాటు స్కేల్-4, ఆపై అధికారులకే ప్రత్యేకంగా పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సమ్మె ప్రభావం దృష్ట్యా ఎస్బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ వినియోగదారులకు సూచనలు జారీ చేశాయి. శాఖల్లో నేరుగా చేసే పనులకు ఆటంకం కలిగినా డిజిటల్ సర్వీసులు యథాతథంగా అందుబాటులో ఉంటాయని తమ ప్రకటనల్లో స్పష్టం చేశాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ యాప్లు, ఏటీఎం ద్వారా చేసే డిజిటల్ బదిలీలు కొనసాగుతాయి. బిల్లుల చెల్లింపులు, చిన్న మొత్తం బదిలీలకు వినియోగదారులు డిజిటల్ మార్గాలనే ఎంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి.

# తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జ్‌గా సునీల్ భన్సల్

- ఏపీ బీజేపీ ఇన్‌చార్జ్‌గా అర్వింద్ భదౌరియా
- ఒడిశా ఇన్‌చార్జ్‌గా పురందేశ్వరి
- 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు ఇన్‌చార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

హైదరాబాద్, మనం ప్రతినిధి : రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇన్‌చార్జ్, సహ-ఇన్‌చార్జ్ జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.

**తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జ్‌లు..**

తెలంగాణ: సునీల్ భన్సల్ ఇన్‌చార్జ్‌లు వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇన్‌చార్జ్‌లు కూడా బాధ్యతలు నిర్వహిస్తారు). ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇన్‌చార్జ్‌లు వ్యవహరిస్తారు. తమిళనాడు: రామ్ మాధవ్ ఇన్‌చార్జ్‌లు ఎంపికవ్వగా, కో-ఇన్‌చార్జ్‌గా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు. ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇన్‌చార్జ్‌లు నియమితులయ్యారు. కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇన్‌చార్జ్‌లు ఎంపికయ్యారు. ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇన్‌చార్జ్‌లు ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇన్‌చార్జ్‌లు వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్జీత్ సెహ్రావత్లను సహ-ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇన్‌చార్జ్‌గా, జాంయాంగ్ త్సెరింగ్ నామ్గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్: తరుణ్ చుగ్ ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు. హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇన్‌చార్జ్‌లు వ్యవహరించనున్నారు. మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇన్‌చార్జ్‌లు నియమితులయ్యారు.

# ఇళయరాజాపై పోస్టల్ స్టాంపు

## సంగీతజ్ఞుడిని అపూర్వంగా గౌరవించిన ఆస్ట్రేలియా

కాన్‌బెర్రా, సెప్టెంబర్ 23 : దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. 5 దశాబ్దాల ఆయన సంగీత ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, ఆస్ట్రేలియా పార్లమెంటు స్మారక తపాలా బిళ్లను విడుదల చేసింది. తనకు దక్కిన గౌరవంపై ఇళయరాజా హర్షం వ్యక్తం చేశారు. తమిళనాడులోని ఓ చిన్న గ్రామంలో జన్మించిన తనకు, ఆస్ట్రేలియాలో సమున్నత గౌరవం దక్కడం భావోద్వేగానికి గురిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా తన మనసులోని భావాలను పంచుకున్నారు. 'నా 50 ఏళ్ల సంగీత ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, ప్రత్యేక స్మారక తపాలా బిళ్లను విడుదల చేయడం ద్వారా నన్ను గౌరవించినందుకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ సందర్భంగా విక్టోరియా ఆర్థిక మంత్రి, ఎంపీ ఎన్వర్ ఎర్డొగాన్ కు, పార్లమెంటు సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సందర్భంగా నా సంగీతానికి జీవం పోసినవారు నా వెంట నడిచిన కళాకారులు, తరతరాలుగా నా స్వరాలను ఆదరిస్తున్న శ్రోతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను' అని ఇళయరాజా అన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘంలో (నో) విభేదాలు?



- క్లారిటీ ఇచ్చిన అధికారులు
- 'సర్' సహా అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకున్నం
- ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు చెప్పిండ్రు?.. వార్తలను ఖండించిన అధికారులు
- కొన్ని అంశాలపై వారు పరిశీలనలు మాత్రమే చేశారని వెల్లడి
- 14 సందర్భాల్లో అభ్యంతరాలంటూ ఓ ఆంగ్ల దినపత్రికలో కథనం
- ఓటర్ల జాబితా కచ్చితత్వమే 'సర్' లక్ష్యమని స్పష్టీకరణ

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను బుధవారంనాడు తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలించిందని పేర్కొంది. అయితే, ఇటీవల ఓ ఆంగ్ల దినపత్రికలో కథనం.. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది.

ఈసీ వర్గాల ప్రకారం.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై ముగ్గురి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ ఇచ్చిన వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'సర్' వల్ల కొందరి ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యే అవకాశం ఉందంటూ ప్రతిపక్ష నేతలు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితా కచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ చెబుతోంది.

# మరో ఇద్దరు శిశువుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు మృతి చెందిన ప్రతి చిన్నారి కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు.ఆదిలాబాద్ రిమ్స్‌లోని ప్రత్యేక నవజాత శిశువుల సంరక్షణ విభాగంలో (ఎస్ఎన్సీయూ) సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీ పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వార్డు అంతా దట్టమైన పొగలు కమ్ముకోవడంతో ఊపిరాడక ఐదుగురు పసికందులు మృత్యువాత పడ్డారు. ప్రాథమికంగా ఈ ఘటనలో ముగ్గురు శిశువులు మృతి చెందగా, చికిత్స పొందుతూ తాజాగా మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో మృతుల సంఖ్య ఐదుకి చేరింది. ఈ ఘటనలో మృతి చెందిన నవజాత శిశువులు ఇంద్రవెల్లి, ఇచ్చోడ, ఉట్నూర్, లింగపూర్ ప్రాంతాలకు చెందినవారిగా గుర్తించారు.ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై వార్డులోని మిగతా శిశువులను సురక్షితంగా బయటకు తరలించారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న మిగతా పిల్లల ఆరోగ్య పరిస్థితిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే పిల్లలను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని పెద్ద ఆసుపత్రులకు తరలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేరుగా రిమ్స్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ ప్రమాదంపై నిపుణులతో సమగ్ర విచారణ కమిటీని వేయడంతో పాటు ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ ఆడిట్లు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు.. రిమ్స్‌లో 150 బెడ్లతో అత్యాధునిక వసతులతో కూడిన మాతా శిశు ఆరోగ్య కేంద్ర (ఎంసీహెచ్) భవన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించబోతున్నామని, తద్వారా మెరుగైన వైద్య సేవలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# షార్జాలో భారతీయుడి హత్య

(మొదటి పేజీ తరువాయి)

యూఏఈలో నివసిస్తున్నారు. 14 ఏళ్లుగా షార్జా ఎయిర్ పోర్ట్ లో విధులు నిర్వర్తిస్తున్నారు. టీనా స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. జులైలో వారు షార్జా నుంచి భారత్ కు బయల్దేరేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో అల్విన్ హత్యకు గురైనట్లు తెలుస్తోంది. అతడి సోదరుడు అనిల్ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం.. జులై 20న తన సోదరుడితో ఫోన్ మాట్లాడాలని ప్రయత్నించగా.. వీలుకాలేదన్నారు. అయితే.. అంతా ఓకే అంటూ ఒక మెసేజ్ పంపాడని చెప్పారు. మామూలుగా అల్విన్ ఎప్పుడు వాయిస్ మెసేజ్ చేస్తాడని, ఆసారి మాత్రం భిన్నంగా సమాచారం ఇచ్చాడన్నారు. మళ్లీ వారం తర్వాత ఫోన్ చేసినా స్పందనలేదన్నారు. 'అల్విన్ స్నేహితుడి సహాయంతో ఇంటి దగ్గర తనిఖీ చేయించగా.. కుటుంబమంతా భారత్ వెళ్లిందని వాచ్ మన్ చెప్పాడు. కంపెనీ నుంచి అదే సమాచారం వచ్చింది. అతడు భారత్కు రాలేదని, ఎక్కడున్నాడో వెతకాలని కోరాం. పాస్ పోర్ట్ వివరాలను బట్టి అతడు ఇంకా షార్జాలోనే ఉన్నాడు. దాంతో మిస్సింగ్ ఫిర్యాదు చేశాం. పోలీసుల దర్యాప్తు చేస్తుండగా.. ఒమన్ కు వెళ్లే మార్గంవైపు పార్క్ చేసి ఉంచిన కారులో ప్రకాశ్ శరీర భాగాలు లభ్యమయ్యాయి. శరీరాన్ని తొమ్మిది భాగాలుగా చేసి, రెండు సంచుల్లో ఉంచారు' అని అనిల్ వెల్లడించారు. ప్రస్తుతం అతడి భార్యా కుమారుడి ఆచూకీ గురించి ఆరా తీస్తున్నారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. టీనా ప్రమేయంపైనా దర్యాప్తు చేస్తున్నారు. అల్విన్, టీనా మధ్య గొడవలున్నట్లు తమకు తెలియదని కుటుంబ సభ్యులు చెప్పారు.

# మంటలు రేపనున్న సూపర్ ఎల్‌నినో

(మొదటి పేజీ తరువాయి)

చనిపోవచ్చని వెల్లడించింది. వీటిల్లో 31,400 మరణాలు నైజీరియాలో, 17,500 మరణాలు సుడాన్లో, 10,000 మరణాలు నైజర్లో, 8,000 మరణాలు ఛాద్ లో నమోదు కావొచ్చని నివేదికలో అంచనా కట్టింది. ఇక ఆగ్నేయాసియాలో ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్ లాండ్, కంబోడియాలో కలిపి సంయుక్తంగా 19,400 అదనపు మరణాలు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఒక్క ఇండోనేసియాలోనే 19,300 మంది ప్రాణాలు కోల్పోతారని చెప్పింది. పెరిగిన ఉష్ణోగ్రతలు తట్టుకోలేక.. భారత్ లో 15,800, బ్రెజిల్లో 13,300 మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారత్, పాకిస్థాన్ దేశాల్లో రానున్న వేసవిలో కూడా మరణాలు నిలకడగా పెరిగే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది.

**ముందస్తు చర్యల కోసమే నివేదిక తయారీ..**

ప్రభుత్వాలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకునేలా తమ నివేదిక ఉపయోగపడుతుందని ది క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ వెల్లడించింది. ముందస్తుగా హీట్ వార్నింగ్స్ జారీ చేయడం, కూలింగ్ సెంటర్లు నిర్వహించడం, తాగునీటి సౌకర్యాలను పెంచడం, ఆరుబయట పనిచేసే ఉద్యోగులకు రక్షణ ఏర్పాట్లు కల్పించడం, ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయడానికి ఈ అంచనాలు ఉపయోగపడనున్నాయి.

భవిష్యత్తులో ఎల్నినో మరింత బలపడుతుందని సెప్టెంబర్ 3వ తేదీన ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకటించింది. దీని తీవ్రత నవంబర్, డిసెంబర్ నెలల్లో తారస్థాయికి చేరుతుందని అంచనావేసింది. 2027 ఫిబ్రవరిలో కూడా ఇది కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ భావిస్తోంది. భూమధ్య రేఖ వద్ద పసిఫిక్ సముద్రంలో ఉష్ణోగ్రత కూడా 1.8 డిగ్రీల సెల్సియస్ పెరిగొచ్చని ఇప్పటికే అమెరికా నేషనల్ ఓసియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. భూ ఉత్తరార్ధగోళంలో ఎల్నినో చాలా బలంగా ఉంటుందని ఈ సంస్థ వెల్లడించింది. 1901లో రికార్డుల నమోదు మొదలైన నాటి నుంచి.. ఈ ఏడాది ఆగస్టు నెల 'అత్యంత వేడిగా ఉన్న ఆగస్టు'గా చరిత్రలో నిలిచిపోతుందని ఆ వాతావరణ నివేదిక ప్రకటించింది.

# ఆ గణేశుడి లడ్డు రూ.1.01 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వినాయక మండపంలో గణనాథుడి లడూ వేలం మరోసారి రికార్డు సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిర్వహించిన లడ్డూ వేలంలో అదే కమ్యూనిటీకి చెందిన శక్తిమాన్ బృంద సభ్యులు రూ.1.01 కోట్లకు కైవసం చేసుకున్నారు. 2016లో మొదటిసారి లడ్డూ వేలం మొదలైంది. అనంతరం నాలుగేళ్లుగా ఇక్కడి కమ్యూనిటీకి సంబంధించి తెలుగు రాష్ట్రాల్లోనే రికార్డుస్థాయిలో లడ్డూ వేలం కొనసాగగా.. ఈ ఏడాది అదే పరంపరను అనుసరించారు. గత ఏడాది ఈ కమ్యూనిటీలోని లడ్డూ రూ.2.31 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ప్రతి సంవత్సరం కమ్యూనిటీకి చెందిన వారంతా నాలుగు గ్రూపులుగా విడిపోయి వేలం పాటలో పాల్గొంటున్నారు. లడ్డూ వేలం పాట ముగిసిన అనంతరం గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. పెద్ద సంఖ్యలో కమ్యూనిటీ వాసులు పాల్గొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ప్రతిష్టాత్మకంగా చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్వహిస్తున్న రెండో సదస్సు ఇదనీ, దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశామనీ, ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తాడని వెల్లడించారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రతి కమిటీకి కన్వీనర్లను కూడా నియమించామనీ, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి బాధ్యతలు స్వీకరించాలనీ, అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రతి రోజు కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు. తెలంగాణకు ఎక్కువ పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్న దేశాలు, ,నగరాలు, రంగాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని పేర్కొన్నారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయో అధ్యయనం చేసి దానికి అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళిక రూపొందించి మంత్రి మండలి ఉపసంఘానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు.

**తెలంగాణ సంస్కృతి, విశిష్టత ప్రతిబింబించేలా ఈవెంట్ : మంత్రి శ్రీధర్ బాబు**

రాష్ట్రంలో నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కేవలం పెట్టుబడుల సమీకరణకే పరిమితం కాకుండా తెలంగాణ సంప్రదాయాలు, సాంస్కృతిక విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పే విధంగా ఉండాలని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు ఈవెంట్‌లో ప్రధానంగా ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాలు విదేశాల నుంచి దాదాపు 2000 నుండి 3000 మంది ప్రతినిధులు హాజరు కానున్న నేపథ్యంలో వారికి మన సంస్కృతి ఒక దృశ్యకావ్యంలా నిలిచిపోవాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు.

# అమెరికా హాల్ ఆఫ్ ఫ్రేమ్‌లో నిసర్గ పేరు

వాషింగ్టన్, సెప్టెంబర్ 23 : సీబీఎస్ఈ ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలను బయటపెట్టిన 19 ఏళ్ల నిసర్గ అధికారికి అరుదైన గౌరవం దక్కింది. అమెరికా న్యాయ విభాగానికి చెందిన హాల్ ఆఫ్ ఫ్రేమ్ లో అతడి పేరును చేర్చారు. దీనిపై నిసర్గ మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ జస్టిస్ సిస్టమ్లో సైబర్ సెక్యూరిటీకి సంబంధించి ఒక పెద్ద లోపాన్ని కనుగొన్నానని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు నివేదిక పంపిన వెంటనే వారు దానిని సరి చేశారని తెలిపారు. తాను చేసిన సహాయాన్ని గుర్తించి అమెరికా న్యాయ విభాగం హాల్ ఆఫ్ ఫేమ్లో తన పేరును చేర్చిందని నిసర్గ వెల్లడించాడు. ఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ జస్టిస్ వెబ్సైట్ను బ్రౌజ్ చేస్తున్నప్పుడు.. కొన్ని కస్టమ్ స్క్రిప్టులను ఉపయోగించి ఈ లోపాన్ని కనుగొన్నాను. వెంటనే డీఏజీకి, అమెరికా మిలిటరీకి ఈ విషయాన్ని తెలియజేశాను. వారు సరిచేశారు. యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ డిఫెన్స్/యూఎస్ మిలిటరీ సిస్టమ్లో కూడా పలు లోపాలు కనుగొన్నాను. వాటిని పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు' అని నిసర్గ వెల్లడించారు.

నిసర్గ అధికారి ఈ ఏడాదే 12వ తరగతి పూర్తిచేశాడు. అతడి కుటుంబంలో ఎవరూ సైబర్ సెక్యూరిటీ రంగంలో లేరు. తల్లిదండ్రులిద్దరూ ఫైనాన్స్ రంగంలో పనిచేస్తున్నారు. కోడింగ్ మీదున్న ఆసక్తితో ఆరేళ్ల వయసు నుంచే దాన్ని నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఇటీవల సీబీఎస్ఈలోని ఆన్ స్క్రీన్ మార్కింగ్ పోర్టల్లో లోపాలను గుర్తించిన నిసర్గ.. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ సెక్యూరిటీ విభాగం సెర్ట్-ఇన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతడి పేరు జాతీయ మీడియాలో మార్మోగిన విషయం తెలిసిందే.

# ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తాం

న్యూయార్క్, సెప్టెంబర్ 23 : ఇరాన్‌ను తుడిచిపెట్టేస్తానని, వారిని నరకానికి పంపుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికి సుంకాల అధికారాన్ని వినియోగిస్తానని స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని మరోసారి పేర్కొన్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితిలో మంగళవారం జరిగిన 81వ సర్వ ప్రతినిధి సభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ''ఇరాన్‌పై నేను ఒక పెద్ద నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇందులో రెండే మార్గాలున్నాయి. అందులో ఒకటి ఒప్పందం కుదుర్చుకుని ఆ దేశ పునర్నిర్మాణానికి సహకరించడం. దీనిద్వారా గతంకంటే గొప్ప దేశంగా ఇరాన్ నిలిచేలా చేస్తాం. రెండోది.. మరింత తీవ్రంగా సైనిక చర్య చేపట్టడం. దీనిద్వారా మరోసారి ఆ దేశం ఏ ఒక్కరినీ చంపకుండా.. ఏ దేశంపైనా దాడి చేయకుండా నిలువరిస్తాం. అమెరికాలో నవంబరు 3వ తేదీన జరిగే మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశముంది. ఇరాన్‌తో 7 నెలల యుద్ధం ద్వారా ఆ దేశం అణు బాంబు తయారు చేయకుండా అడ్డుకున్నాం. పశ్చిమాసియాలో దాని ఆధిపత్యాన్ని తగ్గించాం'' అని ట్రంప్ వివరించారు. ఉగ్రవాదానికి ప్రోత్సాహం అందించే ప్రధాన దేశంగా ఇరాన్ నిలుస్తోందని, దానిపై ఆర్థిక ఆంక్షల ద్వారా అడ్డుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ఇరాన్‌తో యుద్ధం తన రాజకీయ భవిష్యత్తును ఏమీ దెబ్బతీయబోదని, మిడ్‌టర్మ్ ఎన్నికల్లో తాను అభ్యర్థిని కాదని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఆయుధాల కొరతతో ఇబ్బందిపడుతోందన్న వార్తలను ట్రంప్ కొట్టిపారేశారు. తాము సుదీర్ఘ కాలం యుద్ధం కొనసాగించడానికి కావాల్సినన్ని ఆయుధాలున్నాయని స్పష్టం చేశారు. సుంకాలపై ఇటీవల చేసిన చట్టం ద్వారా తనకు సంక్రమించిన అధికారాలను ఉక్రెయిన్ యుద్ధం ఆపడానికి వాడతానని ట్రంప్ తెలిపారు. వేల మంది చనిపోతున్న విధ్వంసకర రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపాలని తాము కోరుతూనే ఉన్నామని స్పష్టం చేశారు. ''అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 8 యుద్ధాలను ఆపడం గర్వకారణంగా ఉంది. ఆ దేశాల నేతలతో ఉన్న స్నేహపూర్వక సంబంధాలే దీనికి కారణం. ఇందులో కొన్ని యుద్ధాలు ఏళ్లపాటు, దశాబ్దాలపాటు జరిగాయి. ఇందులో భారత్, పాకిస్థాన్ యుద్ధం కూడా ఉంది. ఈ దేశాలన్నీ నాకు కృతజ్ఞత లేఖలు రాశాయి. భారత్, పాక్ యుద్ధాన్ని ఆపడంద్వారా 3 కోట్ల మంది ప్రాణాలను కాపాడారని పాక్ ప్రధాని నన్ను ప్రశంసించారు. ఆర్మేనియా, అజ్బజాన్, కంబోడియా దేశాల నేతలు ప్రత్యేకంగా నన్ను ప్రశంసించారు'' అని ట్రంప్ పేర్కొన్నారు.

# రెండు డీఏలకు ఓకే చెప్పిన ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం బ్యూరో) : ఉద్యోగ సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. ఈమేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఉద్యోగ సంఘాల నేతలు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా మరో మూడు నాలుగు నెలల తరువాత మరో డీఏ ఇచ్చేందుకు సైతం అంగీకరించింది. అంతే కాకుండా ఈనెలలోనే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చింది.



దీంతో పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని, గడువులోపే పీఆర్సీ ప్రకటించాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఆ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం సచివాలయం మీడియా పాయింట్ వద్ద తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ సీఎస్ ఆధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కమిటీ మీటింగ్ జరిగిందన్నారు. మొత్తం 68 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామనీ, ఇందుకు సానుకూల హామీ లభించిందని వెల్లడించారు. తాము మూడు డీఏలు అడిగామనీ, 3.46 శాతం డిమాండ్‌తో ఒక డీఏ, రెండో డీఏను 2.74 శాతంతో ఇచ్చేందుకు అంగీకారం తెలిపిందని చెప్పారు. మూడో డీఏను మూడు నాలుగు నెలల్లో ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. పీఆర్సి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు అధ్యయనానికి ఉద్యోగ సంఘాల నేతలు అధికారులతో కమిటీ వేస్తామన్నారని తెలిపారు. కమిటీ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక ఇవ్వనుంది. గతంలో ఒకటో తారీఖున జీతాలు పొందేందుకు పోరాటం చేశాం. ఇప్పుడు ఒకటో తారీఖున జీతాలు పొందుతున్నాం. ఈ ప్రభుత్వం ఒక్కో సమస్యను పరిష్కారిస్తోందని వివరించారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వంతో చర్చల అనంతరం ఉద్యోగ సంఘాలు చెరో దారిలో వెళ్లాయి. రెండు డీఏలకు మాత్రమే అంగీకరించడం పట్ల టీఎన్జీవో, టీజీవో సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి.

# ఐదేళ్ల బీటెక్' పరిశీలించండి

## ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ ప్రతిపాదన

ఢిల్లీ, సెప్టెంబర్ 23 : ఇటీవల బాంబే ఐఐటీలో ఓ విద్యార్థి ఆత్మహత్యపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రామ్ గోపాల్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యా ప్రమాణాలు తగ్గకుండా విభిన్న నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులకు ఫ్లెక్సిబుల్ లెర్నింగ్ విధానాన్ని అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థుల అభ్యసన వేగం, వారి అకడమిక్ ప్రిపరేషన్లో అంతరాలను అధిగమించేందుకు ఐఐటీల్లో ఐదేళ్ల బీటెక్ ప్రోగ్రామ్లను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలించాలని ప్రతిపాదించారు. విద్యార్థుల నేపథ్యం, వారి సామర్థ్యాల్లో తేడాలను ప్రస్తుతం ఐఐటీల్లో ఉన్న 'అందరికీ ఒకేరకమైన విధానం' పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులంతా ఒకే వేగంతో నేర్చుకోలేరనే విషయాన్ని గమనించి విద్యా ప్రమాణాలను పాటిస్తూ.. అందుకనుగుణంగా వారికి తగిన సమయం, సహకారం అందించాల్సి అవసరం ఉందన్నారు. ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య ఘటనతో ప్రొఫెసర్ డి.సూర్యనారాయణ చుట్టూ వివాదం నెలకొనడంపై రామ్గోపాల్రావు ఆవేదన వ్యక్తం చేశారు. ''ప్రొఫెసర్ డి.సూర్యనారాయణపై జరుగుతోన్న దుష్ప్రచారం నన్ను కలవరపరిచింది. సూర్యానారాయణ నాకు వ్యక్తిగతంగా తెలుసు. ఆయన అత్యుత్తమ అధ్యాపకుల్లో ఒకరు. నైతిక విలువలు ఉన్న వ్యక్తి. ప్రస్తుతం వ్యక్తమవుతున్న ఆందోళనలను నిష్పాక్షికంగా పరిశీలించాలి తప్ప.. ఓ వ్యక్తికి వ్యతిరేకంగా బహిరంగ ప్రచారం చేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు'' అన్నారు. 'ప్రస్తుతం ఎక్కువమంది విద్యార్థులు కోచింగ్ సంస్కృతి నుంచి వస్తున్నారు. రకరకాల ర్యాంకులు సాధించిన విద్యార్థులందరూ తరగతి గదుల్లో ఒకచోట కలుస్తున్నారు. వీరంతా ఒకే వేగంతో నేర్చుకుంటారని ఆశించలేం. వివిధ నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఐఐటీలు తలుపులు తెరవడంలో తప్పులేదు.. కానీ, బోధన, అభ్యసన పద్ధతుల్లో ఈ వైవిధ్యాన్ని ఐఐటీలు పరిగణనలోకి తీసుకున్నాయా? లేదా? అనేదే ప్రధానమైన ప్రశ్న. అధ్యాపకులు సైతం అన్ని తరగతుల్లోనూ ఒకే స్థాయిలో బోధించలేరు. నెమ్మదిగా చెబితే కొందరు విద్యార్థులు ఆసక్తిని కోల్పోతారు.. మరీ వేగంగా చెబితే మరికొందరు వెనకబడిపోతారు'' అని రామ్గోపాల్రావు వివరించారు.

# అత్యంత సంపన్నుడు అదానీ

ముంబై, సెప్టెంబర్ 23 : దేశంలో అత్యంత సంపన్నుడుగా అదానీ రికార్డు సృష్టించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని అధిగమించిన గౌతమ్ ఆదానీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు హురున్ ఇండియా రిచ్ లిస్ట్- 2026 వెల్లడించింది. అదానీ కుటుంబ ఆదాయం 13 శాతం పెరిగి రూ.9.23 లక్షల కోట్లకు చేరింది. ముకేశ్ అంబానీ కుటుంబ ఆదాయం 10 శాతం తగ్గి రూ.8.63 లక్షల కోట్లుగా నమోదైంది. అంబానీతో పోలిస్తే అదానీ ఆదాయ పరంగా రూ.59,400 కోట్ల ఆధిక్యంలో ఉండటం గమనార్హం.

ఈ రిచ్ లిస్ట్‌లో ఆర్సెలర్ మిట్టల్‌కు చెందిన ఎల్.ఎన్.మిట్టల్, ఆయన కుటుంబం మూడో స్థానంలో నిలిచింది. మిట్టల్ సంపద 93 శాతం పెరిగి రూ.3.39 లక్షల కోట్లకు చేరింది.

**సంపన్న మహిళల్లోనూ పెరుగుదలే..**

గతేడాదితో పోలిస్తే 131 మంది మహిళలు కొత్తగా చోటు సంపాదించారు. వీరిలో రోష్ని నాడార్ మల్హోత్రా, ఆమె కుటుంబం రూ.2.79 లక్షల కోట్ల ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో పెరిగింది. గతేడాదిలో కొత్తగా 27 మంది బిలియనీర్లు చేరడంతో వీరి సంఖ్య 391 మందికి పెరిగింది. అత్యధిక సంపన్నులు గల నగరాల్లో ముంబయి అగ్రస్థానంలో నిలిచింది. బెంగళూరు, ఢిల్లీ.. రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.



# నిమ్స్‌లో వైరలవుతున్న 'అవినీతి వైరస్'

## కొనుగోలు నుంచి చికిత్స వరకూ అన్నిట్లోనూ చేతి వాటమే

## ఒకరి నుంచి ఒకరికి అంటుకుంటున్న అక్రమార్జన జబ్బు

## తక్షణమే ప్రక్షాళన చేయాలె

**హైదరాబాద్,సెప్టెంబర్ 23(మనం న్యూస్):** పేదప్రజల ప్రాణాలను నిలపాల్సిన హైదరాబాద్ నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) దగాపడుతోంది. 'ధర్మరక్షక' బాధ్యతలు నిర్వహించాల్సిన కొందరు పెద్దల స్వార్థం, అక్రమ సంపాదన కాంక్ష ఆ సంస్థను అనారోగ్య పాలు చేస్తున్నాయి. రోగాలను నయం చేయాల్సిన ఆవరణలో ఇప్పుడు 'అవినీతి వైరస్'విలయతాండవం చేస్తోంది. ఇటీవల ఏసీబీ దాడులు, వరుస సోదాలతో వెలుగు చూస్తున్న నిజాలు చూస్తుంటే.. నిమ్స్ వైద్యులకు కాక, అక్కడి కుర్చీల్లో కూర్చునే కొందరికి అక్రమాల జబ్బు పట్టుకుందనే ఆవేదన కలుగుతోంది. తాజాగా నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి భాస్కర్‌రావు ఇళ్లపై ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడులు, ఆపై వెలుగు చూసిన అక్రమాల చిట్టా..ఇక్కడ ఏ స్థాయి కుంభకోణం జరుగుతోందో కళ్లకు కడుతోంది. ఒకరిద్దరితో ఆగే తంతు కాదిది. లోగడ ముగ్గురు డైరెక్టర్ల హయాం నుంచి మొదలుకుని కింది స్థాయి అధికారుల వరకు ప్రతి కొనుగోలులోనూ నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వైనం విస్తుగొలుపుతోంది.

**నిబంధనలకు తిలోదకాలు..**

వైద్య పరికరాల కొనుగోళ్లలో నిమ్స్ పెద్దలు సాగించిన లీలలు అన్నీఇన్నీ కావు. 2011 నుంచి 2013 మధ్య కాలంలో రూ.80 కోట్లతో చేపట్టిన కొనుగోళ్లలో సాగిన దోపిడీ అంతా ఇంతా కాదు. ఏడాది కాలంలో దశలవారీగా జరగాల్సిన కొనుగోళ్లను కేవలం ఒక్క నెల వ్యవధిలో ఏకపక్షంగా, కనీసం టెండర్లు కూడా పిలవకుండా పూర్తిచేశారు. అప్పట్లో మాజీ డైరెక్టర్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్, ఫైనాన్షియల్ కంట్రోలర్‌ల ఇళ్లపై ఏసీబీ దాడులు జరగడం, లెక్కకు మించి ఆస్తులు పట్టుబడడం ఈ వ్యవస్థ ఎంతలా దిగజారిందో చెప్పకనే చెబుతోంది. ఐసీయూల కోసం ఒక్కో ఫంక్షన్ మంచం రూ.18 వేలు పెట్టి 600 కొనుగోలు చేయగా, ఇంటెన్సివ్ కేర్ వార్డుల కోసం ఒక్కోటి రూ.56 వేల చొప్పున 260 మంచాలు కొనుగోలు చేశారు. పాత మంచాలు పటిష్టంగా ఉన్నా, కొత్త వాటి కోసం ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు పెట్టారు. మార్కెట్లో సాధారణ ధరలు రెండు, మూడు లక్షలు మాత్రమే ఉండే వెంటిలేటర్‌లను రూ.9.56 లక్షల భారీ ధరకు 95 యూనిట్లు కొనుగోలు చేశారు. అవసరం లేకున్నా వందల సంఖ్యలో వెంటిలేటర్‌లు కొని, మార్కెట్ ధర కంటే ఎన్నో రెట్లు చెల్లించి కోట్ల రూపాయలు అక్రమంగా చేతులు మార్చారు. అలాగే రూ.42 లక్షల విలువ చేసే ఆపరేషన్ టేబుళ్లు, అనస్థీషియా వర్క్‌స్టేషన్‌లు, రేడియాలజీ, యూరాలజీ మిషన్లను ఎల్-1, ఎల్-2 నాణ్యమైన కంపెనీలను విడిచిపెట్టి, నాసిరకం ఎల్-3 కంపెనీల నుంచి విపరీతమైన ధరలకు కొనుగోలు చేసి నిమ్స్ ఖజానాకు తూట్లు పొడిచారు.

**నిధుల దారి మళ్లింపు..**

కేంద్ర ప్రభుత్వం పీఎంఎస్ఎస్‌వై కింద ట్రామా కేర్ సెంటర్, స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం కోసం రూ.150 కోట్లు మంజూరు చేస్తే.. నిబంధనల ప్రకారం అందులో సగం మాత్రమే భవనాలకు, మిగతాది వైద్య పరికరాలకు వెచ్చించాలి. కానీ, నిమ్స్‌లోని కొందరి కన్ను ఆ నిధులపై పడింది. అక్రమాలకు వంతపాడుతూ నిధులను ఇష్టానుసారంగా మళ్లించారు. గత ప్రభుత్వాల హయాంలో వచ్చిన కోట్లాది రూపాయల నిధులను కూడా భవనాలు, పరికరాల కొనుగోళ్ల ముసుగులో క్కదారి పట్టించి, అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు.

**డైరెక్టర్ ఎలాంటి చర్యలు చేపట్టాలె?**

నిమ్స్‌లో తిష్టవేసిన ఈ అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకిలించివేయడానికి ప్రస్తుత డైరెక్టర్ రాహుల్ దేవరాజు కఠినమైన ప్రక్షాళన చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో జరిగిన ప్రతి కొనుగోలుపై సిట్టింగ్ జడ్జితో లేదా సమగ్ర సిబిఐ,ఏసీబీ విచారణకు ఆయన పూర్తిస్థాయిలో సహకరించి,దోషులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పరిపాలనా విభాగంలో పారదర్శకతను తీసుకురావడానికి డిజిటల్ టెండర్ల విధానాన్ని,ఈ-ప్రొక్యూర్‌మెంట్‌ను కచ్చితంగా అమలు చేసేలా పకడ్బందీ నిబంధనలను తేవలసి ఉంది. రోగులకు మెరుగైన వైద్యం అందకుండా నిధులను గోల్మాల్ చేసిన అధికారులపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు, వారి అక్రమాస్తులను జప్తు చేసే దిశగా ప్రభుత్వానికి బలమైన సిఫార్సులు చేయాలి. పేదల ధవాఖానలో వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఆయన తీసుకునే కఠిన నిర్ణయాలే నిమ్స్ పరువును నిలబెడతాయి.

**ప్రక్షాళన ఎప్పుడు?**

వైద్య విద్యకు, పేదల ప్రాణాలకు ఆలవాలం కావాల్సిన నిమ్స్ ఆసుపత్రి ఇలా అవినీతి కూపంగా మారుతుండడం రాష్ట్ర ప్రజలను కలవరపెడుతోంది. ఏసీబీ దాడులు, విజిలెన్స్ విచారణలతో కొద్ది రోజులు గందరగోళం సృష్టించి, ఆ తర్వాత మళ్లీ పాత కథే నడిపించడం పరిపాటిగా మారింది. ఈ 'అవినీతి జబ్బు'ను సమూలంగా కూకటి వేళ్లతో సహా పెకిలించకపోతే.. నిమ్స్ భవిత ప్రశ్నార్థకంగా మారడమే కాక, పేదవాడి నమ్మకం వమ్ము కాక తప్పదు. ప్రభుత్వాలు మారినా, అధికారుల పేర్లు మారినా నిమ్స్ తీరు మాత్రం మారడంలేదనే అపవాదును తొలగించేందుకు డైరెక్టర్ రాహుల్ దేవరాజు బలమైన చర్యలు చేపట్టక తప్పదు.

# ఫార్మసిస్ట్ జాబ్ మేళా

## అపోలో ఫార్మసీ సహకారంతో ఏర్పాటు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23(మనం న్యూస్):** అపోలో ఫార్మసీ సహకారంతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. అపోలో ఫార్మసీలో ఖాళీగా ఉన్న 50 ఫార్మసిస్ట్, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ పోస్టులను ఈ ఉద్యోగ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు ఈ ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,583 నుంచి రూ.25,000 వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్‌ల జిరాక్స్ ప్రతులతో నేరుగా ఈనెల 30న ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరోలో హాజరుకావాలని సూచించారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం అపోలో హెచ్ఆర్ ప్రతినిధి టి. రఘుపతిని 8247656356 నంబరులో సంప్రదించవచ్చని ఆ ప్రకటన తెలిపింది.

## జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు

# కర్ణాటక అంగీకారం

**బెంగళూరు, సెప్టెంబర్ 23:** తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ అంగీకారం తెలిపారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు ఆ రాష్ట్ర సీఎం, అధికారులతో మరోసారి భేటీ అయ్యారు. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలు, రైతుల సమస్యలను నేతలు డీకే శివకుమార్, ఆ రాష్ట్ర ఇరిగేషన్ అధికారులకు వివరించారు. దీంతో నీటి విడుదలకు కర్ణాటక సీఎం అంగీకారం తెలిపారు.

# సచివాలయంలో నో ఇంటర్నెట్ సేవలు



## పౌర సేవలకు తీవ్ర అంతరాయం

## ఫెయిల్యూర్ ప్రభుత్వం అని బీఆర్ఎస్ నేతల ధ్వజం

**హైదరాబాద్, జులై 21, మనం ప్రతినిధి :** డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినట్లు విస్వాసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. దీంతో పలు శాఖల్లో పౌర సేవలు, ప్రభుత్వ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.
ఎక్కడి ఫైళ్లు అక్కడే ఆగిపోయాయి. మీడియా సెంటర్, పబ్లిసిటీ సెల్, ఎన్ఆర్ఐ అసిస్టెన్సీ సెల్లోనూ ఇంటర్నెట్ పనిచేయలేదు. ఇంటర్నెట్ సేవలు ఒక్కసారిగా నిలిచిపోవడంతో అధికార యంత్రాంగంతో పాటు విజిటర్స్ కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం ఏంటని ఆయా పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే విజిటర్స్ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు..? ఇంత పెద్ద వ్యవస్థలో ఇంటర్నెట్ సేవలు పని చేయకపోతే.. రాష్ట్రంలో పరిపాలన ఎలా ముందుకు సాగుతుందని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

# తెలంగాణ సంస్కృతి చాటాలె

## ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** రాష్ట్రంలో నిర్వహించబోయే 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను కేవలం పెట్టుబడుల సమీకరణకే పరిమితం కాకుండా, తెలంగాణ సంప్రదాయాలు, సాంస్కృతిక విశిష్టతలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఉండాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఫైవ్ స్టార్ హోటళ్ల వాతావరణం దేశవ్యాప్తంగా ఎక్కడైనా సాధారణంగానే ఉంటుందని, అయితే మన రాష్ట్ర ప్రత్యేకతను విదేశీ, జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు బుధవారం సచ్చివలయంలో సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి.. బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు ఈ ఈవెంట్‌లో ప్రధానంగా ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారిణి హరిచందనకు సూచించారు. బతుకమ్మ వంటి పండుగల నిర్వహణ మనకు కొత్తేమీ కాదని, గతంలోనూ సమర్థవంతంగా నిర్వహించామని గుర్తు చేస్తూ.. సాంస్కృతిక శాఖ సమన్వయంతో దీనిని మరింత అద్భుతంగా తీర్చిదిద్దాలని మంత్రి ఆదేశించారు. సాధారణ హోటళ్ల వాతావరణం అంతర్జాతీయ, జాతీయ అతిథులకు ప్రత్యేకంగా అనిపించకపోవచ్చని, కాబట్టి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడానికి ఇదొక చక్కటి అవకాశమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి దాదాపు రెండు నుంచి మూడు వేల మంది ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో.. వారికి మన సంస్కృతి ఒక దృశ్యకావ్యంగా నిలిచిపోవాలని అభిప్రాయపడ్డారు.ఢిల్లీలో జరిగిన జీ-20, బ్రిక్స్ సమ్మిట్‌ల తరహాలోనే సాయంత్రం వేళల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు మన వారసత్వాన్ని సమున్నతంగా చాటిచెప్పేలా ప్లాన్ చేయాలన్నారు. రాష్ట్రానికి ప్రధానంగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమైనప్పటికీ, అంతర్జాతీయ వేదికపై నూతన తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని మంత్రి శ్రీధర్ బాబు ఉద్ఘాటించారు.

# రేపు గణేశ నిమజ్జనం

## వైన్స్, బార్లు బంద్

## స్టార్ హోటళ్లకు మినహాయింపు

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల రేపు (ఈ 25న శుక్రవారం) జరగనున్న ప్రధాన గణేశ్ మహా నిమజ్జనం కోసం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు ముఖ్యమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి. మహా నిమజ్జనం, భారీ శోభాయాత్రల వల్ల నగరంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 25న తెలంగాణ హైకోర్టుతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబార్డినేట్ కోర్టులన్నింటికీ సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవుకు బదులుగా డిసెంబర్ 5వ తేదీ శనివారాన్ని వర్కింగ్ డేగా ప్రకటించారు.

మరోకవైపు ప్రశాంత వాతావరణంలో వేడుకలు పూర్తి కావడానికి వీలుగా మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 25న ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26 ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. అయితే స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయింపునిచ్చారు.

# ఉద్యోగ సంఘాల నేతల్లో లుకలుకలు

## ప్రభుత్వంతో చర్చల్లో చెరో దారి

## రెండు డీఏల ప్రభుత్వ ప్రతిపాదనకు ఒప్పకోం

## నేడు టీజీఈజేఏసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం

## ట్రెసా అధ్యక్షుడు గౌతమ్ కుమార్

**హైదరాబాద్, సెప్టెంబర్ 23, (మనం బ్యూరో) :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతిపాదించిన రెండు డీఏలను ఒప్పుకునేది లేదని ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు కె.గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమన్ రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం గురువారం జేఏసి సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. బుధవారం ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో జెఏసి ఐదు డీఏలు కోరగా ప్రభుత్వం రెండు డీఏల విడుదలకు మాత్రమే అంగీకరించిందనీ, అందులో ఒకటి ఇప్పుడు మరొకటి ఉగాది వరకు విడుదల చేస్తామనీ, దానికి క్యాబినెట్ ఆమోదం కోసం దస్త్రం కోసం పంపిస్తామని ప్రతిపాదించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. పీఆర్సీ కమిటీ నివేదిక వెంటనే ఇవ్వమని కోరగా, ఒక నెల తరువాత తెప్పించుకుంటామని, సీపీఎస్‌పై కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపినప్పటికీ నిర్దిష్ట కాలాన్ని వెల్లడించలేదనీ, అలాగే, పెండింగ్ బిల్లుల నిధుల పెంపుపై ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. ఈ ప్రతిపానదలపై టీజీజెఏసితో పాటు ట్రెసా పూర్తి అసంతృప్తి వ్యక్తం చేసిందనీ, ప్రభుత్వ ప్రతిపాదనలు ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సమావేశం నుంచి బాయ్‌కాట్ చేయడం జరిగిందన్నారు. గురువారం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో అన్ని అనుబంధ సంఘాలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్, రమన్ కుమార్ వెల్లడించారు.

# శిశు మరణాలు ప్రభుత్వ హత్యలే

## రిమ్స్‌ను సందర్శించిన బీఆర్ఎస్ బృందం

## ఒక్కో బాధిత కుటుంబానికి లక్ష సహాయం ప్రకటించిన నాయకులు

## రూ. 25 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వానికి డిమాండ్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని బీఆర్ఎస్ మహిళా నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు బుధవారం సందర్శించారు. మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న,ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, తుల ఉమా సందర్శించిన వారిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. ఒక లక్ష సహాయాన్ని బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు బుధవారంనాడు బీఆర్ఎస్ సభ్యుల బృందం అగ్నిప్రమాద స్థలాన్ని, ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం బీఆర్ఎస్ పార్టీ తరపున ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం రూ. 25 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈఘటనలో ఇప్పటి వరకు ఐదుగురు చిన్నారుల మృతి చెందగా మరికొందరు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు.

**శిశువుల మరణాలు ప్రభుత్వ హత్యలే : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

అనంతరం బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. రిమ్స్ అగ్ని ప్రమాదంలో ఐదుగురు చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. చిన్నపిల్లలు చికిత్సలు పొందే ఎస్ఎంసీయులో కనీస సౌకర్యాలు లేవని, ఏసీల నిర్వహణను అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని విమర్శించారు. మరణించిన చిన్నారుల తల్లిదండ్రుల శాపనార్థాలు రేవంత్ రెడ్డికి తగులుతాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించామని, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ చొప్పున ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో వైద్యులను నియమించడంతోపాటు మందులను సైతం అందుబాటులో నుంచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. రిమ్స్ సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేసింది ఏమీ లేదన్నారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు.







# రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే

## ప్రభుత్వంపై కల్వకుంట్ల కవిత ఫైర్

## బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ కేర్ యూనిట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని హితవు పలికారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

**బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ : కవిత**

ఆదిలాబాద్ రిమ్స్ మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో 20 మంది చిన్నారులు పలు ప్రైవేటు హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన ఘటనాస్థలిని బుధవారం పరిశీలించిన అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై తెలంగాణ రక్షణ సమితి చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే పసికందుల మృతికి కారణమని ఆమె ఆరోపిస్తూ బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిమ్స్‌లో సిబ్బంది, మౌలిక వసతుల కొరత ఉందని విమర్శించారు. నెల రోజుల్లో ఆసుపత్రి బకాయిలు చెల్లించి, ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆదివాసీలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా పరిస్థితులపై సమగ్ర ఫోరెన్సిక్, ఫైర్, ఎలక్ట్రికల్, నిర్మాణ భద్రతా ఆడిట్ నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో శిశువులు, గర్భిణుల మరణాలు, వైద్య సేవలపై తమ పార్టీ తరఫున ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర అధ్యయనం చేస్తామని ప్రకటించారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనకు సంబంధించి కారణాలు, భద్రతా ప్రమాణాలు, నిర్వహణలో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై నిపుణుల కమిటీ విచారణ చేపట్టనుంది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా ఆడిట్లు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## రిమ్స్ ఘటనను సుమోటోగా తీసుకున్న హెచ్ఆర్సీ..

- **పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశం**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్లో ప్రమాదంలో చిన్నారుల మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో 20 మంది చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అయితే, ప్రమాదం తర్వాత హైదరాబాద్ నీలోఫర్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. చికిత్స పొందుతున్న మరోచిన్నారి పరిస్థితి విషమంగా ఉందని తెలిస్తోంది. వార్డులో సుమారు 30 మంది చిన్నారులు ఉండగా, పలువురు అస్వస్థతకు గురయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

రిమ్స్ ఘటనను సుమోటోగా తీసుకున్న హెచ్ఆర్సీ.. నివేదిక ఇవ్వాలని ఆదేశం ఆదిలాబాద్ రిమ్స్ అగ్నిప్రమాద ఘటనను మానవ హక్కుల సంఘం సీరియస్‌గా తీసుకుంది. పలు వార్త పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై సుమోటోగా కేసు స్వీకరించింది. అగ్ని ప్రమాదానికి దారితీసిన వాస్తవ పరిస్థితులు, శిశువుల మృతికి దారితీసిన కారణాలు, భద్రతా, నిర్వహణ ఏర్పాట్లు, ప్రమాద సమయంలో చేపట్టిన రక్షణ, వైద్య చర్యలు, అలాగే ఈ ఘటనపై నిర్వహించిన విచారణకు సంబంధించిన అంశాలను నిర్ధారించుకోవడం అవసరమని కమిషన్ భావించింది. అయితే, ఈ ఘటనకు సంబంధించిన సమగ్ర నివేదికను తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి సమర్పించాల్సిందిగా కమిషన్ ఆదేశించింది. అగ్ని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, రిమ్స్‌లో భద్రత, నిర్వహణ ఏర్పాట్లు, ప్రభావిత శిశువుల రక్షణ, చికిత్సకు తీసుకున్న చర్యలు, అలాగే ఘటనపై నిర్వహించిన విచారణలో వెలువడిన అంశాలను నివేదికలో పొందుపరచాలని కోరింది.

## పక్షే నిత్య గురువు!

పక్షికి
పాఠశాల లేదంటే
గురువూ లేనట్లే!

రెక్కలొస్తే చాలు
తల్లి గూడుకు సైతం
నిరాపేక్ష వీడుకోలు!

స్వీయ పరిశీలనతోనే
నిత్య ఆకాశ విహారం
ఆహార అన్వేషణం!

సరిహద్దుల్లేని రాజ్యంలో
దానికి ప్రభువులు పోలీసుల్లేరు
నింగీ నేలా మధ్య ఏ నిబంధనల్లేవ్!

ఆకలైతే చాలు
వేట మొదలైతది
కడుపు నిండితే చెట్టు గుర్తొస్తది!

బంధాలు లేవు
రక్త సంబంధాలు లేవు
మైమరిస్తే కొమ్మ చాటుగానం!

ఉరుములురిమి
నదీ నదాలు ఉప్పొంగి పారుతుంటే
చేప పిల్ల నోటి కందితే అది అలెగ్జాండరే!

దారెంటా
కుప్పకూలిన పక్షి కనిపిస్తే
ఆకాశమెత్తరిచి సమాచారం చేరవేస్తది!

వలల్ని మనం విసురుతాం
అది మనిషిని నమ్మినప్పుడల్లా
అశువులు కోల్పోతుంది!

నిత్యం పలు భయాల మధ్య
నలిగిపోయే నాగరికపు మనిషికి
పక్షే నిత్య గురువు!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# పీఎంశ్రీ పాఠశాలలే భవిష్యత్తు



భవిష్యత్ భారతానికి పీఎం శ్రీ పాఠశాల విద్యకు చిరునామా అయితే గ్రంథాలయం జ్ఞానానికి హృదయం. భారత దేశ పాఠశాల విద్యా వ్యవస్థ నేడు ఒక కొత్త మలుపు తిరుగుతోంది. ఒకప్పుడు పాఠశాల అంటే తరగతి గది, బ్లాక్‌బోర్డు, పాఠ్యపుస్తకం, పరీక్షలు అనే పరిమిత భావన ఉండేది. కానీ నేటి విద్యార్థి ప్రపంచం మరింత విశాలమైంది. చేతిలోని చిన్న తెరపై ప్రపంచ జ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో విద్య అంటే కేవలం పాఠ్యాంశాలను కంఠస్థం చేయడం కాదు. ఆలోచించడం, ప్రశ్నించడం, అన్వేషించడం, సృజించడం, నేర్చుకోవడం, అవసరమైతే నేర్చుకున్నదాన్ని మరచి కొత్తగా నేర్చుకోవడం. ఈ మారుతున్న విద్యా దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (PM SHRI) పథకం పాఠశాల విద్యలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. 2022 సెప్టెంబర్ 7న ప్రారంభమైన ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 14,500కు పైగా ఉన్న పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. 2026 జూలై నాటికి 13,092 పాఠశాలలు పీఎం శ్రీ పాఠశాలలుగా ఎంపిక కావడం ఈ ప్రయాణం ఎంత విస్తృతంగా సాగుతోందో తెలియజేస్తోంది.

ఈ పథకానికి 2022-23 నుంచి 2026-27 వరకు ₹27,360 కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయం కేటాయించబడింది. అయితే ఒక ఆదర్శ పాఠశాల అంటే కేవలం అందమైన భవనం, స్మార్ట్ తరగతి గదులు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు మాత్రమే కాదు. ఆ పాఠశాలలో పుస్తకం పట్ల ప్రేమ, జ్ఞానం పట్ల ఆసక్తి, ప్రశ్నించే మనస్తత్వం, చదివే సంస్కృతి ఉంటేనే అది నిజమైన ఆదర్శ పాఠశాల అవుతుంది.

గ్రంథాలయం - పాఠశాల విద్యకు ప్రాణహితం. తరగతి గది విద్యార్థికి పాఠాన్ని నేర్పుతుంది. గ్రంథాలయం జీవితాన్ని చదవడం నేర్పుతుంది. పీఎం శ్రీ పాఠశాలల లక్ష్యాలను పరిశీలిస్తే పాఠశాల గ్రంథాలయాలకు మరింత విస్తృతమైన పాత్ర కల్పించాల్సిన అవసరం స్పష్టమవుతుంది. పాఠశాలలోని గ్రంథాలయం ఒక గది కాదు. అది విద్యార్థి కలలకు తొలి వేదిక, ప్రశ్నలకు తొలి చిరునామా, ఊహాశక్తికి తొలి రెక్క.

ఒక చిన్నారి తొలిసారి కథల పుస్తకాన్ని తెరిచినప్పుడు అతని ముందు ఒక కొత్త ప్రపంచం తెరుచుకుంటుంది. ఒక చరిత్ర పుస్తకం చదివినప్పుడు గతాన్ని తెలుసుకుంటాడు. విజ్ఞాన గ్రంథం చదివినప్పుడు ప్రకృతి రహస్యాలను అన్వేషిస్తాడు. జీవిత చరిత్ర చదివినప్పుడు మహనీయుల పోరాటాల నుంచి స్ఫూర్తి పొందుతాడు. సాహిత్యం చదివినప్పుడు మానవత్వాన్ని అర్థం చేసుకుంటాడు. అందుకే పాఠశాల గ్రంథాలయం పుస్తకాల నిల్వ కేంద్రం కాదు. వ్యక్తిత్వ నిర్మాణ కేంద్రం.




పుస్తకం నుంచి డిజిటల్ జ్ఞానం వరకు పీఎం శ్రీ పాఠశాలలు సాంకేతికతను విద్యలో భాగం చేస్తున్నాయి. ఐసిటి సౌకర్యాలు, స్మార్ట్ తరగతి గదులు, ఇంటర్నెట్, స్టెమ్ కార్యక్రమాలు, SIK-SHA వంటి డిజిటల్ వేదికలు విద్యార్థులకు విస్తృతమైన అభ్యాస అవకాశాలను అందిస్తున్నాయి. అయితే డిజిటల్ ప్రపంచం ఎంత విస్తరించినా పుస్తకానికి ఉన్న విలువ తగ్గదు. నిజానికి భౌతిక పుస్తకం-డిజిటల్ పుస్తకం-ఈ-వనరులు-ఆడియో విజువల్ వనరులు అన్నింటినీ కలిపిన ఆధునిక పాఠశాల గ్రంథాలయమే భవిష్యత్ విద్యకు సరైన వేదిక.

డిజిటల్ తెర జ్ఞానాన్ని వేగంగా అందించవచ్చు. కానీ పుస్తకం ఆ జ్ఞానాన్ని మనసులో లోతుగా నాటుతుంది. పీఎం శ్రీ పాఠశాలల్లో సంస్కృతం, ఉర్దూ, ప్రాంతీయ భాషలకు చెందిన వేలాది మంది ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారు.ఈ నేపథ్యంలో పాఠశాల గ్రంథాలయాల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఇంగ్లిష్‌తోపాటు స్థానిక భాషల బాలసాహిత్యం అందుబాటులో ఉండాలి. ఎందుకంటే పిల్లవాడు తన మాతృభాషలో చదివిన కథను కేవలం చదవడు. దాన్ని అనుభవిస్తాడు. మాతృభాషలో చదివిన పుస్తకం బాలుడి కళ్లకు అక్షరాలను మాత్రమే కాదు హృదయానికి అనుభూతులను అందిస్తుంది.

చదివే పాఠశాలే ఆలోచించే పాఠశాల పీఎం శ్రీ పథకం అనుభవాత్మక, ప్రశ్నాధారిత, విద్యార్థి కేంద్రిత అభ్యాసానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించగలవు. పాఠశాలల్లో Reading Hour, Book Review, Storytelling, Library Quiz, Essay Writing, debate, Reading Clubs, Author Interaction, Newspaper Reading, Current Affairs Corner వంటి కార్యక్రమాలను నిర్వహిస్తే విద్యార్థుల్లో పఠన అలవాటు పెరుగుతుంది. పుస్తకం చదివిన విద్యార్థి ప్రశ్నిస్తాడు. ప్రశ్నించిన విద్యార్థి ఆలోచిస్తాడు. ఆలోచించిన విద్యార్థి సృజిస్తాడు. చదివే పిల్లవాడు పరీక్షను మాత్రమే కాదు జీవితాన్ని కూడా ఎదుర్కోవడం నేర్చుకుంటాడు.

హరిత పాఠశాల- జ్ఞాన పాఠశాల పీఎంశ్రీలో Green School భావనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను విద్యార్థులకు ఆచరణలో నేర్పాలి. ఇక్కడ కూడా గ్రంథాలయం ఒక జ్ఞాన కేంద్రంగా నిలవాలి. పర్యావరణం, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్యం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక పుస్తక విభాగాలను ఏర్పాటు చేయాలి. పచ్చని ప్రాంగణం పాఠశాలకు అందాన్ని ఇస్తే పుస్తకాల పరిమళం ఆ పాఠశాలకు ఆత్మను ఇస్తుంది.

ఉపాధ్యాయుడు మార్గదర్శి. గ్రంథపాలకుడు జ్ఞాన సహచరుడు. పీఎంశ్రీలో ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం. అయితే ఆధునిక పాఠశాలలో గ్రంథపాలకుడి పాత్రను కూడా మరింత బలోపేతం చేయాలి. గ్రంథపాలకుడు కేవలం పుస్తకాలు ఇచ్చే వ్యక్తి కాదు. విద్యార్థి ఆసక్తిని గుర్తించి సరైన పుస్తకాన్ని సూచించే జ్ఞాన మార్గదర్శి. డిజిటల్ వనరులను ఎలా ఉపయోగించాలి? విశ్వసనీయ సమాచారాన్ని ఎలాగుర్తించాలి? తప్పుడు సమాచారాన్ని ఎలా నివారించాలి? పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని ఎలా సేకరించాలి? వంటి అంశాల్లో విద్యార్థులకు గ్రంథపాలకుడు మార్గనిర్దేశం చేయగలడు.

13,092 పాఠశాలలు - ఒక జ్ఞానోద్యమానికి అవకాశం. దేశవ్యాప్తంగా ఇప్పటికే 13,092 పీఎం శ్రీ పాఠశాలలు ఎంపిక కావడం ఒక సంఖ్య మాత్రమే కాదు. అది లక్షలాది బాలల భవిష్యత్తుతో ముడిపడిన ఒక మహత్తర బాధ్యత. ఈ పాఠశాలలు తమ పరిసర ప్రాంతాల్లోని ఇతర పాఠశాలలకు మెంటరింగ్, సహకారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పీఎంశ్రీ పాఠశాలలో అభివృద్ధి చెందిన గ్రంథాలయాన్ని చుట్టుపక్కల పాఠశాలలకు జ్ఞాన కేంద్రంగా ఉపయోగించవచ్చు. పుస్తక ప్రదర్శనలు, సంయుక్త పఠన కార్యక్రమాలు, మొబైల్ లైబ్రరీలు, డిజిటల్ లైబ్రరీ సేవలు, పఠనోత్సవాలు నిర్వహించడం ద్వారా ఒక పాఠశాలలో మొదలైన పఠనోద్యమాన్ని అనేక పాఠశాలలకు విస్తరించవచ్చు.

భవిష్యత్ భారతానికి పుస్తకమే పునాది. పీఎం శ్రీ పథకం పాఠశాల విద్యను కేవలం మౌలిక వసతుల అభివృద్ధి నుంచి సమగ్ర, సమాన, సమ్మిళిత, భవిష్యత్‌కు సిద్ధమైన విద్యా వ్యవస్థ వైపు తీసుకెళ్లే ప్రయత్నం. కానీ భవిష్యత్ భారతదేశాన్ని నిర్మించేది కేవలం సాంకేతికత కాదు. సాంకేతికతకు మానవత్వాన్ని, జ్ఞానానికి విలువలను, విద్యకు ఆలోచనను, పాఠశాలకు పఠన సంస్కృతిని జోడించాలి. అందుకే పీఎంశ్రీ పాఠశాలలో ఒక సజీవమైన, ఆధునికమైన, సమృద్ధమైన గ్రంథాలయం ఉండాలి. ప్రతి విద్యార్థి చేతిలో ఒక పుస్తకం ఉండాలి. ప్రతి పాఠశాలలో ఒక పఠన గంట ఉండాలి. ప్రతి గ్రామంలో పుస్తకం గురించి మాట్లాడే వాతావరణం ఏర్పడాలి.

పాఠశాలలు భవిష్యత్‌ను నిర్మిస్తాయి.గ్రంథాలయాలు ఆ భవిష్యత్‌కు ఆలోచనను అందిస్తాయి. ప్రతి పాఠశాల ఆదర్శ పాఠశాల కావాలి. ప్రతి తరగతి జ్ఞాన తరగతి కావాలి. ప్రతి విద్యార్థి పాఠకుడు కావాలి. ప్రతి పాఠశాల గ్రంథాలయం ఒక జ్ఞానదీపంగా వెలగాలి. అప్పుడు మాత్రమే పీఎం శ్రీ పాఠశాలల కల-జ్ఞానం, నైపుణ్యం, విలువలు, సృజనాత్మకత కలిగిన నూతన భారత పౌరుల నిర్మాణం-నిజమైన సాకారం అవుతుంది.

**- డాక్టర్ రవి కుమార్ చేగొని**

# ప్రపంచ శాంతి గాల్లో దీపం అయ్యిందా!



ప్రపంచవ్యాప్తంగా నేడు అశాంతి మేఘాలు కమ్ముకున్నాయి. ప్రత్యక్ష, పరోక్ష, ప్రచ్ఛన్న యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. శాంతి పావురాలు స్వేచ్ఛగా తిగలేని దుస్థితి వచ్చింది. ఏండ్ల తరబడి యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. 24 ఫిబ్రవరి 20 22న ప్రారంభంపైన ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేటికీ మారణహోమాన్ని నమోదు చేస్తూనే ఉన్నది. 7 అక్టోబర్ 2023న ప్రారంభమైన ఇజ్రాయిల్ - పాలస్తీనా (గాజా) యుద్ధం నేటికీ బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్నది. 28 ఫిబ్రవరి 2026 నుంచి నేటి వరకు అమెరికా/ఇజ్రాయిల్.. ఇరాన్ యుద్ధం కొనసాగుతూ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నది. ఈ యుద్ధాల్లో లక్షల ప్రాణాలు గాల్లో కలిసాయి. మిలియన్ల అమాయక ప్రజలు ప్రాణాలు అరచేతుల్లా పెట్టుకొని వలసలు వెళుతూనే ఉన్నారు లేదా శరణార్థి శిబిరాల్లో దుర్భర జీవితాలను గడుపుతూనే ఉన్నారు. భారత్ - పాకిస్థాన్ మధ్య అనిశ్చిత స్థితి కొనసాగుతూనే ఉన్నది. యుద్ధాలను, సంక్షోభాలను ఆపడానికి ఐరాస మధ్యవర్తిత్వం పనిచేయడం లేదు. ఐరాస పేపర్ టైగర్‌గా మారింది. ట్రంప్ నాటకాలు కూడా ప్రపంచ అశాంతికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలతో ప్రాణ ఆస్తి నష్టాలతో పాటు మానవ హక్కులు హననం చేయబడుతున్నాయి. రష్యా, ఇజ్రాయిల్ దేశాల నాయకులు పుతిన్, నేతన్యాహూల అనాలోచిత ఆలోచనలతో యుద్ధాలు తీవ్రరూపం దాల్చడానికి దోహదపడుతున్నాయి. అస్థిరత రాజ్యమేలు తున్నది. ఆధిపత్య ధోరిణి రెట్టింపు అవుతున్నది.

ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణం నెలకొనడానికి 1981లో ఐరాస తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ప్రతి ఏట 21 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ శాంతిదినం (ఇంటర్నేషనల్ పీస్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. శాంతి నెలకొన్నప్పుడు పేదరికం తగ్గుతుంది, సామాజిక సహనశీలత పెరుగుతుంది. శాంతి స్థాపనకు పెట్టుబడి పెట్టండి.. అందరికీ, ప్రతి



చోట, ప్రతి రోజు అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు ప్రపంచాన్ని సాయుధ పోరాటాలు, విపరీత వాతావరణ ప్రతికూల మార్పులు, భౌగోళిక ఆర్థిక సంక్షోభాలు, తప్పుడు వార్తలు లేదా సమాచారాల వ్యాప్తి, సామాజిక భావ విచ్ఛిన్నం, ఆర్థిక అడ్డంకులు, నిరుద్యోగం, మానవ హక్కుల ఉల్లంఘనలు, ఉగ్రవాదం, అసమానతలు లాంటివి ప్రపంచ శాంతిని హరిస్తున్నాయి.

నేడు 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే క్షణాల్లో ప్రపంచం కాలి బూడిద కావడం ఖాయంగా తోస్తున్నది. డిజిటల్ యుద్ధ నీతి భూమిని మరుభూమిగా మార్చగలదు. ప్రపంచ శత్రువులుగా పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అసమానతలు రాజ్యమేలుతున్న వేళ అత్యాధునిక ఆయుధాలతో రక్తపాత యుద్ధాలు అర్థరహితం. కోవిడ్ విపత్తు యుద్ధాన్ని గెలిచాం. వాతావరణ ప్రతికూల మార్పులతో పోరులో నెగ్గుదాం. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడం పట్ల నిలిచి గెలుద్దాం.

మానవత్వమే శాంతి మహా మంత్రంగా నిత్యం జపిద్దాం. స్వీయ నియంత్రణ, పరమత సహనాలతో శాంతి పావురాలు స్వేచ్ఛగా ఎగరాలి. యుద్ధాలతో శాంతి స్థాపన జరగదు. సంక్షోభాలతో సంక్షేమం ఫలించదు. చేతులు కలిపితే అభివృద్ధి, కయ్యానికి కాలు దువ్వితే అధోగతి తప్పదు. బాంబులతో విధ్వంసం, జవాబులతో వికాసం జరుగుతుంది. సరిహద్దులు చెరిగిపోయి, డిజిటల్ వలయంలో ప్రపంచమే కుగ్రామం అయిన వేళ శాంతి మాత్రమే మానవాళి శ్రేయస్సుకు పునాది అవుతుందని అని తెలుసుకోవాలి.

ప్రపంచ శాంతికి ఉపకరించే విధంగా పేదరిక, ఆకలి రహిత సమాజ స్థాపన, విద్య వైద్య లింగ అసమానతలు, క్లీన్ ఎనర్జీ-నీటి లభ్యత, గ్లోబల్ సమన్వయం లాంటి ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030 నిర్ణయించబడ్డాయి.

ప్రపంచ శాంతి కోసం చర్చలు, సదస్సులు, విద్యాలయాల్లో పోటీలు, కార్యశాలలు లాంటివని నిర్వహించాలి. అహింస, పరస్పర గౌరవం, లోతైన అవగాహన లాంటి భావనలను ప్రోత్సహించాలి. అన్ని ఆయుధాల కన్న శక్తివంతమైనది శాంతి మాత్రమే అని తెలుసుకుందాం. విభేదాలు మరిచి ఐక్యంగా ముందుకు సాగుదాం. మానవ హక్కులకు పట్టం కడదాం. యుద్ధాలు, మానవ ప్రేరేపిత సంక్షోభాలకు చరమగీతం పాడుదాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# 2028లో మూడు పార్టీలకు అసలు పరీక్ష



అధికారం ఎవరి సొత్తూ కాదు. ఓటరు ఎవరికీ శాశ్వతంగా పట్టం కట్టడు. తెలంగాణ రాజకీయ చరిత్ర ఈ విషయాన్ని పలుమార్లు చాటింది. 2028 అసెంబ్లీ ఎన్నికలు సమీపించే నాటికి కాంగ్రెస్, BRS, BJP, మూడు పార్టీలకూ ఇదే అగ్ని పరీక్ష...అసలు పరీక్ష కానుంది

2023 ఎన్నికల తీర్పు దీనికి అద్దం పడుతోంది. కాంగ్రెస్ 39.69 శాతం, BRS 37.62 శాతం, BJP 14 శాతం ఓట్లు సాధించాయి. కాంగ్రెస్, BRS మధ్య ఓట్ల తేడా కేవలం 2.07 శాతం పాయింట్లు మాత్రమే. అయినా సీట్లలో కాంగ్రెస్ 64, BRS39, BJP8 స్థానాలు దక్కాయి. ఓట్లలో స్వల్ప మార్పు కూడా సీట్లలో భారీ రాజకీయ ప్రభావాన్ని చూపగలదన్నది ఈ ఫలితం చెప్పిన పాఠం.

2023లో మార్పు కోరుకున్న ఓటరు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించాడు. ఇప్పుడు అదే ఓటరు కాంగ్రెస్ పాలనను కొలవనున్నాడు. ఆరు గ్యారెంటీల అమలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళా పథకాలు, ఉచిత విద్యుత్, ఇళ్ల నిర్మాణం, యువతకు ఉద్యోగాలు, ఇవన్నీ ప్రకటనలతో కాదు, ప్రజల అనుభవాలతోనే లెక్కకట్ట బడతాయి. పాలనలో పారదర్శకత, భూవ్యవహారాలు, బదిలీలు, కాంట్రాక్టులు, అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం అనుసరించే వైఖరి కూడా కీలకం. 2028లో కాంగ్రెస్‌కు BRS ఏంచేయలేదు? అన్న ప్రశ్న కంటే మేం ఏం చేశాం? అన్నదే ప్రధానం.

37.62 శాతం ఓటు BRSకు ఉన్న బలమైన రాజకీయ పునాదిని సూచిస్తోంది. అయితే ఓటమి తర్వాత కేడర్‌ను పునరుద్ధరించడం, నాయకత్వాన్ని సమన్వయం చేయడం, యువతలో కొత్త నమ్మకం కల్పించడం ఆ పార్టీ ముందున్న సవాళ్లు. గత పదేళ్ల పాలనను గుర్తుచేయడం మాత్రమే సరిపోదు. తిరిగి అధికారంలోకి వస్తే ఏం చేస్తామన్నదే ప్రజలకు చెప్పాలి. రైతులకు కొత్త విధానం, యువతకు ఉపాధి, నైపుణ్యాలు,అభివృద్ధి నమూనా, ఇవన్నింటిపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ అవసరం. 2023లో 14 శాతం ఓట్లతో 8 స్థానాలు గెలుచుకున్న BJP రాష్ట్ర రాజకీయాల్లో తన స్థానం పెంచుకుంది. ఇప్పుడు ఆ ఓటు శాతాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడమే సవాలు. జాతీయ నాయకత్వ ప్రభావంతో పాటు తెలంగాణ సమస్యలపై నిరంతర పోరాటం, నియోజకవర్గ స్థాయిలో సంస్థాగత బలం, స్థానిక నాయకత్వం కీలకం.

కాంగ్రెస్,BRS మధ్య జరిగే రాజకీయ మార్పుల్లో BJPకి లభించే స్థలం ఎంత అన్నది 2028 నాటికి తేలుతుంది. మూడు పార్టీలకూ సందేశం ఒక్కటే, హామీల కంటే అమలు, ప్రచారం కంటే పనితీరు ముఖ్యం. ఓటరు పథకాలను స్వీకరించవచ్చు. హామీలను వినవచ్చు. కానీ చివరికి తన అనుభవం తోనే తీర్పు ఇస్తాడు. 2028లో డేంజర్ బెల్ ఎవరికి మోగుతుందో ముందే చెప్పలేం. కానీ ఆ గంట మోగించే అధికారం మాత్రం ప్రజల చేతిలోని ఓటులో ఉంది. అందుకే మూడు పార్టీలూ ఇప్పటి నుంచే తమను తాము ప్రశ్నించుకోవాలి, ప్రజలు మమ్మల్ని ఎందుకు ఎన్నుకోవాలి ? దానికి సమాధానం ప్రసంగాల్లో కాదు, పాలనలో, పనితీరులో, విశ్వసనీయతలో కనిపించాలి ఎందుకంటే తెలంగాణ ఓటరు మౌనంగా ఉంటాడు. కానీ ఎన్నికల రోజున ఆ మౌనం తీర్పుగా మారుతుంది.

**- కొలను వెంకటేశ్వర రెడ్డి**
రిటైర్డ్ ఎస్పీ జైళ్ల శాఖ

# విరాట్ స్వరూపుడు విశ్వకర్మ

విశ్వ మంగళ మాంగళ్య విశ్వ విద్యా వినోదినే..
విశ్వ సంసార భీజాయ నమస్తే విశ్వ కర్మణే.
విశ్వాయ విశ్వ రూపాయ నమస్తే విశ్వ మూర్తియే..
విశ్వ మాత పితా రూప విశ్వకర్మ నమోస్తుతే.

సకల ప్రాణి కోటిని సృష్టించు జగత్పతి విశ్వకర్మ యొక్క ఆవిర్భావం ఈ సృష్టికి పూర్వమే స్వయంభువుగా వెలసిన రూపమే విశ్వకర్మ. పరమాత్మ విశ్వకర్మ ఐదు ముఖాలతో, పది చేతులతో స్వయంభువుగా అవతరించిన రూపంగా భావిస్తారు. విశ్వకర్మ ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో, శుక్ల యజుర్వేదంలో సృష్టి కర్తగా పేర్కొన బడినాడు. అథర్వణ వేదంలో ఆహార ప్రదాతగా వర్ణించ బడినాడు. పురుష సూక్తంలో విరాట్ పురుషుడుగా కీర్తించ బడినాడు. సకల వేదముల ప్రకారం విశ్వకర్మయే సృష్టికర్త. వేదములు విశ్వకర్మను సర్వపాప సంహర్తగా పేర్కొనాయి. సర్వ దిక్కులను పరికించు దృష్టి కలిగిన అమిత శక్తి కలవాడు కనుకనే ఈయన భగవంతుడు అని ఋగ్వేదము ఈయనను భగవంతునిగా పరిగణించింది. మహా భారతము ఈయనను వేయికళలకు అధినేతగా అభివర్ణించింది. విశ్వకర్మ యొక్క పంచ ముఖాల నుండి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ బ్రహ్మలు ఉద్భవించారు, ఈ పంచ బ్రహ్మల నుండి వారి సంతతి అయిన ఐదుగురు (సనగ, సనాతన, అహభౌసన, ప్రత్నస, సుపర్ణస.) పంచార్షేయ బ్రాహ్మణులు (విశ్వ బ్రాహ్మణులు) ఉద్భవించారు. వీరి ద్వారా చేయు శాస్త్రం, వృత్తులు నిర్దేశింప బడినవి. వీటితో పాటు పౌరోహిత్యం కూడా వారి వృత్తులలో భాగమే. వృత్తి విద్యలు, నిర్మాణ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన విద్యలకు ఈయన అధిపతి. విశ్వకర్మ సకల కళలకు ఆది దేవుడు. దేవలోకాలను నిర్మించిన భవన శిల్పి. దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు మరియు పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూప శిల్పి. విశ్వకర్మ సమస్త హస్త కళలన్నింటికి ఆది దేవుడు, విశ్వము యొక్క ప్రధాన రూపశిల్పి. వెయ్యి హస్తకళ ఆకృతులకు కార్యనిర్వాహణాది కారి. నాలుగు యుగాలన్నింటి లోను ఆయన దేవతలకు అనేక పట్టణాలు మరియు రాజ భవనాలు నిర్మించి ఇచ్చిన స్థపతి, వాస్తు మరియు భవన శిల్పి. సత్య యుగంలో ఇంద్రుడు పరిపాలించే ఇంద్ర లోకాన్ని, త్రేతాయుగంలో స్వర్ణ లంకని ద్వాపర యుగంలో ద్వారకా నగరాన్ని, కలియుగంలో హస్తినా పురాన్ని, ఇంద్ర ప్రస్థాన్ని నిర్మించిన అద్భుత శిల్పి.

శ్లో. నభూమి నజలం చైవ నతేజో నచ వాయవ: నచబ్రహ్మ నచవిష్ణు నచ రుద్రస్య తారకః



సర్వ శూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మణ. (మూల స్తంభ పురాణం)...భూమి, నీరు, అగ్ని, వాయువు,ఆకాశము, మరియు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర - ఇంద్ర -సూర్య - నక్షత్రములు పుట్టక ముందే విశ్వకర్మ తనంతట తాను స్వయంభు రూపమై అవతరించి నాడు.

శ్లో. పూర్వావనా త్సానగః దక్షణా త్సనాతనః; అపరా దహభూవః ఉద్వీచ్యాం ఉర్ధవాత్సుపర్ణః

విశ్వకర్మ పరాత్పరుని యొక్క తూర్పు ముఖమైన సద్యోజాతములో సానగ బ్రహ్మర్షి మను బ్రహ్మయు, దక్షిణ ముఖమైన వసుదేవములో సనాతన మహర్షి యను మయబ్రహ్మయు, పశ్చిమ ముఖమైన అఘోరియునందు అహభూవ మహర్షి యను త్వష్ట బ్రహ్మయు, ఉత్తర ముఖమైన తత్పురుషములో ప్రత్న మహర్షి యను శిల్పి బ్రహ్మయు, ఊర్ధ్వ ముఖమైన ఈశానములో సువర్ణ మహర్షియను విశ్వజ్ఞ బ్రహ్మయు ప్రభవించినట్లు చెప్పబడినది. ఋక్ వేదం లోని పదవ మండలం 81,82 సూక్తాలు విశ్వకర్మ యొక్క సృష్టి నిర్మాణ క్రమాన్ని వివరిస్తాయి. ఈ విశ్వకర్మల గురించి వేద, పురాణ, ఇతిహాసాలలో, ప్రాచీన సాహిత్యంలో,ఆధునిక సాహిత్యంలో వీరి గురించి ప్రస్తావించ బడినది. ఉదహరణకు ప్రజాకవి వేమన తన శతకంలో అంటాడు 'విశ్వకర్మ లేని విశ్వంబు లేదు' అని మరోక చోట 'విశ్వకర్మ దేవాది దేవుడు' అని ప్రస్తావించాడు. విశ్వకర్మ గురించి నన్నయాది ప్రాచీన కవులు ఎందరో ప్రస్తుతించారు. విశ్వ బ్రాహ్మణుల వృత్తుల ద్వార సమాజ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. వీరిని ఈ సమాజంలో ఆచార్య, దైవజ్ఞ, ఆచారి అనే పేర్లతో పిలుస్తుంటారు. దేవాలయాలలో విగ్రహాలు తయారు చేయువారు విశ్వకర్మలే. ఇంతటి ప్రత్యేకతలు కలిగిన వీరు పూర్వం యంత్ర పరికరాలు రాక ముందు పనులన్ని మానవ శ్రమ తోనే ముడిపడి ఉండేవి. లోకంలో మానవ జీవనానికి విశ్వకర్మీయుల కులవృత్తులు ప్రధాన ఆధారంగా ఉండేవి, ఉన్నాయి.ఈ విశ్వకర్మ కులంలో జన్మించిన శ్రీమద్వి విరాట్ శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కులవృత్తులను చేస్తూనే కాల జ్ఞానాన్ని చెప్పాడు. నిష్ఠాగరిష్టులైన ఈ విశ్వ బ్రాహ్మణులు కుల వృత్తులనే కాక జ్యోతిష, పౌరోహిత, యంత్ర, గృహవాస్తు నిర్మాతలుగా, విద్యా వేత్తలుగా, వైద్యులుగా, ప్రకృతి వైద్యులుగా, శాసన లేఖకులుగా అన్ని రంగాలలో, నాటి నుండి నేటి వరకు సకల కళల యందు ప్రావీణ్యతను నిరూపిస్తూ ఈ విశ్వం నందు నిష్ణాతులై విరాజిల్లుతున్నారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## ఈ నెల 27న రాయికల్ చెన్నకేశవనాథ ఆలయంలో వేడుకలు

## కృత్రిమ మేధస్సు,పర్యాటక రంగం రూపకల్పన:జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల, సెప్టెంబర్ 23 (మనం ప్రతినిధి):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లాలోని రాయికల్ గ్రామం, మండలంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 2026 సంవత్సరానికి డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్రూపకల్పన అనే థీమ్ను నిర్ణయించినట్లు తెలిపారు.
ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 9న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో పోషన్ మహా ప్రోగ్రాంపై అవగాహన



**సారంగాపూర్, సెప్టెంబర్ 23 ( మనం న్యూస్ ):** మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ధర్మపురి ప్రాజెక్ట్ సారంగాపూర్ సెక్టార్ లోని లక్ష్మిదేవిపేల్లి గ్రామం అంగన్వాడీ సెంటర్ 2 లో జాతీయ పోషణ మాహ మాసోస్తవం సెప్టెంబర్ 8 నుండి అక్టోబర్ 9 లో భాగంగా ఐ సి డీ ఎస్ సిడి పిఓ వాణిశ్రీ అధ్యక్షతన, సూపర్వైజర్ శైలజ ఆధ్వర్యంలో బుధవారం పోషణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్భహించారు.ఈ సందర్భంగా సిడి పిఓ వాణిశ్రీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో అందించేటటువంటి పౌష్టికాహారము, అందులో ఉన్నటువంటి పోషక విలువల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు ఇచ్చేటటువంటి బాలామృతం పిల్లల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుంది అని తెలిపారు. ఆరు నెలలు నిండిన ప్రతి పిల్లవానికి బాలవృుతంని ప్రతిరోజు తప్పనిసరిగా తినిపించాలని,అంగన్వాడి సెంటర్లు అందించేటటువంటి సేవలు ప్రతి గర్భిణీలు,బాలింతలు , 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అ నంతరం 6 నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు టీ హెచ్ ఆర్ పంపిణీ చేసి,పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో రుద్రసేన యువజన సంఘ నాయకులు తిరుపతి ఏఎన్ఎం సంధ్య, కవిత అంగన్వాడి టీచర్లు శ్యామల, రాజకుమారి, ఆదిలక్ష్మి,స్వప్న,ఆశలు, ఆయాలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ రాకతోనే తెలంగాణలో కరువు

## ప్రభుత్వ వైఫల్యంతో రైతాంగం కన్నీళ్లు పెడుతోంది?

## కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో 5 మోటార్లుంటే?.. ఒక్కటే నడుపుతున్నరు?

## బీఆర్ఎస్ ఒత్తిడితేస్తేనే 3 మోటార్లు నడుపుతున్నరు? : హరీశ్ రావు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన చేతకాక నీటి నిర్వాహణలో వైఫల్యంతో ఎల్‌నినో పేరు చెప్పి తప్పించుకుంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ రాకతో రాష్ట్రంలో కరువు ఏర్పడిందన్నారు. ఈ మేరకు నాగర్ కర్నూల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. పక్క రాష్ట్రంలో ఎక్కడా క్రాప్ హాలీడే లేదని, కానీ తెలంగాణకు మాత్రం క్రాప్ హాలీడే ప్రకటించారన్నారు. 2 రాష్ట్రాలకు అదే కృష్ణా, గోదావరి నదులు..
ఏపీలోనేమో క్రాప్ హాలీడే లేదు.. తెలంగాణలో మాత్రం క్రాప్ హాలీడే ఇచ్చారని, నీళ్లు లేక కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం.. కాంగ్రెస్ సర్కార్‌కు చేతగాకనే రాష్ట్రంలో కరువుపరిస్థితుల వల్ల రైతాంగం కన్నీళ్లు పెడుతున్న పరిస్థితి చూస్తే?.. నోటిమాట రావడంలేదన్నారు. చంద్రబాబుకు గురుదక్షిణగా శ్రీశైలం నీటిని పాలమూరు జిల్లాకు వదలడం లేదని విమర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతాంగం కన్నీళ్లు పెడుతోందని అన్నారు. ఉదాహరణకు... కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో 5 మోటార్లుంటే?.. అందులో ఒకటి నడుపుతున్నరు?.. బీఆర్ఎస్ ఒత్తిడి పెడితే మూడు మోటార్లు నడుపుతున్నారన్నారు. ఈ మూడు కూడా రోజుకు 8 గంటలు మాత్రమే నడుపుతున్నారన్నారు. ఉదయం 8 :30 గంటలకు మోటార్లు ఆన్ చేస్తున్నరు.. సాయంత్రం 4 : 30 గంటలకు బంద్ చేస్తున్నరు. నడపాల్సిన మోటార్లు 5 అయితే.. నడుపుతున్నాయి 3 అని అన్నారు. 24 గంటలు 5 మోటార్లు నడిపితే 4,000 క్యూసెక్కుల నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు.. కానీ, ఈ దద్దమ్మ ప్రభుత్వం 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు నీళ్లను తరలిస్తుండగా ,సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో మాత్రం నీళ్లు పారించడం లేదని విమర్శించారు. కేవలం 800 క్యూసెక్కుల నీళ్లు మాత్రమే లిఫ్ట్ చేస్తుందని మండిపడ్డారు. అందుకే అంటున్నాము.. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని.. పరిపాలన చేతకాక, ఎల్ నినో పేరు చెప్పి తప్పించుకుంటున్నారని హరీశ్‌రావు పేర్కోన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమ్మక్క బ్యారేజ్ కట్టి 365 రోజులు నీళ్లు ఎత్తిందని, దేవాదుల వద్ద ఎందుకు 8 గంటలు మాత్రమే నడుపుతున్నారని తెలిపారు. మూడేళ్లలో కట్టిన ఒక్క ప్రాజెక్ట్ పేరు చెప్పాలని మంత్రి ఉత్తమ్‌కి సవాల్ విసిరారు. కేవలం 8.8 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసి 88 టీఎంసీలు ఎలా చెబుతున్నారని నిలదీశారు. నెట్టెంపాడు, తుమ్మిళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎవరు కట్టారో ప్రజలకు తెలుసన్నారు. ప్రతిపక్షాల మీద కమీషన్‌లు వేయడం, లేదా 30శాతం కమిషన్ దండుకోవడం మాత్రమే కాంగ్రెస్కు తెలుసని విమర్శించారు. కృష్ణ నదిలో 34 శాతం తెలంగాణకు వాటా ఉండగా కేవలం ప్రభుత్వ వైఫల్యం కారణంగా 25 శాతం మాత్రమే వాడారని ఆరోపించారు. పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాలను మంత్రి ఉత్తమ్ కుమార్ మోసం చేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు ఏ ప్రాజెక్టుల ద్వారా ఎంత నీరు వాడాలో వైట్ పేపర్‌ను రిలీజ్ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఇది ఎల్ నినో కాదు?.. కాంగ్-నినో

- కరెంట్ కోతలపై కేటీఆర్ కౌంటర్
- కాంగ్రెస్ వచ్చింది కరెంట్ పోయిందంటూ కామెంట్




**హైదరాబాద్, మనం ప్రతినిధి :** మేం ముందే చెప్పినం.. కాంగ్రెస్ ఎక్కడ ఉంటుందో అక్కడ ఉంటే కరెంట్ ఉండదు?.. కాంగ్రెస్ కావాలా?..కరెంట్ కావాలా..? అని మేం 2023 ఎన్నికల్లో మేం స్పష్టంగా చెప్పినం.. మేం చెప్పిందే యధాతథంగా జరుగుతుంది? కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదని చెప్పినమో కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది. కరెంట్ కోతలతో ఇవాళ ఈ ప్రాంతం ఆ ప్రాంతం కాదు?..రాష్ట్రం మొత్తం అల్లాడిపోతా ఉంది. దీనిక్కారణమేందో చెప్పే ప్రయత్నం చేస్తున్నాం.. ఇవాళ అదే జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ వస్తే కరెంట్ ఉండదని అన్నాడు. కానీ తెలంగాణ తెచ్చి 24 గంటలు కరెంట్ ఇచ్చి చూపించాం.. మళ్లీ అప్పుడు కిరణ్ కుమార్ రెడ్డి చెప్పినట్లు రేవంత్ రెడ్డి కరెంట్ లేకుండా చేస్తున్నాడన్నారు.
ఈ మేరకు బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజులో కనీసం 6 గంటలు కూడా విద్యుత్ సరఫరా ఉండట్లేదని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము నాడు ముందే హెచ్చరించామని గుర్తు చేశారు. ఇప్పుడు అదే నిజమవుతోందని' కేటీఆర్ పేర్కొన్నారు. 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది' అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్‌ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. థర్మల్ పవర్ స్టేషన్లకు బొగ్గు కూడా ఇవ్వలేక పోతున్నారంటూ రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో 1980లో ఫొటో ట్రెండ్ నడుస్తుంటే.. తెలంగాణలో మాత్రం 1980 నాటి పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ సమస్యపై అధిక దృష్టి పెట్టామని గుర్తు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది.. జూరాల నీటి విడుదలపై కేటీఆర్**

జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై కేటీఆర్ స్పందించారు. 'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

# నషాముక్త్ యువ భారత్ కోసం యువత భాగస్వామ్యం కావాలి

- ఎస్వీకెపి కళాశాలలో జిల్లాస్థాయి పోటీలు



**వాసవి పెనుగొండ, మనం న్యూస్:** భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'వికసిత్ భారత్'లో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నషాముక్త్ యువ భారత్ సంకల్ప అభియాన్ లో భాగంగా జిల్లాస్థాయి పోటీలను పెనుగొండలోని ఎస్వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.వి. అప్పారావు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించి దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును సుస్థిరం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పశ్చిమగోదావరి జిల్లా మై భారత్ డైరెక్టర్ రాహుల్ గిర్రెడ్డి మాట్లాడుతూ కళాశాలకు వచ్చి చదువుకోవడం, ఆటల్లో పాల్గొనడం మాత్రమే విద్యార్థుల జీవిత లక్ష్యం కాదన్నారు. ప్రభుత్వం యువత కోసం అమలు చేస్తున్న అనేక ఉన్నతమైన కార్యక్రమాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈగల్ డిపార్ట్మెంట్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల వైపు ప్రోత్సహించే వారు చట్టపరంగా శిక్షార్హులని తెలిపారు. 'బ్రేక్ ది సైలెన్స్' అనే నినాదంతో మాదకద్రవ్యాలపై యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. డ్రగ్స్ సమస్య వ్యక్తిగత సమస్య కాదని, ఇది దేశానికి సంబంధించిన సమస్య అని అన్నారు. యువతను మాదకద్రవ్యాలకు బానిసలుగా మార్చడం ద్వారా దేశాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.
మాదకద్రవ్యాల విక్రయం, సరఫరాకు సంబంధించి చట్టంలో కఠినమైన శిక్షలు ఉన్నాయని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి కె. సుజాత మాట్లాడుతూ నషాముక్త్ భారత్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. తాము మాత్రమే మారడం కాకుండా తమ చుట్టూ ఉన్నవారిని కూడా మాదకద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో చెప్పిన విషయాలను శ్రద్ధగా ఆచరణలో పెట్టి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని మై భారత్ ప్రతినిధి ప్రేమ్సింగ్ నేతృత్వంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి. బాపిరెడ్డి, ఎన్సీసీ అధికారి డాక్టర్ కె. చిరంజీవి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్.ఎస్. శ్రీనివాస్, పి. మీరయ్య, టి. దివాకర్ పర్యవేక్షించారు.కార్యక్రమంలో జె. మురళీకృష్ణ, కె.వి. సురేష్బాబుతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి బిజెపి లక్ష్యం




- ఆదోని ఎంఎల్ఏ పార్థసారథి
- మాలపల్లి, రచ్చుమర్రి లో జెండావిష్కరణ

**మంత్రాలయం, సెప్టెంబర్ 23,మనం న్యూస్ :** అన్ని వర్గాల సంక్షేమం,అభివృద్దే బిజెపి పార్టీ లక్ష్యం అని ఆదోని ఎంఎల్ఏ పార్థసారథి అన్నారు. బుధవారం సాయంకాలం మండల పరిధిలోని మాలపల్లి, రచ్చుమర్రి గ్రామాల్లో మన ఊరు.మన జెండా కార్యక్రమం లో భాగంగా బిజెపి జెండాను ఆవిష్కరణ చేశారు. ముందుగా బిజెపి యువమోర్చ రాయలసీమ జోన్ అధ్యక్షులు బంగారయ్య, మండల అధ్యక్షులు శ్రీ కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. రచ్చుమర్రి లో ఆంజనేయస్వామి ని దర్శించుకొని భారీ ఊరేగింపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో అతిపెద్ద పార్టీ బిజెపి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథం లో సాగుతున్నట్లు వెల్లడించారు. రఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, సునీల్ రెడ్డి,ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి,కునిగిరి నీలకంఠ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 మనం న్యూస్ :** పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, జట్లపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వ యం చేసుకుంటూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి , పాతూరి రాంప్రసాద్ చౌదరి , పుల్ల బాబి , ప్రభుత్వ అధికారులు , ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ




**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 23 మనం న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జి భవన , ఇతర భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) నియోజకవర్గ సమావేశం బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగింది.అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ 19 మందికి 11,54,405/- రూపాయలు చెక్కులు అందజేయడం జరిగింది. కిలపర్తి వెంకటరావు , దాసరి అప్పన్న , రాంప్రసాద్ చౌదరి , ఈ కార్యక్రమంలో పట్టణ, పెంటపాడు అధ్యక్షులు క్లస్టర్ యూనిట్ మరియు భూత్ ఇన్చార్జిలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

## ఎల్ నీవో ప్రభావంపై అధికారులతో సమన్వయంతో పనిచేయాలి



**కదిరి, సెప్టెంబర్23మనంన్యూస్ :** ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, తాగునీరు, సాగునీటి లభ్యత తదితర అంశాలపై కదిరి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంటల సాగు పరిస్థితి, రైతుల అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, తాగునీటి లభ్యతపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని, అవసరమైన చోట్ల తాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# సిద్ధాపురంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ఈ-పంట నమోదు వేగవంతం చేయాలి..
- రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలి



**బుక్కపట్నం, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** బుక్కపట్నం మండలం సిద్ధాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా పర్యటించి ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును పరిశీలించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి ఆయా శాఖల పనితీరును సమీక్షించారు. అనంతరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. గ్రామ సచివాలయంలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, పిటిషన్ల పరిష్కారం, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తదితర వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలను సకాలంలో అందించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందిస్తున్న విత్తనాలు, ఎరువుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా చూడడంతో పాటు ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. విలేజ్ క్లినిక్ను సందర్శించిన కలెక్టర్ వైద్య సేవలు, ఉచిత మందుల నిల్వలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సలహాలు అందించాలని, ప్రయోగశాల పరీక్షల సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. నాడు-నేడు పనుల పురోగతి, విద్యా కానుక, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు, ఆరోగ్య పరిస్థితులు, పౌష్టికాహార పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపం తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలందరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా అందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సంబంధిత అధికారులను హెచ్చరించారు

# హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, సెప్టెంబర్ 23 మనం ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ సంగీతతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్కింగ్ కాని, అనామలీ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాల పరిశీలనను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాల నిర్ధారణ కోసం 12 రకాల గుర్తింపు/ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్కు హాజరై అవసరమైన ధ్రువపత్రాలు, వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా అవగాహన కల్పించి సహకరించాలని కోరారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో మొత్తం 4,11,717 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 2,48,395 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలను కలెక్టర్ స్వీకరించారు. హియరింగ్ ప్రక్రియకు సంబంధించి ఎటువంటి సమస్యలు లేవని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన కృష్ణకు ఘన సత్కారం



- 589 మార్కులతో రాష్ట్రంలో మూడో ర్యాంక్..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమ స్థానం

ఏటూరునాగారం, సెప్టెంబరు 23 (మనం న్యూస్): ఏటూరునాగారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కే.కృష్ణకు అరుదైన గౌరవం దక్కనుంది. 2025-26 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్, ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న కృష్ణ ప్రతిభకు గుర్తింపుగా ఈ సత్కారం లభించింది. శ్రీరామ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా కృష్ణను రూ.2 లక్షల నగదు బహుమతితో సత్కరించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కృష్ణకు ఈ గౌరవం దక్కడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కృష్ణ ఏటూరునాగారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతోంది. పదో తరగతిలో సాధించిన అద్భుత ఫలితాలతో ఏటూరునాగారం ప్రాంతానికి ఆమె ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పలువురు అభినందించారు.

## అన్నదానం మహాదానం



హైదరాబాద్, సెప్టెంబర్ 23(మనంన్యూస్): నగరంలోని హఫీజ్‌పేటలోని ప్రేమ నగర్ లో మహాకాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువై వెలిసిన శ్రీ బొజ్జ గణపయ్య.. మేము అందరము ఒకటే అంటూ గత 6 సం. నుండి శ్రీ విఘ్నేశ్వర పూజలలో అని కార్యక్రమంలో పలుగొంటున్న కాలనీ వాసులు.. 'మహా ప్రసాదం వితరణ కార్యక్రమంలో కుల మత భేదం లేకుండా భారీ ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు.' సమానత్వం మరియు ఐక్యత- ఇక్కడ కులమతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉన్నారని కాలనీ వాసుల మధ్య ఉన్న బలమైన బంధాన్ని, ఒకరికొకరు తోడుగా ఉండే తత్వాన్ని ఈ శుభా సందర్భ కార్యక్రమం చాటిచెపుతోంది. పెన్సిల్ ఆర్టిస్ట్ చిట్ల, కార్తీక్ ముదిరాజ్, మహాకాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు శ్రీ విగ్నేశ్వర పూజలలో జరిగే అన్ని కార్యక్రమంలో శివాజీ, సాయి కిరణ్, అయాజ్, మణిరాజ్, శశాంక్, వరుణ్ సాయి, అజయ్, వికాస్, భాను, నాని, మనోజ్, విష్ణు, తేజ, శివ పాల్గొన్నారు.

## చక్కదిద్దే స్థాయి వారే.. ఛీ అనిపించు కుంటున్నారు

### పేకాట ఆడుతూ పట్టుబడిన మాజీ ఎమ్మెల్సీ



సిద్దిపేట, సెప్టెంబర్ 23 (మనం ప్రతినిధి): ఆదర్శాలకు మారుపేరు పెద్దరికానికి గుర్తింపుగా ఉండవలసిన పెద్దాయన పేకాట ఆడుతూ పోలీసులకు పట్టు పడటం సిద్దిపేటలో చర్చనీ అంశంగా మారింది. మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి తమ సొంత ఇంటిలో మరి కొంతమందితో పేకాట ఆడుతూ పట్టుబడినట్లు సిద్దిపేట టూ టౌన్ సీఐ మురళి తెలిపారు. బాబు జగ్జీవన్ రావ్ చౌరస్తా సమీపంలోని ఆయన ఇంటిలో పేకాట ఆడడం పక్క సమాచారం పోలీసులకు అందడంతో దాడి నిర్వహించి పట్టుకున్నారు. రఘోత్తం రెడ్డి తో పాటు కనకయ్య, సిద్ధంకి రమేష్, పంతం వెంకట రాజన్ లను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మాజీ ఎమ్మెల్సీ పేకాట ఆడుతూ పట్టుబడడం సిద్దిపేట పట్టణంలో చర్చనీ అంశంగా మారింది.

## కోతులను తరిమేత అందుకు సర్పంచ్ వినయ ప్రయత్నం



దుగ్గొండి, సెప్టెంబర్23 మనం ప్రతినిధి: దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులు పంట చేనుతో పాటుగా ఇళ్లు, ఆస్తులపై దాడులు చేయడంతో గ్రామస్థులు రోజువారీ ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రధాన సమస్య కోతులే అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అరికట్టేందుకు సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు వినూత్న ఆలోచించారు. ఎలుగుబంటి రూపంలో ఉన్న బొమ్మలతో గ్రామ పంచాయతీ సిబ్బందికి వేషాలు వేసి కోతులను తరిమే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విధంగా కోతులను భయపెట్టి దూరంగా పంపే ప్రయత్నాన్ని ప్రారంభించారు. కాగా బుధవారం సర్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీడీఓ లెక్కల అరుంధతితో సర్పంచ్ చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు. గ్రామస్థులు, స్థానిక అధికారులు కూడా సర్పంచ్ కృషిని అభినందించారు. ఈ వినూత్న చర్య వల్ల కోతుల బెడద కొంతమేరకు తగ్గుతుందని ఆశిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాటేటి రవి కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠా

### కారుతో పాటు బంగారు వెండి ఆభరణాల స్వాధీనం

### పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం పోలీసుల గాలింపు



సిద్దిపేట, సెప్టెంబర్ 23 (మనం ప్రతినిధి): దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా ను సిద్దిపేట పోలీసులు పట్టుకున్నారు. జక్కాపూర్ గ్రామానికి చెందిన బుచ్చెల్లి అఖిల ఫిర్యాదు మేరకు చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసును దర్యాప్తు చేస్తూ సిసిటీవీల పుటేజీల ఆధారంగా ఈ దొంగల ముఠా ను పట్టుకున్నారు. సంఘటన స్థలం పరిసర ప్రాంతాలు పెట్రోల్ బంక్ ల సమీపంలోని సీసీటీవీ కెమెరాలు, టోల్ ప్లాజా రికార్డులను పరిశీలించగా ఈ దొంగల ముఠా ఆచూకీ బయటపడింది. టీఎస్ 8 హెచ్డి 1688 నెంబర్ గల కియా సెల్టోస్ కారులో ఈ ముఠా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మహబూబాబాద్ జిల్లా వాసులు మునిగల వీడు గ్రామానికి చెందిన మాదగాని సురేష్, రావిరాల నివాసి దాసరి నాగయ్య, ఉప్పరపల్లి గ్రామస్తుడు కట్ల మహేష్, మహబూబ్ నగర్ గ్రామస్తుడు ఉండాడి సురేష్, కుజా కళ్యాణ్ దోపిడీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. సురేష్ పై 26 కేసులు, నాగయ్య పై 12 కేసులు నమోదు కాగా నిందితుల నుండి కారుతో పాటు ఏడు గ్రాముల బంగారం, 33 తులాల వెండి ఆభరణాలు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కుజా కళ్యాణ్ పరారీలో ఉండగా ఆయన కోసం గాలిస్తున్నట్లు సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ దర్యాప్తులో సిద్దిపేట సీఐ విద్యాసాగర్, చిన్నకోడూరు ఎస్సై చంద్రమోహన్, రాజగోపాలపేట ఎస్సై వివేక్, సిబ్బంది పరశురాం, స్వామి, తిరుపతి, శ్రీనివాస్ బాబు, శీను, సంపత్, రాజు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు, కేబుల్ చోరీ కేసుల్లో 10 మంది నిందితుల అరెస్ట్

### 13 కేసులకు సంబంధించిన రూ.7.50 లక్షల విలువైన కేబుల్ వైర్లు, అల్యూమినియం వైర్లు స్వాధీనం

### రూ.4 లక్షల విలువైన టాటా ఏస్ వాహనం, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం

### వివరాలు వెల్లడించిన జహీరాబాద్ డిఎస్పీ సైదా నాయక్



సంగారెడ్డి సెప్టెంబర్ 23 మనంప్రతినిధి: జహీరాబాద్ హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన విద్యుత్ వైర్లు, కేబుల్ చోరీ కేసులకు సంబంధించి 10 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.7,50,767 విలువైన కేబుల్ వైర్లు, అల్యూమినియం వైర్లు, రూ.4 లక్షల విలువైన టాటా ఏస్ వాహనం, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలలోనికి వెళితే ముంగి పంప్హౌస్లో విద్యుత్ మోటార్లకు సంబంధించిన ఇంపెల్లర్, పంప్ షాఫ్ట్, వేర్ రింగ్స్, బుషెస్, కనెక్టింగ్ రాడ్స్ తదితర సామగ్రి చోరీకి గురైన ఘటనపై హద్నూర్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 75/2026లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ గారి ఆదేశానుసారం జహీరాబాద్ సబ్ డివిజన్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, విస్తృత తనిఖీలు నిర్వహించగా దర్యాప్తులో భాగంగా 22.09.2026న వాహన తనిఖీలు నిర్వహిస్తున్న హద్నూర్ పోలీసులకు అనుమానాస్పదంగా వెళ్తున్న టాటా ఏస్ వాహనం కనిపించడంతో పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, వాహనంలో ఉన్న వ్యక్తులను విచారించగా చోరీలకు సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. ఇప్పటివరకు సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 13 కేసులకు ఈ నిందితులకు సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వాటిలో హద్నూర్, జహీరాబాద్ రూరల్, మానూర్, ఝరాసంగం, కోహీర్, జోగిపేట, నారాయణఖేడ్, కల్హేర్, రాయికోడ్, జహీరాబాద్ టౌన్, కొండాపూర్ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసులు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో రూ.7,50,767 విలువైన కేబుల్ వైర్లు, అల్యూమినియం వైర్లు, రూ.4,00,000 విలువైన టాటా ఏస్ వాహనం, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసిన నిందితులను జ్యూడిషియల్ రైమాండ్ కు తరలించడం జరిగింది. కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

## 13 ఏళ్ల నిరీక్షణకు తెర..

### జగ్గారెడ్డి కృషి తో భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



సంగారెడ్డి సెప్టెంబర్ 23 మనం న్యూస్ ప్రతినిధి : ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొగర్పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గతంలో ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందినప్పటికీ, తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు స్థలాల పొజిషన్ అందకపోవడంతో సమస్య కొనసాగుతూ వచ్చింది. దీంతో తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు.

### 2011లో కేటాయింపులు.. ఆ తర్వాత నిలిచిన ప్రక్రియ...

తొగర్పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం గతంలో జరిగిన కేటాయింపులు అమలులోకి రాకపోవడంతో లబ్ధిదారులు స్థలాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది.ఈ సమస్యపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించారు.

### మంత్రి పొంగులేటిని కలిసిన జగ్గారెడ్డి...

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తొగర్పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించిన సిరి యూత్ అసోసియేషన్



గజ్వేల్, సెప్టెంబర్ 23 మనం న్యూస్: గజ్వేల్ పట్టణ పరిధిలోని భరత్ నగర్ లో గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి, సిరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామి వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో 'లక్ష పుష్పార్చన' పూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం నుంచే స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రంగురంగుల సుగంధభరిత పుష్పాలతో వినాయకునికి లక్ష పుష్పార్చన సేవను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.

ఈ పూజా కార్యక్రమంలో భరత్ నగర్ కాలనీవాసులు, మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తుల భజనలు, కీర్తనలతో భరత్ నగర్ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.ఈ సందర్భంగా సిరి యూత్ అసోసియేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ, లోకకల్యాణార్థం, కాలనీ ప్రజలందరిపై ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుండి ప్రతిరోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, పూజ అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలను, మహా అన్నప్రసాదం అందజేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో పురోహితులు దేశపతి రాజశేఖర శర్మ, మాజీ కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు, అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, సిరి యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ నాయకులు, మహిళలు, చిన్నారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ వైద్యంపై పెరుగుతున్న ఆదరణ



సిద్దిపేట, సెప్టెంబర్ 23 (మనం ప్రతినిధి): ఆయుష్ వైద్య విధానాలు ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, వైద్య విధానాలు, మందులు మరియు చికిత్స, మెరుగైన ఆరోగ్య ఫలితాల కోసం అవసరమైన సందర్భాల్లో ఆయుష్ వైద్య పద్ధతులను ఉపయోగించుకోవాలని ధనరాజ్ తెలిపారు. దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ద్వారా వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజం మరియు ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడాలని సూచించారు.

ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఇందిరా ఝాన్సీ మాట్లాడుతూ ఆయుష్ వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత శిబిరంలో 300 మంది రోగులు వైద్యాన్ని పొందారు. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు, అస్తమా, అలెర్జీలు, కిడ్నీలో రాళ్లు, థైరాయిడ్, రక్తపోటు, మధుమేహం (షుగర్), చర్మ వ్యాధులు తదితర వ్యాధులకు ఆయుష్ వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దీప్తి నాగరాజ్, నోడల్ ఆఫీసర్ డా. కె. అనిల్ కుమార్, సమీకృత ఆయుష్ ఆసుపత్రి ఇన్చార్జ్ సూపరింటెండెంట్ డా. ఉమా దేవి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. భానుతేజ, ఆయుర్వేద వైద్యులు డా. కేదారి, డా. సంపత్ కుమార్, యునాని వైద్యులు డా. అజీమ్ అహ్మద్, హోమియోపతి వైద్యులు డా.గౌతమి ప్రియ, ఫార్మసిస్టులు శివ ప్రసాద్, జ్యోతి, ఐజాజుద్దీన్, సంతోషి రాణి, ఎస్.ఎన్.ఓలు వెంకటేష్, రమేష్, స్వామి,యోగ ఇన్స్ట్రక్టర్లు మనోహర్, రేవతి, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా నేను ఉంటా!

- మీ ధైర్యంతో మేము నాట్లేసాం
- మీరు మా పంటలను కాపాడారు
- మంత్రి తుమ్మలను కలిసిన పెనుబల్లి రైతులు, నాయకులు.
- జిల్లాలో ఒక్క ఎకరాన్నీ ఎండనివ్వను: మంత్రి తుమ్మల.



**దమ్మపేట, సెప్టెంబర్ 23(మనం న్యూస్):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో బుధవారం ఉదయం సత్తుపల్లి నియోజక వర్గానికి చెందిన పలువురు నాయకులు, రైతులు మంత్రి తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా రైతులు మంత్రి తుమ్మల తో పంట పొలాల పరిస్థితిని వివరించారు.వర్షాభావ పరిస్థితులు మూలాన వర్షాలు తక్కువగా కురుస్తున్నాయని, వాతావరణ శాఖ హెచ్చరించిన మీ ధైర్యంతో, మీరు ఉన్నారని ఆ నమ్మకంతో వరి నాటు వేసామని,గోదావరి జలాలను సరైన సమయంలో మాకు అందించి మా పంట పొలాలను కాపాడారని రైతులు మంత్రి తుమ్మలకు తెలిపారు. ఇప్పటివరకు పరవాలేదు అని వేసిన ఒక్క ఎకరాన్ని కూడా ఎండనీయకుండా చూస్తానని మంత్రి తుమ్మల మరోసారి స్పష్టం చేశారు.

# తుమ్మల చెరువుకు గోదావరి జలాలు



## రైతుల చిరకాల కోరిక సాకారమైన వేళ మారెళ్లపాడు ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి



**అశ్వాపురం, సెప్టెంబర్ 23(మనం న్యూస్):** సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన మారెళ్లపాడు ప్రాజెక్ట ప్రారంభోత్సవంతో పినపాక నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి భరోసా ఏర్పడింది. ఈ ప్రాజెక్ట ద్వారా గోదావరి జలాలతో నియోజకవర్గంలోని అశ్వాపురం, మణుగూరు మండలాలలో కొన్ని వేల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగనుంది. మండలంలో రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం విజయవంతంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి ప్రసన్న, కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, డీఎఫ్ఓ, ఇరిగేషన్ శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ మహేశ్వరరావు, ఈఈ తెల్లం వెంకటేశ్వర్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం పినపాక నియోజకవర్గ రైతాంగానికి ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న సాగునీటి కల నేడు సాకారం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్లో భాగంగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి రావడంతో అశ్వాపురం మండలంతో పాటు పినపాక నియోజకవర్గ రైతులకు సాగునీటి భరోసా మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు. దీనివల్ల రైతులు సాగు కోసం వర్షాలపై ఆధారపడే పరిస్థితి తగ్గడంతో పాటు సాగు విస్తీర్ణం పెరిగి, పంటల ఉత్పత్తి పెరిగే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. రైతులకు సాగునీటి భరోసా కలగడం ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను వ్యవసాయ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడటంతో పినపాక నియోజకవర్గంలోని రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రైతుల పాలిట వరంగా మారనుందని, ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న సాగునీటి కలను సాకారం చేసే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మారేళ్లపాడు ప్రాజెక్టు ద్వారా రైతుల పొలాలకు సాగునీరు అందించి, వారి చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సాగునీటి భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి మారేళ్లపాడు ప్రాజెక్టు మరింత ఊతమిస్తుందని, రైతుల ముఖాల్లో ఆనందం చూడటమే ఈ ప్రాజెక్టు విజయానికి నిదర్శనం అన్నారు. ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా పెరగడంతో పాటు పంటల సాగు విస్తీర్ణం, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఎన్నో సంవత్సరాల రైతుల నిరీక్షణకు ముగింపు పలుకుతూ మారేళ్లపాడు జలాలు సాగుభూములకు చేరడం సంతోషకరమైన విషయమన్నారు.

# ఐలూ ఆధ్వర్యంలో న్యాయవాదుల ధర్నా



- జాతీయ కౌన్సిల్ పిలుపు
- బెనిఫిట్స్ పెంచాలని, స్టైఫండ్ చెల్లించాలని డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 23 (మనంప్రతినిధి):** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు మేరకు బుధవారం ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయవాదుల డెత్ /రిటైర్మెంట్ బెనిఫిట్ 25 లక్షల రూపాయలకు పెంచాలని, న్యాయ వాదులందరికీ వైద్య సహాయం క్రింద రు.5 లక్షలు మరియు జూనియర్ న్యాయవాదులకు నెలకు రు.10 వేలు స్టైఫండ్ గా 5 సంవత్సరాల వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నాలో పాల్గొన్నారు. ఐలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారు పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో వివిధ వృత్తిలో పని చేస్తున్న వారు వారి మరణానంతరం వచ్చే ప్రయోజనాలతో పోలిస్తే మన న్యాయవాదులు అందుకునే పది లక్షల సహాయం సరిపోదని, దీనిని ఇరవై ఐదు లక్షలు పెంచాలని డిమాండ్ చేయడం సమంజసమేనన్నారు. న్యాయవాదుల ఆరోగ్య భీమా రెండు లక్షల ఇవ్వడం అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు రెండు లక్షలు సరిపోవని ఆరోగ్య భీమాను ఐదు లక్షలు గా పెంచవలసిన అవసరం ఉందన్నారు. జూనియర్ న్యాయవాదులు వచ్చిన కొత్తలో వారికి కేసులు రావడం కష్టంగా ఉంటుందని, వారికి నెలవారీ వేతనంగా కనీసం పది వేలు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఈ మూడు డిమాండ్లు అమలు చేయడానికి బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా కేంద్ర న్యాయవాదుల సంక్షేమ నిధి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐలు జాతీయ స్థాయిలో ఈ రోజు నిరసన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఐలు జాతీయ కౌన్సెల్ మెంబర్ జలసూత్రం శివరాం ప్రసాద్, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్ మక్కడ్, న్యాయవాదుల డిమాండ్స్ గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు ఎం.వీ.ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు పి. కిషన్ రావు, కె. పుల్లయ్య, ఆర్. రామారావు, బి.అరుణ్ చంద్, జి. కె.అన్నపూర్ణ, ఎస్. వెంకట నర్సయ్య, టి. రమేష్, యు.అరుణ్, ఏ.రవి కుమార్, డి.రవి కుమార్, పి.రామారావు, పి.రవి వర్మ, పగిడిపల్లి రవి, కె.అభిలాష్, ఎస్.రామారావు, బి.రమేష్, లీలావతి, హిమబిందు లు పాల్గొన్నారు. అదేవిధంగా మణుగూరు కోర్ట్ కమిటీ అధ్యక్షులు పి.భాస్కర్, ఎం. శ్రీనివాస రావు, పి. నగేష్ కుమార్, జే. చొక్కారావు , ఈ.రాము పాల్గొన్నారు. అదే విధంగా భద్రాచలం కోర్ట్ కమిటీ సభ్యులు కె. శ్రీనివాసరావు, ఏ. అంజలి కుమారి, యు. గౌతమ్ కుమార్ పాల్గొన్నారు. ఇల్లందు కోర్ట్ కమిటీ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు. కొత్తగూడెం జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ ముదుల్కర్ , ప్రధాన కార్యదర్శి జి. మహేశ్వర రావు ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి వారికి మద్దతు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఎల్. సత్యనారాయణ, వి. నాగి రెడ్డి, జి.రామమూర్తి, కె. నాగేశ్వరరావు, ఎమ్. ఉషారాణి ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి మద్దతు తెలిపారు, ఐ.ఏ.ఎల్. భాద్యులు వై. ఉదయ్ భాస్కర్, భాగం మాధవరావు, ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి తమ యొక్క మద్దతు తెలిపారు. న్యాయవాద పరిషద్ భాద్యులు పి.ఆర్. విఠల్ ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి వారి మద్దతు తెలిపారు. బి.జె.పి. లీగల్ కౌన్సెల్ కాసాని రమేష్ ప్రసంగించి ఐలు కి మద్దతు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ సీనియర్ మరియు జూనియర్ మరియు మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## చిమ్మపూడి చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు విడుదల

- రైతుల్లో హర్షం.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు





**రఘునాథపాలెం, సెప్టెంబర్ 23(మనం న్యూస్):** మండలంలోని చిమ్మపూడి గ్రామ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గ్రామంలోని చెరువుకు నీటిని విడుదల చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో చెరువుకు నీరు చేరడంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.చెరువులోకి సాగునీరు చేరడంతో పంటలకు అవసరమైన నీటి లభ్యత మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా చేపట్టిన ఈ చర్య పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రైతుల సాగునీటి అవసరాలను గుర్తించి చెరువుకు నీటిని విడుదల చేయడం సంతోషకరమైన విషయమన్నారు. నీటి లభ్యతతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు తూము సత్యనారాయణ, కాసిని శ్రీనివాస్ రావు, షేక్ రహీం పాషా, దొంతు వెంకన్న, పొన్నం నాగయ్య తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## భక్తిగీతాలతో మారుమోగిన నవరాత్రి ఉత్సవాలు

### హనుమాన్ చాలీసా, భజనలతో భక్తి పారవశ్యంలో మధురాబస్తీ



**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** జాయ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగీత విభావరి, హనుమాన్ చాలీసా, భజన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ గాయకులు ప్రేమ్ శర్మ, సుధీర్ కుమార్, రవి, హేమలత తమ మధురమైన గానంతో భక్తులను అలరించారు. రంజిత్ బృందం అందించిన వాయిద్య సహకారం సంగీత విభావరికి మరింత శోభను చేకూర్చింది. హనుమాన్ చాలీసా ఆలాపనతో పాటు భక్తిగీతాలు, భజనలతో కార్యక్రమ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. గాయకుల గానానికి భక్తులు పరవశించి, భక్తిగీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. మధురాబస్తీకి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని హనుమంతుని స్మరణలో మునిగిపోయారు.

హనుమాన్ చాలీసా, భజనలతో పరిసర ప్రాంతం మారుమోగడంతో అక్కడ భక్తి పారవశ్యం నెలకొంది. సంగీతం, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. జాయ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంగీత విభావరి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

### ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం నిర్వహణ




**ఖమ్మం, సెప్టెంబర్ 23(మనం న్యూస్):** 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలల ఆధ్వర్యంలో ఉచిత 'ఆయుర్వేద మెగా వైద్య శిబిరం' విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు బి.పి, షుగర్, కీళ్ల నొప్పులు, వాత రోగాలు తదితర ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరానికి దాదాపు 436 మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ, ప్రజలు ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ 'యోగా'ను దైనందిన జీవితంలో ఒక ముఖ్య భాగం చేసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యులు డా. కె. పద్మావతి (సీనియర్ మెడికల్ ఆఫీసర్ నోడల్ ఆఫీసర్), డా. వై. ఉపేందర్ (సీనియర్ మెడికల్ ఆఫీసర్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డా. బి. సుధాకర్ (మెడికల్ ఆఫీసర్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డి.పి.ఎం. బాబూనాయక్ గార్లతో పాటు ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది మరియు యోగా ఇన్స్ట్రక్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే మాజీ కౌన్సిలర్ జోగుపర్తి ప్రభాకర్ రావు కూడా పాల్గొని తమ సందేశాన్ని అందించారు.

## 24 నుండి 26 వరకు ఇంటర్ ఫస్టి యర్ అడ్మిషన్లకు చివరి అవకాశం

### జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు

**ఖమ్మం, సెప్టెంబర్ 23(మనం న్యూస్):** 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం చేరాలనుకునే విద్యార్థులకు రాష్ట్ర ఇంటర్ బోర్డు ఈ నెల 24 నుండి 26 వరకు చివరి అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ ముగియనుండటంతో, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిజిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## 26న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి

**ఖమ్మం, సెప్టెంబర్ 23(మనం న్యూస్):** సెప్టెంబర్ 26 న వీరనారీ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 26న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసి అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పంచాయతీ పాలనలో వార్డు సభ్యులే కీలకం..!

- మినిట్స్ బుక్లో సభ్యుల సంతకం ఉంటేనే తీర్మానానికి చట్టబద్ధత....
- ఖాతాల పరిశీలన, పనుల నాణ్యతపై నిలదీసే హక్కు వార్డు ప్రతినిధులదే...




**భద్రాచలం, సెప్టెంబర్ 23 (మనం న్యూస్):** పాలకవర్గం లేని సమయంలో చేపట్టిన పనులకు ప్రస్తుతం గ్రామ నిధుల నుంచి బిల్లులు చెల్లించాలన్నా, నూతన పాలకవర్గం ఆమోదం, తీర్మానం తప్పనిసరిగా అవసరం.. పంచాయతీ తీర్మానాల రిజిస్టర్లో వార్డు సభ్యుల సంతకాలు తప్పనిసరి,సమావేశం ముగియగానే మినిట్స్ బుక్పై సంతకం పెట్టాల్సిందే. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సెక్షన్ 47 నిబంధనలు స్పష్టం చేసింది. వార్డు మెంబర్లకు చట్టబద్ధమైన ప్రాథమిక హక్కులు, గ్రామ పంచాయతీల పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 కీలక నిబంధనలను నిర్దేశించింది. గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశాలలో తీసుకునే ప్రతి నిర్ణయం, ఆమోదించే ప్రతి తీర్మానానికి సంబంధించిన అధికారిక రికార్డు (మినిట్స్ బుక్) లో హాజరైన వార్డు సభ్యులు తప్పనిసరిగా సంతకాలు చేయాలి. వార్డు సభ్యుల సంతకాలు లేకుండా లేదా వారిని సంప్రదించకుండా దొడ్డిదారిన నమోదు చేసే, ఏ తీర్మానమైనా చట్టరీత్యా చెల్లదని చట్టం స్పష్టం చేస్తోంది.

**కీలక సెక్షన్లు ,చట్టబద్ధ నిబంధనలు:**

**సెక్షన్ 47 (మినిట్స్ బుక్ ) సంతకాల నిబంధన):**
పంచాయతీ సమావేశంలో జరిగే చర్చలు, ఆమోదించే తీర్మానాలన్నింటినీ పంచాయతీ కార్యదర్శి రిజిస్టర్లో నమోదు చేయాలి.సమావేశం ముగిసిన వెంటనే ఆ సమావేశానికి అధ్యక్షత వహించిన అధికారి (సర్పంచ్/ఉపసర్పంచ్)తో పాటు హాజరైన వార్డు సభ్యులందరూ తప్పనిసరిగా తీర్మానాల రిజిస్టర్ (మినిట్స్ బుక్) లో సంతకాలు చేయాలి.వార్డు సభ్యుల సంతకాలు లేకుండా రిజిస్టర్ను ముగించడం చట్టవిరుద్ధం.

**సెక్షన్ 47(4) (కలెక్టర్కు ఫిర్యాదు చేసే హక్కు):....:**

మెజారిటీ వార్డు సభ్యులు ఆమోదించిన ప్రజా తీర్మానంపై సర్పంచ్ లేదా అధ్యక్షత వహించిన వ్యక్తి సంతకం చేయడానికి నిరాకరిస్తే, వార్డు సభ్యులు తమ సంతకాలతో నేరుగా జిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం) కు ఫిర్యాదు చేయవచ్చు. కలెక్టర్ విచారణ జరిపి ఆ తీర్మానాన్ని అమలు చేసే అధికారం కలిగి ఉంటారు.పంచాయతీ నెలకు కనీసం ఒకసారైనా పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించాలి, సమావేశ తేదీకి ముందే ఎజెండా వివరాలతో కూడిన నోటీసును ప్రతి వార్డు సభ్యుడికి రాతపూర్వకంగా అందజేయాలి. వార్డు సభ్యుల్లో కనీసం 1/3 వంతు మంది లిఖితపూర్వకంగా కోరితే ప్రత్యేక సమావేశాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.మొత్తం సభ్యులలో కనీసం మూడో వంతు మంది (కోరం) హాజరైతేనే పాలకవర్గ సమావేశం చెల్లుబాటు అవుతుంది. కోరం లేకుండా తీర్మానాలు రాయడం శిక్షార్హం.

**చట్టం కల్పించిన వార్డు సభ్యుల ప్రాథమిక హక్కులు...**

**తీర్మానంపై సంతకం చేసే ,ఆమోదించే హక్కు:**
గ్రామ నిధుల ఖర్చు, అభివృద్ధి పనుల కేటాయింపులకు సంబంధించిన తీర్మానం రాసిన తర్వాత దానిని పరిశీలించి, రిజిస్టర్లో సంతకం చేసే పూర్తి చట్టబద్ధ హక్కు సభ్యులకు ఉంటుంది.

**వ్యతిరేకించే హక్కు.**
సమావేశంలో ప్రవేశపెట్టిన ఏ తీర్మానమైనా ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని భావిస్తే, వార్డు సభ్యులు తమ వ్యతిరేకతను రిజిస్టర్లోనే లిఖితపూర్వకంగా నమోదు చేసే (డిసెంట్ నోట్ రాసే) స్వేచ్ఛ ఉంది.

**రికార్డులు, ఖాతాల తనిఖీ హక్కు... :**
పంచాయతీ నిధుల జమ-ఖర్చులు, క్యాష్ బుక్, ఓచర్లు, అభివృద్ధి పనుల ఎస్టిమేట్లను పంచాయతీ కార్యాలయంలో పరిశీలించే అధికారం ప్రతి వార్డు సభ్యుడికీ ఉంటుంది.

**ప్రశ్నించే హక్కు.... :**
గ్రామంలో జరిగే పనుల నాణ్యత, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, పన్నుల వసూళ్లపై పాలకవర్గ సమావేశంలో అధికారులను నేరుగా నిలదీసి సమాధానం కోరే హక్కు ఉంది.

**వార్డు ప్రణాళిక రూపకల్పన:**
తమ వార్డు అవసరాలు, సమస్యలను గుర్తించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక లో చేర్పించే అధికారం వార్డు సభ్యులదే. వార్డు సభ్యులను కేవలం రబ్బరు స్టాంపులుగా భావిస్తూ, సమావేశాలు నిర్వహించకుండా సంతకాలు ఫోర్జరీ చేసినా, లేదా రిజిస్టర్లో వారి సంతకాలు లేకుండా నిధులు డ్రా చేసినా సంబంధిత అధికారులు, పాలకవర్గంపై క్రిమినల్ ,పంచాయతీ రాజ్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## పేద రోగులకు న్యూరోసర్జరీ విభాగంలో అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతం



- స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్
- టిటిడి హై ఎండ్ థెరపీ (ప్రాణదానం), డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా దాదాపు రూ.15 లక్షల ఆర్థికసాయం

**తిరుపతి సెప్టెంబరు 23 మనం న్యూస్:** తిరుపతి: ఆర్థికంగా వెనుకబడిన రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్), తిరుపతిలోని న్యూరోసర్జరీ విభాగం అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిందని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ తెలిపారు. మెడ నొప్పి సమస్యతో వచ్చిన 67 ఏళ్ల పేషెంట్ క్లిష్టమైన న్యూరోసర్జరీ శస్త్ర చికిత్ససత్యసాయి జిల్లా ఉడుమలకుర్తి గ్రామానికి చెందిన 67 ఏళ్ల నాగిరెడ్డి సిద్ధారెడ్డి మెడ భాగంలో తీవ్రమైన నొప్పి, ఇతర సమస్యలతో స్విమ్స్కు వచ్చారు. వైద్య పరీక్షలు, అవసరమైన స్కానింగ్ల అనంతరం రోగి పరిస్థితిని న్యూరోసర్జరీ వైద్యులు సమగ్రంగా పరిశీలించారు.రోగి పరిస్థితికి అనుగుణంగా అవసరమైన క్లిష్టమైన న్యూరోసర్జరీ చికిత్సను అత్యాధునిక వైద్య సాంకేతికతతో విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం రోగి వైద్యుల పర్యవేక్షణలో పాల్గొని బుధవారం డిశ్చార్జ్ చేయడం జరిగింది. ఈ చికిత్సకు తిరుమల తిరుపతి దేవస్థానములు హై ఎండ్ థెరపీ (ప్రాణదానం) పథకం ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందింది.అస్లీప్' విధానంలో పేషెంట్ బొక్క నాగ సతీష్కు జిపిఐ-డిబిఎస్ పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం గ్రామానికి చెందిన 23 ఏళ్ల బొక్క నాగ సతీష్కు స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగంలో అత్యాధునిక (జిపిఐ-డిబిఎస్) చికిత్సను 'అస్లీప్ డిబిఎస్' విధానంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ విధానంలో రోగిని మేల్కొలిపి ఉంచకుండా, ముందస్తు ప్రణాళిక, అధునాతన ఇమేజింగ్, ఖచ్చితమైన నావిగేషన్ మరియు సాంకేతిక మార్గదర్శకత్వంతో మెదడులోని నిర్దిష్ట ప్రాంతమైన (జిపిఐ)లో ఇరువైపులా ప్రత్యేక ఎలక్ట్రోడ్లను అత్యంత ఖచ్చితత్వంతో అమర్చారు.అనంతరం ఈ ఎలక్ట్రోడ్లను ప్రత్యేకమైన స్టిమ్యులేటర్ వ్యవస్థకు అనుసంధానం చేసి అవసరమైన న్యూరోమోడ్యులేషన్ చికిత్స అందించారు. ఈ విధానాన్ని రోగిని మేల్కొలిపి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం లేకుండా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం 'ఎస్లీప్ డిబిఎస్' ప్రత్యేకతగా వైద్యులు తెలిపారు.ఈ అత్యాధునిక చికిత్సకు టిటిడి (ప్రాణదానం పథకం) ద్వారా రూ.5 లక్షలు, డా. ఎన్.టి.ఆర్. వైద్యసేవ ట్రస్ట్ ద్వారా మరో రూ.5 లక్షలు, మొత్తంగా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు. విజయవంతంగా నిర్వహించారు పేషెంట్ కోరుకొని ఈరోజు డిశ్చార్జి చేయడం జరిగింది.

# తుమ్మలగుంటలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

### పుణ్యస్నానం ఆచరించిన చెవిరెడ్డి దంపతులు

### పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగిసిన కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



**తిరుపతి రూరల్ సెప్టెంబరు23 మనం న్యూస్:** తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించిన చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల చివరి రోజు ఉదయం ఆలయ సమీపంలోని పుష్కరిణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకన్నకు, సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజన సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. చక్రతాళ్వార్కు చక్రస్నానం నిర్వహించిన అనంతరం భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి గోవింద నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులతో పాటు వారి కుమారులు చెవిరెడ్డి మోహిత్రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్రెడ్డి పాల్గొన్నారు.

**లోక సంక్షేమం కోసం చక్రస్నానం**

తొమ్మిది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వెన్నంటి ఉండి అన్ని వాహన సేవలు, క్రతువులు విజయవంతంగా నిర్వహించిన చక్రతాళ్వార్కు చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీ. లోక సంక్షేమం, భక్తుల సుఖశాంతులను ఆకాంక్షిస్తూ ఈ పవిత్ర క్రతువును నిర్వహించారు. రాత్రి తిరుచ్చి వాహనంపై శ్రీ కల్యాణ వెంకన్న, చక్రతాళ్వార్ విహరించారు. అనంతరం యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించి, కుంభజలంతో గర్భాలయంలో సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ధ్వజావరోహణం నిర్వహించడంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు సంపూర్ణమయ్యాయి.

**అందరి సహకారంతో విజయవంతం**

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్సవాలు గ్రామస్తులు, భక్తులు, ప్రజలు, ఆలయ సిబ్బంది, అధికారుల సహకారంతో విజయవంతంగా ముగిశాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ మాజీ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




## తిరుపతి తాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలి

- త్రాగునీరు అందించకుంటే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహాన్నిఎదుర్కోవాల్సి వస్తుంది
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు

**తిరుపతి సెప్టెంబరు 23 మనం న్యూస్:** తిరుపతి నగర ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు డిమాండ్ చేశారు. ఈరోజు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రామానాయుడు మాట్లాడుతూ, తిరుపతి నగరంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మూడు రోజులకు ఒకసారి మాత్రమే తెలుగు గంగ నీటిని సరఫరా చేయడంతో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తాగునీటి సమస్య ఏర్పడితే కార్పొరేషన్ ఎన్నికలవేళ ప్రజలే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.వర్షపు నీటిని తిరుపతి పరిసర ప్రాంతాల్లోని చెరువులకు మళ్లించి వాటిని నింపడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటకుండా చర్యలు చేపట్టాలని కోరారు. తిరుపతి నగర భవిష్యత్ అవసరాలకు సరిపడా తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం శాశ్వత ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కైలాసగిరి రిజర్వాయర్కు అనుసంధానంగా మరో రెండు రిజర్వాయర్లను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. బాలాజీ రిజర్వాయర్, మల్లెమడుగు జలాశయం నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హంద్రీ-నీవా నీటిని తిరుపతి, తిరుమల తాగునీటి అవసరాలకు సత్వరం మళ్లించాలని కోరారు.సిపిఐ సీనియర్ నాయకులు టి. జనార్ధన్ మాట్లాడుతూ, తిరుపతి నగరంలో ప్రతిరోజూ తాగునీటి అవసరాలను తీర్చేలా తెలుగు గంగ నీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని కోరారు. నగర జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి వనరులను పెంచడంతో పాటు ఇప్పటికే చేపట్టిన జలాశయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# ఈగల్ పోస్టర్లను, డ్రగ్స్ వద్దు బ్రో బ్యానర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు

**తిరుపతి, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు 'ఆపరేషన్ త్రిశూల్' లో భాగంగా గంజాయి, డ్రగ్స్ నియంత్రణ, మహిళలు పిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి రోడ్డు భద్రత, డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రత తదితర అంశాల పై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈగల్ పోస్టర్లను, డ్రగ్స్ వద్దు బ్రో బ్యానర్ ను జిల్లా కలెక్టర్, ఎస్పి లు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి శాంతిభద్రతల అంశం



పై సమీక్ష సందర్భంగా డ్రగ్ మెనేస్, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు వంటి మూడు ప్రధాన అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా సమగ్రంగా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ మూడు అంశాలను కేవలం జిల్లా స్థాయిలో సమీక్షించడం కాకుండా మైక్రో లెవెల్ వరకు తీసుకెళ్లి, వార్డు, గ్రామ, పంచాయతీ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. మహిళా పోలీస్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితర క్షేత్రస్థాయి సిబ్బందిని ఒక సమన్వయ బృందంగా ఏర్పాటు చేసి స్థానిక సమస్యలను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో గృహ హింస, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ఎదురయ్యే సమస్యలు వంటి అంశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కిశోర బాలికలకు మహిళా పోలీసుల ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్తో పాటు మహిళలు, బాలికల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో అవగాహన, కౌన్సెలింగ్, పరీక్షలు, తనిఖీలతో పాటు డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు, సరఫరా గొలుసుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కాలేజీ విద్యార్థులు, వలస కార్మికులు, గతంలో డ్రగ్స్ వినియోగం లేదా సరఫరాతో సంబంధం ఉన్న వ్యక్తులు, డ్రగ్స్ వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి లక్ష్యిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

డ్రగ్స్ వినియోగించే వారిని కౌన్సెలింగ్, అవగాహన, పునరావాసం ద్వారా సాధారణ జీవనంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టడంతో పాటు, డ్రగ్స్ సరఫరా చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యాసంస్థలు, సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా అవగాహన, కౌన్సెలింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎంఈఓలు, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓలతో సమన్వయం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఇప్పటికే పలు చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ప్రమాదానికి కారణాలను విశ్లేషించి, రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను తక్షణమే గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# తుమ్మలగుంటలో.. విభూది విఘ్నేశ్వరుడికి ఘన వీడ్కోలు!

- ముందుగా చక్రతీర్థంతో అభిషేకించిన వేద పండితులు
- ఆ తరువాత వేద మంత్రాల నడుమ నిమజ్జనాన్ని ప్రారంభించిన చెవిరెడ్డి

**తిరుపతి సెప్టెంబరు23 మనం న్యూస్:** తుమ్మలగుంటలో కొలువుదీరిన విభూది విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో ఘనంగా వీడ్కోలు పలికారు. 11 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిమజ్జనానికి ముందు టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్రెడ్డి విభూది వినాయకుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాల వినాయక కమిటీ ఛైర్మన్ చెవిరెడ్డి హర్షిత్రెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.చక్రతీర్థంతో ప్రత్యేక అభిషేకం తుమ్మలగుంటలో జరుగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా లభించిన చక్రతీర్థంతో విభూది వినాయకుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిమజ్జనంలో చెవిరెడ్డి మోహిత్రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్రెడ్డిలు పాల్గొన్నారు. నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తుమ్మల గుంటలో భక్తి సందడి నెలకొంది.

**ఏడు టన్నుల విభూదితో విగ్రహం**

శ్రీశైలం, మహానంది తదితర శైవక్షేత్రాల నుంచి సేకరించిన పవిత్ర విభూదితో సుమారు ఏడు టన్నుల భారీ విగ్రహాన్ని రూపొందించారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ విభూది వినాయకుడిని 11 రోజుల పాటు భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిమజ్జన సమయంలోనూ స్వామి వారిని చివరిసారిగా దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**విభూది ప్రసాదం కోసం భక్తుల ఆసక్తి**

నిమజ్జనం సందర్భంగా విగ్రహంలోని పవిత్ర విభూదిని ప్రసాదంగా స్వీకరించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. విభూది కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరికీ పవిత్ర విభూది ప్రసాదం అందేలా బాల వినాయక కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. దీంతో విభూది వినాయకుడి నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.



# చిత్తూరు జిల్లాలో సర్ ప్రక్రియ వేగవంతం

### బీఎల్ఓల ద్వారా ఫొటో నాణ్యత పరిశీలనలో 9,20,404 ఫొటోలు ఆమోదం

### వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ సమావేశం



**చిత్తూరు సెప్టెంబర్ 23 మనం న్యూస్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం, ఓటర్ల జాబితా పరిశీలన మరియు ఇతర సమస్యల పై జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి

**కె.మోహన్ కుమార్ మాట్లాడుతూ**

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాల్లో భాగంగా ఈ నెల కూడా ఓటర్ల జాబితా సవరణ, నోటీసుల జారీ, పరిశీలన వంటి ప్రక్రియల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఎస్ఐఆర్ నోటీసులు క్లెయిమ్లు డ్రాఫ్ట్ రోల్లో నమోదైన నోటీసులపై సమగ్ర విచారణ పూర్తిచేసి, అర్హులైన అభ్యర్థుల డేటాను ఫైనల్ పబ్లికేషన్ కోసం పంపడం జరిగింది. క్లెయిమ్లు, అభ్యంతరాలు, ఫారమ్-6, ఫారమ్-7 ఫారమ్-8ల దాఖలు ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ, అనర్హులైన లేదా డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటర్ల సమాచారాన్ని క్షేత్రస్థాయి పరిశీలనల అనంతరం సవరిస్తున్నామని పేర్కొన్నారు.ఇప్పటి వరకు జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు, విచారణలు, ఫారమ్ల పరిశీలన, ఫొటో నాణ్యత తనిఖీ తదితర ప్రక్రియలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని 170-నగరి, 171-జీడీ నెల్లూరు (ఎస్సీ), 172-చిత్తూరు, 173-పూతలపట్టు (ఎస్సీ), 174-పలమనేరు, 175-కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నోటీసులు విచారణకు సంబంధించిసెప్టెంబర్ 22, 2026 నాటికి జిల్లాలో మొత్తం 1,34,307 నోటీసులు జనరేట్ కాగా, అదే సంఖ్యలో నోటీసులు అందజేయడం జరిగింది. మొత్తం 1,34,307 నోటీసులకు సంబంధించి విచారణలు నిర్వహించబడ్డాయి. విచారణ తేదీ ముగిసినవి, రీషెడ్యూల్ అయినవి, ఐదు రోజులకు పైగా పెండింగ్లో ఉన్న కేసులు ఏవీ లేవని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.అలాగే 25,726 కేసులు వెరిఫై చేయగా, 7 కేసులు నాట్ వెరిఫైడ్గా నమోదయ్యాయి. తుది ప్రకటనకు అనర్హంగా గుర్తించినవి 2,489 కాగా, తుది ప్రచురణకు సంబంధించి నోటీసులతో 1,31,818 కేసులు, ఇతర కారణాలతో తుది ప్రచురణకు 10,69,754 కేసులు నమోదు అయ్యాయని, ఫారమ్ల స్వీకరణ, పరిశీలనకు సంబంధించి 2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 22 వరకు జిల్లాలో వివిధ రకాలుగా మొత్తం 2,22,096 ఫారమ్లు సమర్పించబడ్డాయి. ఇందులో 1,40,733 ఆఫ్లైన్, 81,363 ఆన్లైన్ ద్వారా సమర్పించబడ్డాయి.



# వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు

**వెంకటగిరి సెప్టెంబర్ 23 మనం న్యూస్:** వెంకటగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.బుధవారం వెంకటగిరి నగరం పింజలి వీరయ్య కళ్యాణ మండపం నందు జిల్లా కలెక్టర్ వెంకటగిరి ఎమ్మెల్యే కొరుగొండ్ల రామకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ బానుప్రకాష్ రెడ్డి, పోలేరమ్మ ఆలయ చైర్మన్ గొల్లగుంట మురళి కృష్ణ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ మరియు శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ దేవస్థానం ప్రత్యేక అధికారి విజయరాజు, జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులతో కలిసి వెంకటగిరి పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 27వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 27న ఘటోత్సవంతో జాతర ప్రారంభమై, సెప్టెంబర్ 30న అమ్మవారి ప్రధాన ఉత్సవం, అక్టోబర్ 1న నిలువు, నిష్క్రమణ కార్యక్రమాలతో జాతర ముగుస్తుందని వివరించారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున గత సంవత్సరాల్లో ఎదురైన చిన్నచిన్న సమస్యలను సమీక్షించి, ఈసారి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్యూ మేనేజ్మెంట్, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా సుమారు 1,200 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. వీఐపీ దర్శనాలను ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే నిర్వహించేలా సమయాన్ని నిర్ణయించామని, సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.'స్త్రీ శక్తి' పథకాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల రవాణా కోసం గత సంవత్సరం 90 బస్సులు ఏర్పాటు చేయగా, ఈ సంవత్సరం 150 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఎదురైన చిన్నచిన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

భక్తుల సంఖ్య గతంలో కంటే 30 నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసుకుని క్యూ లైన్లు, పార్కింగ్, ట్రాఫిక్ మార్గాలను ముందుగానే ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం బస్సులు సరిపోని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని కోరినట్లు, సుమారు 50 అదనపు బస్సులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వడమే ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. భక్తులు క్రమపద్ధతిలో క్యూ లైన్ల ద్వారా వెళ్లి ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# పార్టీ ఉంటేనే మనకు విలువ.. కూటమి పార్టీల నిర్ణయానికి కట్టుబడాల్సిందే

- ప్రజలతో ఉండండి, చేసిన అభివృద్ధిని చెప్పండి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయం సాధించాలి
- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు సెప్టెంబరు23 మనం న్యూస్ :** పార్టీ అధికారంలో ఉంటేనే మనకు గుర్తింపు ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల నిర్ణయానికి కట్టుబడి పని చేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికల సన్నద్ధతా సమావేశం బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు షణ్ముగం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, పరిశీలకులు కుమారి ఇతర సీనియర్ నాయకుల పాల్గొన్న ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తక్కువ సమయం ఉండడంతో నాయకులు, సంబంధిత వార్డుల ఇన్చార్జిలు, కమిటీల సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో ఉంటూ, మనం చేసిన అభివృద్ధిని చూపించాలని, క్షేత్రస్థాయిలో కష్టపడే వారికి, పార్టీ పట్ల అంకితభావం ఉన్న వారికే గుర్తింపు, అవకాశాలు వస్తాయన్నారు. కూటమి పార్టీలోని జనసేన, భాజపాలకు అవకాశాలు కల్పించాల్సిన నేపథ్యంలో.. కొన్నిచోట్ల అనుకున్న వారికి అవకాశాలు దక్కకపోవచ్చు అని.. అంతమాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. అవకాశం దక్కని నిజమైన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యామ్నాయంగా పదవులు, అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలను బేరీజు వేసుకొని పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో వైకాపా నాయకులు అసత్యాలు ఆడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని, వీటిని ఎక్కడికక్కడ అడ్డుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వద్దకు తీసుకెళ్లడంతో పాటుగా.. వైకాపా నాయకుల దౌర్జన్యాలు, దురాగతాలను, వారి అక్రమ వ్యాపారాల గురించి ప్రజలను అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఎదుటివారిని విమర్శించే ముందు.. మనం ఎంత సంసారులమో ఒకసారి సరి చూసుకోవాలని వైకాపా నాయకులకు చురకలు అంటించారు. వైకాపా నాయకుల అక్రమాలు, అక్రమ ఇసుక రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్, గులకరాళ్ళ అక్రమ రవాణా, మైనింగ్ లో చేసిన అక్రమాలను త్వరలోనే ప్రజల ముందుకు తెస్తామన్నారు.

# భారత్‌కు కీలకమైన 'ఐమెక్'కు ట్రంప్ మద్దతు..!




**న్యూయార్క్, సెప్టెంబర్ 23:** భారత్ నుంచి మొదలై.. పశ్చిమాసియా మీదుగా ఐరోపాకు వెళ్లే 'ఐమెక్ కారిడర్'కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మద్దతు పలికారు. ఇరాన్‌కు పట్టున్న ప్రాంతం నుంచి ఇంధన మౌలిక వసతుల తరలింపునకు తమ ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తున్నట్లు ఆయన ఐరాస వేదికగా ప్రకటించారు. ఐరాస జనరల్ అసెంబ్లీకి అనుబంధంగా జరిగిన బహుళపక్ష సమావేశంలో భాగంగా ట్రంప్-గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ సభ్యులతో భేటీ అయ్యారు.

"పొరుగు దేశాల్లోని నౌకలపై ఇరాన్ ఉగ్రదాడులకు పాల్పడుతోంది. ఈ విషయం పశ్చిమాసియాలో ఇంధన సదుపాయాల్లో మార్పులు రావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఇరాన్‌కు పట్టున్న జలసంధికి దూరంగా ఇవి ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే మా కార్యవర్గం 'ఐమెక్', ఇతర ప్రదేశాలకు పూర్తి మద్దతు పలుకుతోంది. చమురును పైపులైన్ లేదా మరే విధంగానైనా ఆ ప్రాంతం నుంచి బయటకు పంపించాలి. దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని పీడిస్తోన్న సమస్యల నుంచి మనం బయటపడాల్సిన సమయం ఆసన్నమైంది" అని ట్రంప్ జీసీసీ సభ్యులకు వెల్లడించారు. ఐమెక్‌గా పిలిచే ది ఇండియా మిడిల్ ఈస్ట్ ఎకనామిక్ కారిడార్ ఒక మల్టీ మోడల్ కనెక్టివిటీ ప్రాజెక్ట్. ఇది భారత్‌లో మొదలై ఐరోపాలో ముగుస్తుంది. దీనిని 2023 సెప్టెంబర్ 9న తొలి సారి ఆవిష్కరించారు. ఢిల్లీ జీ20 సదస్సు దీనికి వేదికైంది. దక్షిణాసియా-పశ్చిమాసియా-ఐరోపాను అనుసంధానిస్తూ ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు.

# ఇరాన్‌పై ఎగురుతున్నదేంటి?



**టెహ్రాన్, సెప్టెంబర్ 23:** ఇరాన్ గగనతలంలో కనిపించిన ఒక విచిత్ర వస్తువు తీవ్ర ఊహాగానాలకు తావిచ్చింది. దీంతో అది అమెరికాకు చెందిన నిగూఢ విమానం 'బ్లాక్ మాంతా' అయి ఉంటుందా అన్న చర్చ మొదలైంది. అమెరికా, ఇరాన్ మధ్య తిరిగి ఘర్షణలు మొదలైన నేపథ్యంలో తాజా అంశం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

ప్రకాశవంతంగా, రంగురంగుల లైట్లతో అర్ధచంద్రాకార విమానం టెహ్రాన్ గగనతలంపై ఈ నెల 20న కనిపించింది. ఆ మరుసటి రోజే మరో వీడియో బయటకు వచ్చింది. అందులో విచిత్రమైన, కొన్ని లైట్ల సమూహం ఇరాన్‌లోని జహదన్‌కు ఎగువన విహరిస్తూ కనిపించింది. ఆకాశంలో అకస్మాత్తుగా ఇలాంటి వస్తువులు కనిపించడంతో అనేక ఊహాగానాలు మొదలయ్యాయి. కాంతులు చిమ్మే గాలిపటంగా దాన్ని కొందరు అభివర్ణించారు. అయితే దాని పరిమాణం చాలా పెద్దగా ఉన్నందువల్ల ఆ వాదనను నిపుణులు కొట్టిపారేశారు. అది అంతుచిక్కని డ్రోన్ లేదా గ్రహాంతర జీవుల వస్తువుగా మరికొందరు విశ్లేషించారు. దీనిపై ఇరాన్ సైన్యం, ప్రభుత్వం నోరు మెదడపడంలేదు. ఈ నేపథ్యంలో కొందరు నిపుణులు బ్లాక్ మాంతా విమాన సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చారు. అయితే ఇలాంటి జెట్ ఒకటి ఉనికిలో ఉందని అమెరికా ఎన్నడూ అంగీకరించలేదు. దానిపై విస్పష్ట ఆధారాలు కూడా లేవు. ఆ ఆకృతికి సంబంధించి కొన్నేళ్లుగా వస్తున్నవన్నీ పూర్తిగా ఊహాజనిత విశ్లేషణలే. అవి ఉపగ్రహ నీడలను పోలిఉన్నాయన్న వాదన కూడా ఉంది.

### గురుత్వాకర్షణను అధిగమిస్తుందా?

మధ్యధరా సముద్రంలో అమెరికా విమానవాహక నౌకపై ఇలా త్రిభుజాకార వస్తువును చూసినట్లు ఇరాన్ మీడియా 2021లో ఒక ఫొటోను పంచుకుంది. ఇది యాంటీ గ్రావిటీ పరిజ్ఞానంతో విహరిస్తుండొచ్చని కొందరు సూత్రీకరిస్తున్నారు. ఇది పలు మార్గాల్లో గురుత్వాకర్షణ ప్రభావాన్ని తగ్గిస్తుండొచ్చని వివరిస్తున్నారు. ఇది అణుశక్తిని ఉపయోగించుకుంటూ అధిక పీడనంతో కూడిన ప్లాస్మాను సృష్టిస్తుందని ఒక సిద్ధాంతం చెబుతోంది. దీనివల్ల ఈ విమానం చుట్టూ యాంటీ గ్రావిటీ క్షేత్రం ఏర్పడుతుందని వివరిస్తోంది. మాంతాలో ప్రత్యేక థ్రస్ట్ వ్యవస్థలు ఉండొచ్చని, దానివల్ల అది అప్పటికప్పుడు తన వేగాన్ని, దిశను మార్చుకోగలదని విశ్లేషిస్తున్నారు. అణు చర్యల ద్వారా ఉత్పత్తయ్యే ప్లాస్మా వల్ల విమానం.. రాడార్‌కు అంత సులువుగా దొరకదని వివరిస్తున్నారు. అందువల్ల అది ఎక్కువ దూరం ప్రయాణించగలుగుతోందని పేర్కొంటున్నారు.

మాంతా ఒక నిశ్శబ్ద విమానమని, నిఘా సమాచార సేకరణ దాని ప్రాథమిక విధి అని అమెరికాకు చెందిన ఒక పరిశోధక బృందం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిస్కవరీ సైన్స్ విశ్లేషించింది. అయితే వీటిని స్వతంత్రంగా ఏ సంస్థ కూడా నిర్ధారించలేదు. అమెరికా తన యుద్ధవిమానాలను తొలుత అనేక సంవత్సరాల పాటు రహస్యంగా గగనవిహారం చేయిస్తుంటుందని, ఆ తర్వాత దాని ఉనికిని అంగీకరిస్తుందని కొందరు గుర్తుచేస్తున్నారు. ఎఫ్-117 నైట్‌హాక్ యుద్ధవిమానం విషయంలోనూ ఇలాగే జరిగిందని చెబుతున్నారు.

# దుర్భేద్య మిలిటరీ కాంప్లెక్స్‌గా.. శ్వేతసౌధం

- సరికొత్త డ్రోన్‌పోర్ట్ ఏర్పాటు




**వాషింగ్టన్, సెప్టెంబర్ 23:** అమెరికా అధ్యక్ష భవనమైన శ్వేతసౌధాన్ని ట్రంప్ అత్యాధునిక మిలిటరీ కాంప్లెక్స్‌గా మార్చేయనున్నారు. దీనిలో భాగంగానే ఆయన కార్యవర్గం తాజాగా నిర్మిస్తున్న బాల్‌రూమ్‌లో ఓ అత్యాధునిక డ్రోన్‌పోర్టు ఏర్పాటు చేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. వీటిల్లో క్షిపణులు ప్రయోగించగలిగే అత్యాధునిక డ్రోన్లు కూడా ఉండనున్నట్లు వెల్లడించారు. వాషింగ్టన్‌లో దాదాపు 18 ఎకరాల్లో విస్తరించిన శ్వేతసౌధం కాంప్లెక్స్‌ను శత్రుదాడుల నుంచి రక్షించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

శ్వేతసౌధానికి కొద్ది దూరంలోని ట్రెజరీ డిపార్ట్‌మెంట్ భవనంపై సీక్రెట్ సర్వీస్ విభాగం రహస్యంగా ఓ మినీ డ్రోన్‌పోర్టును నిర్వహిస్తోంది. ఇక్కడ ఎప్పుడూ నాలుగు డ్రోన్లు గ్రే కలర్ బాక్సుల్లో సిద్ధంగా ఉంటాయి. అధికారుల ఆదేశాల మేరకు ఇవి గాల్లో ఎగిరి చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏం జరుగుతోందో సమాచారం సేకరించి తిరిగి బాక్సుల్లోకి వెళ్లిపోతాయి. అయితే శ్వేతసౌధం భద్రతను కారణంగా చూపి.. ఇక్కడ భారీ డ్రోన్‌పోర్టు నిర్మించాలని ట్రంప్ వాదిస్తున్నారు. నిపుణులు మాత్రం ట్రంప్ ప్రతిపాదనలో లోపాలను ఎత్తిచూపుతున్నారు. అసలు డ్రోన్ శ్వేతసౌధం వరకు వస్తే.. అదే భద్రతా వైఫల్యమని స్కై ఫైర్ ఏఐ వ్యవస్థాపకుడు మ్యాట్ స్లోనే పేర్కొన్నారు. ఈ భారీ డ్రోన్‌పోర్టు కంటే.. సీక్రెట్ సర్వీస్ ఇప్పటికే వాడుతున్నటువంటివి సరిపోతాయని అభిప్రాయపడ్డారు. కానీ, ట్రంప్ మాత్రం అక్కడ భారీ డ్రోన్లను మోహరిస్తున్నట్లు తన సోషల్ మీడియా పోస్టులో ఏఐ చిత్రాన్ని విడుదల చేశారు.

### గగనతల రద్దీని ఎలా తట్టుకోవడం..

ట్రంప్ కోరినట్లు శ్వేతసౌధం బాల్‌రూమ్ వద్ద డ్రోన్‌పోర్టు ఏర్పాటు చేస్తే.. పౌర విమానాలకు సమస్యగా మారే ప్రమాదం ఉంది. ఇక్కడికి సమీపంలోనే అత్యంత రద్దీ అయిన రీగన్ వాషింగ్టన్ ఎయిర్ పోర్టు ఉంది. శ్వేత సౌధం సమీపంలో కమర్షియల్ విమానాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టును సమన్వయం చేసుకుంటూ.. డ్రోన్‌పోర్టు నిర్వహించడం కత్తిమీద సాముగా మారే అవకాశం ఉంది. వాస్తవానికి సీక్రెట్ సర్వీస్ ఎప్పటి నుంచో డ్రోన్ సామర్థ్యాలను మెరుగుపర్చుకుంటూ వస్తోంది. 2024లో పెన్సిల్వేనియా బట్లర్ కౌంటీలో ట్రంప్‌పై దాడి జరిగిన నాటి నుంచి దీనిని మరింత వేగవంతం చేసింది. నాడు కూడా నిందితుడు తొలుత డ్రోన్‌ను ప్రయోగించి చుట్టుపక్కల ఏం జరుగుతుందో గమనించాడు. దీనిని కూల్చివేయడంలో నాడు సీక్రెట్ సర్వీస్ విఫలమైంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో డ్రోన్లు సృష్టించిన విధ్వంసం చూశాక.. శ్వేత సౌధంలో ఈ పోర్టు అవసరం ఏర్పడింది. దీనిపై వైట్‌హౌస్‌లో సీక్రెట్ సర్వీస్‌ను పర్యవేక్షించిన మాజీ అధికారి పాల్ ఎక్లోఫ్ మాట్లాడుతూ.. డ్రోన్లు శ్వేతసౌధానికి అతిపెద్ద ముప్పులా మారినట్లు అభివర్ణించారు. వాటి నుంచి అధ్యక్ష భవనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.




# బాగ్దాద్‌లోకి ఇరాన్ విమానాలు రాకూడదు

- ఇరాక్ పౌర విమానయాన సంస్థ కీలక నిర్ణయం

**బాగ్దాద్, సెప్టెంబర్ 23:** నేటి నుంచి అమెరికా ఆంక్షలు అమల్లోకి రానుండటంతో తమ దేశ రాజధానిలోకి ఇరాన్ విమానాల రాకపోకలను ఇరాక్ నిలిపివేసింది. ఈ మేరకు ఇరాక్ పౌర విమానయాన సంస్థ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇరాన్‌కు చెందిన విమానాలకు ఆశ్రయమిచ్చే ఏ ఎయిర్‌పోర్టు అయినా తమ ఆంక్షల పరిధిలోకి వస్తుందని అమెరికా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. నేటి నుంచి అమెరికా రెండో విడత ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. బాగ్దాద్ విమానాశ్రయం నుంచి ఇరాన్ విమానాలను నజఫ్ ఎయిర్‌పోర్టుకు తరలించే అంశంపై ఇప్పుడు ఇరాక్ చర్చలు జరుపుతోంది. బుధవారం అర్ధరాత్రి నుంచి అమెరికా ఆంక్షలు అమల్లోకి రానుండటంతో ఈ అంశంపై వేగంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మరోవైపు ఇరాన్ కూడా చర్యలు చేపట్టింది. ఆ దేశ పౌరవిమానయాన శాఖ ఒమన్‌లోని మస్కట్, ఇరాక్‌లోని బాగ్దాద్‌కు ఫ్లైట్లను రద్దు చేసింది. కానీ, ఇస్తాంబుల్ సహా ఇతర అంతర్జాతీయ మార్గాలకు మాత్రం విమానాలను కొనసాగిస్తోందని తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. ఇప్పటికే ఇరాన్‌కు ప్రయాణించేవారిని ఒమన్ అనుమతించడంలేదని ఇరాన్ ప్రతినిధి వెల్లడించారు. ఆయా దేశాల ఎయిర్‌పోర్టుల్లోకి వచ్చే ఇరాన్ విమానాలకు ఎట్టి పరిస్థితుల్లో ఇంధనం, ల్యాండింగ్ సేవలు, టికెట్ల విక్రయాలు చేపట్టకూడదని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రపంచ దేశాలను హెచ్చరించారు. దీనిని ఉల్లంఘిస్తే ఆయా విమానాశ్రయాలను డాలర్ వ్యవస్థ నుంచి దూరం పెడతామని హెచ్చరించారు.

# డర్బన్‌లో కాల్పులు.. 11 మంది మృతి



**డర్బన్, సెప్టెంబర్ 23:** దక్షిణాఫ్రికాలోని ఓ నివాస భవనంలో సాయుధులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం అర్ధరాత్రి డర్బన్ నగర సమీపంలోని క్వామాఖుతా టౌన్‌షిప్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానిక అధికారుల కథనం ప్రకారం రాత్రి కుటుంబసభ్యులు, స్నేహితులు పార్టీ చేసుకుంటుండగా ముగ్గురు సాయుధులు అకస్మాత్తుగా ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం అక్కడ ఉన్న 14 మందిపై పలు రౌండ్ల కాల్పులు జరిపారు. నివాస భవనంలో కాల్పుల శబ్దంతో భయాందోళనకు గురైన చుట్టుపక్కల వారు పరుగులు తీశారు. ఈ ఘటనలో 10మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన నలుగురిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. మృతుల్లో ఓ గర్భిణి కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కచ్చితమైన కారణం తెలియరాలేదు. పాత గొడవల కారణంగా దుండగులు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

# సౌదీకి హ్యాండివ్వడాన్ని సల్మాన్ అంత తేలిగ్గా మర్చిపోరు..

## అమెరికా ఇంటెలిజెన్స్ మాజీ అధికారి కారెన్ గిబ్సన్ వెల్లడి



**వాషింగ్టన్, సెప్టెంబర్ 23:** హూతీల నుంచి తమ దేశాన్ని రక్షించే విషయంలో అమెరికా సహాయ నిరాకరణపై సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆగ్రహంగా ఉన్నారు. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు బీటలు వారుతున్నాయి. ఈ విషయాన్ని స్వయంగా అమెరికా ఇంటెలిజెన్స్ మాజీ డైరెక్టర్, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కారెన్ గిబ్సన్ వెల్లడించారు. అమెరికా చేసిన పనిని ఎంబీఎస్ ఎన్నటికీ మర్చిపోరని పేర్కొన్నారు. ఈ చర్య అమెరికాతో సంబంధాల విషయంలో సౌదీ పునరాలోచనలో పడేట్లు చేసిందన్నారు. వాస్తవానికి హూతీలపై సైనిక ఆపరేషన్ చేపట్టాలని సౌదీ కోరగా.. అమెరికా మాత్రం కేవలం ఇంటెలిజెన్స్, ఆయుధాలు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను మాత్రమే సమకూర్చి ఊరుకొంది. అమెరికా మిత్రదేశమైన బ్రిటన్ మాత్రం దీనికి భిన్నంగా సౌదీ కోరిక మేరకు దళాల ఆత్మరక్షణ కోసం ఎయిర్ టూ ఎయిర్ రిఫ్యూయలింగ్ సౌకర్యాలను కల్పిస్తామని ప్రకటించింది. మరికొన్ని రోజుల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చి కొన్ని వారాలపాటు కొనసాగనుంది. సౌదీకి బహిరంగంగా సైనిక మద్దతు అందించిన తొలి దేశంగా నిలిచింది. అంతేకాదు.. ఇతర మిత్ర దేశాలు కూడా సౌదీకి అండగా నిలవాలని కోరేందుకు బ్రిటన్ సన్నాహాలు చేస్తోంది. హూతీలను తరిమేస్తేగానీ బాబ్ అల్ మాండెబ్ సురక్షితంగా ఉండదని బ్రిటన్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు అమెరికా మాత్రం ఒమన్ మధ్యవర్తిత్వంతో హూతీలతో చర్చలు జరుపుతోంది. అంతేకాదు. అమెరికా ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా దాడులు చేయబోమని హూతీలు తమకు హామీ ఇచ్చినట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించడం సౌదీని మరింత ఇబ్బందికి గురి చేసింది. మరోవైపు యెమెన్‌లోని హూతీ రెబల్స్ ఎర్రసముద్ర తీరాన్ని వీలైనంత ఎక్కువగా తమ ఆధీనంలోకి తీసుకొంటున్నారు. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత కీలక జలసంధి అయిన బాబ్ అల్ మాండెబ్ మీద పూర్తిస్థాయి పట్టు సాధించారు. తాజాగా సౌదీకి 50 ఎఫ్-35 యుద్ధ విమానాలు విక్రయించేందుకు అమెరికా విదేశాంగశాఖ నోటిఫై చేసింది. కానీ, ఈ విమానాలు అందేందుకు కొన్నేళ్ల సమయం పట్టొచ్చు. మరోవైపు సౌదీ అంశంపై చర్చించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్‌కు చెందిన కీలక ప్రతినిధులతో న్యూయార్క్‌లో భేటీ కానున్నారు.

# 'పీవోకేలో దురాగతాలు'..

## ఐరాసలో పాకిస్థాన్‌ను ఎండగట్టిన కశ్మీరీ మహిళ



**న్యూయార్క్, సెప్టెంబర్ 23:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో దాయాది సాగిస్తున్న దురాగతాలను జమ్మూకశ్మీర్‌కు చెందిన ఓ మహిళా సామాజిక కార్యకర్త ఐరాస వేదికగా ఎండగట్టారు. పీవోకేలో క్షీణిస్తున్న మానవ హక్కుల పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసనలు చేస్తున్న పౌరులను పాకిస్థాన్ భద్రతా దళాలు కాల్చిచంపుతున్నాయని ఆరోపించారు. ఈ హత్యలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. 'అసోసియేషన్ ఆఫ్ టెర్రర్ విక్టిమ్స్ ఇన్ కశ్మీర్' తరపున పనిచేస్తున్న, బారాముల్లాకు చెందిన తస్లీమా అక్తర్ యూఎన్‌హెచ్‌ఆర్‌సీ సమావేశంలో ఈమేరకు ప్రసంగించారు. "ఆర్థిక, పాలనాపరమైన సమస్యలపై ఇటీవల పీవోకేలో శాంతియుత నిరసనలు జరిగాయి. అయితే, పాక్ ప్రభుత్వం వాటిని క్రూరంగా అణచివేసింది. వందలాది మంది కార్యకర్తలను అరెస్టు చేసింది. కీలక నేతలను నిర్బంధించింది. ఇంటర్‌నెట్‌ను నిలిపివేసింది. హింసాత్మక ఘర్షణల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. పాక్ బలగాల ప్రతీకార చర్యలు, అమాయక పౌరుల హత్యలను వెంటనే ఆపాలి. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలి. ఈ వ్యవహారంలో యూఎన్‌హెచ్‌ఆర్‌సీ తక్షణమే జోక్యం చేసుకోవాలి" అని తస్లీమా అక్తర్ డిమాండ్ చేశారు.

మరోవైపు.. పీవోకేకు భిన్నంగా జమ్మూకశ్మీర్ అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా పురోగతి సాధించిందన్నారు. ఉపాధి కల్పనతోపాటు స్థానిక వ్యాపారాలకు ఊతం లభిస్తోందని చెప్పారు. స్మార్ట్ సిటీ కార్యక్రమాలు, గ్రామీణ మౌలిక సదుపాయాలు.. అభివృద్ధిని మరింత బలోపేతం చేశాయని పేర్కొన్నారు.

# విజృంభించనున్న సూపర్ ఎల్నినో..

## మరింతగా భానుడి భగభగలు




**చికాగో, సెప్టెంబర్ 23:** ప్రపంచవ్యాప్తంగా పేద దేశాల్లో 'సూపర్ ఎల్నినో'తో లక్షల సంఖ్యలో ప్రాణాలు పోవడం ఖాయమని చికాగోలోని క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక హెచ్చరిస్తోంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి మధ్యలో కనీసం 4.5 లక్షల మంది ఎండ వేడికి చనిపోయే అవకాశం ఉందని పేర్కొంది. భారత్‌లో కూడా వేల సంఖ్యలో మరణాలకు అవకాశాలున్నాయని నివేదిక వెల్లడించింది. సాధారణ రోజుల్లో సగటున ఎంతమంది చనిపోతారనే ముందస్తు అంచనాకు ఇది అదనమని రిపోర్టు పేర్కొంది. 1996-2025ను బేస్‌లైన్‌గా తీసుకొని దీనిని తయారు చేశారు.

ప్రపంచ పేద దేశాలపై ఈ రిపోర్టు ఎక్కువ దృష్టి సారించింది. ఆఫ్రికాలోని 'సాహిల్ రీజియన్' (ఆఫ్రికా మధ్యలోని 9 దేశాల్లో ఐదువేల కిలోమీటర్లు విస్తరించిన ప్రాంతం)లో 66,800 మంది వేడిమి కారణంగా అదనంగా చనిపోవచ్చని వెల్లడించింది. వీటిల్లో 31,400 మరణాలు నైజీరియాలో, 17,500 మరణాలు సుడాన్‌లో, 10,000 మరణాలు నైజెర్‌లో, 8,000 మరణాలు ఛాడ్‌లో నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఇక ఆగ్నేయాసియాలో ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌ల్యాండ్, కంబోడియాలో కలిపి సంయుక్తంగా 19,400 అదనపు మరణాలు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఒక్క ఇండోనేసియాలోనే 19,300 మంది ప్రాణాలు కోల్పోతారని చెప్పింది. పెరిగిన ఉష్ణోగ్రతలు తట్టుకోలేక.. భారత్‌లో 15,800, బ్రెజిల్‌లో 13,300 మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారత్, పాకిస్థాన్ దేశాల్లో రానున్న వేసవిలో కూడా మరణాలు నిలకడగా పెరిగే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది.

ప్రభుత్వాలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకునేలా తమ నివేదిక ఉపయోగపడుతుందని ది క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ వెల్లడించింది. ముందస్తుగా హీట్ వార్నింగ్స్ జారీ చేయడం, కూలింగ్ సెంటర్లు నిర్వహించడం, తాగునీటి సౌకర్యాలను పెంచడం, ఆరుబయట పనిచేసే ఉద్యోగులకు రక్షణ ఏర్పాట్లు కల్పించడం, ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయడానికి ఈ అంచనాలు ఉపయోగపడనున్నాయి.

### 2027లో కూడా వదలని ఎల్‌నినో..!

ఇప్పటి వరకు ఎల్‌నినో పూర్తి స్థాయిలో ఏర్పడలేదు. సెప్టెంబర్ 3వ తేదీన ప్రపంచ వాతావరణ సంస్థ స్పందిస్తూ భవిష్యత్తులో ఎల్‌నినో మరింత బలపడుతుందని పేర్కొంది. దీని తీవ్రత నవంబర్, డిసెంబర్ నెలల్లో తారస్థాయికి చేరుతుందని అంచనావేసింది. 2027 ఫిబ్రవరిలో కూడా ఇది కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ భావిస్తోంది. భూమధ్య రేఖ వద్ద పసిఫిక్ సముద్రంలో ఉష్ణోగ్రత కూడా 1.8 డిగ్రీల సెల్సియస్ పెరిగొచ్చని ఇప్పటికే అమెరికా నేషనల్ ఓసియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. భూ ఉత్తరార్ధగోళంలో ఎల్‌నినో చాలా బలంగా ఉంటుందని ఈ సంస్థ వెల్లడించింది. 1901లో రికార్డుల నమోదు మొదలైన నాటి నుంచి ఈ ఏడాది ఆగస్టు నెల 'అత్యంత వేడిగా ఉన్న ఆగస్టు'గా నిలిచింది.

# డీల్స్ కోసం ట్రంప్ తహతహ..

## డీలాపడేలా జిన్‌పింగ్ నిర్ణయం



**న్యూయార్క్, సెప్టెంబర్ 23:** చైనా అధ్యక్షుడి అమెరికా పర్యటన ట్రంప్‌నకు మింగుడుపడేలా లేదు. జిన్‌పింగ్ నేటి నుంచి రెండ్రోజులపాటు యూఎస్‌లో పర్యటించనున్నారు. చైనా అగ్రనేతకు స్వాగతం పలికేందుకు స్వయంగా ట్రంప్ విమానాశ్రయానికి రానున్నారు. ఇంత చేస్తున్నా.. చైనా కంపెనీలతో భారీ డీల్స్ చేసుకోవాలనే ట్రంప్ లక్ష్యం మాత్రం నెరవేరేలా లేదు. అమెరికా పర్యటనకు జిన్‌పింగ్ ఒక్కరే వస్తున్నట్లు సమాచారం. ఆయన వెంట పారిశ్రామికవేత్తలు, సీఈవోలు ఎవరూ రావడంలేదని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ట్రంప్-జిన్‌పింగ్ మధ్య గురువారం భేటీ జరగనుంది.

దీనికి అమెరికా వైపు నుంచి టెక్ సంస్థల సీఈవోలు హాజరవుతున్నారు. వీరిలో జుకర్‌బర్గ్, జెన్సన్ హువాంగ్, శామ్ ఆల్ట్మన్, సత్య నాదెళ్ల, జెఫ్ బెజోస్, టిమ్ కుక్, ఎలాన్ మస్క్, సుందర్ పిచాయ్, మైఖెల్ డెల్, జెన్ ఫ్రేసెర్, జెమీ డిమోన్ వంటి దిగ్గజాలు హాజరుకానున్నార

అయితే చైనా పక్షాన ఎవరూ రావడంలేదని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇప్పటికే కథనం వెలువరించింది. 2015లో ఇరు దేశాల మధ్య చర్చలకు జిన్పింగ్ పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలను తీసుకొచ్చారు. కానీ, ఈ సారి ఆయన ఒక్కరే వస్తున్నారు. ఇరు దేశాల మధ్య రాజకీయ, ఏఐ, తైవాన్ అంశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ఇటీవల తీవ్రంగా మారిన విషయం తెలిసిందే. అమెరికాలో మిడ్‌టర్మ్ ఎన్నికలు దగ్గరపడటంతో ట్రంప్ కార్యవర్గానికి ఈ భేటీ కీలకంగా మారింది. దీని పరిణామాలను ట్రంప్ విజయంగా చెప్పి ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి.

ఊఈ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తే కాంగ్రెస్ ఉభయ సభల్లో రిపబ్లికన్ల పెత్తనానికి గండి పడే ప్రమాదం ఉంది. అమెరికా పర్యటనకు వస్తోన్న జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం పలకాలన్న ట్రంప్ నిర్ణయంపై స్వపక్షంలోనే విమర్శలు వస్తున్నాయి. సెనెట్ ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ రోజర్ వికెర్ ఈ నిర్ణయాన్ని తప్పుపట్టారు.

ఊఆయన సెనెట్లో మాట్లాడుతూ 'శ్వేతసౌధం నన్ను సలహా అడిగితే.. జిన్‌పింగ్, కమ్యూనిస్టు పార్టీతో తమకున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని చైనా అధినేతను వాషింగ్టన్‌కు ఆహ్వానించొద్దని చెప్పేవాడిని. స్టేట్ డిన్నర్ వేళ చైనా సైనిక మోహరింపులు, ఇరాన్‌కు అందిస్తోన్న సాయంపై ట్రంప్ ఆరా తీయాలి. మన అతిథి నియంత అని.. అమెరికాపై ఆయుధాలు ఎక్కుపెట్టారని ట్రంప్ గుర్తించాలి' అని పేర్కొన్నారు.

# సర్పంచ్.. వర్సెస్...కార్యదర్శి..!

సర్పంచ్ దుర్భాషలాడారనే ఆరోపణలతో ఎంపీడీవో కార్యాలయంలోనే మకాం

30 రోజులైనా గ్రామ పంచాయతీకి మొకం చాటే చేసిన సెక్రటరీ

డిఎస్ఆర్ యాప్ లో హాజరు నమోదుపై అనుమానాలు

గ్రామానికి రాకుండా విధుల్లో ఉన్నట్లు రికార్డులో నమోదు

పెన్షన్ ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్లో ఇబ్బందులు ఎదురు అవుతున్నాయంటూ స్థానిక ప్రజల ఆవేదన

ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నచందంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి దుస్థితి






అనంతగిరి, సెప్టెంబర్ 23 (మనం న్యూస్) మండల పరిధిలోని పాలవరం తండా గ్రామ పంచాయతీలో పరిపాలనపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.... గ్రామ సర్పంచ్ ... వర్సెస్ ... గ్రామ కార్యదర్శి మధ్య విభేదాలతో గ్రామ ప్రజల నెలరోజులుగా అవస్థలు పడుతున్నట్లు తెలుస్తోంది... ప్రస్తుతం జిపిలో విధులు నిర్వహిస్తున్న..గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమారు 30 రోజులుగా గ్రామ కార్యాలయ ముఖం చూడకపోవడం ఆశ్చర్యాన్ని గురిచేస్తుంది..సర్పంచ్ తనను దుర్భాషలాడారనే కారణంతో కార్యదర్శి ఎంపీడీవో కార్యాలయంలోనే 30 దినాలుగా తిష్ట వేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. అయితే సమస్య పరిష్కారానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే దానిపై స్పష్టత లేదని .. కనీసం డిప్యూటేషన్ తో నాయనా మరో సెక్రెటరీకి బాధ్యతలు అప్పజెప్పాలని గ్రామస్తులు తేల్చి చెబుతున్నారు.. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ దుర్భాషలాడినట్లు ఆరోపణలకు సంబంధించిన ఆడియో రికార్డు ఉన్నప్పటికీ.. ఆ ప్రజా ప్రతినిధిపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారనే ప్రశ్నలు స్థానికుల నుంచి తలెత్తుతున్నాయి.. ₹రాజకీయ ఒత్తిడి అధికార పార్టీ అండ ఉందా...?₹

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కాబట్టి అధికారులు వెనకడుగు వేస్తున్నారా అనే అనుమానాలను కొందరు గ్రామస్తులు గుసగుసలాడుతున్నాడు..అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ధృవీకరణ కావాల్సి ఉంది.. ఈ ఇరువురి పంతం ప్రజలను ఇబ్బందులకు దారితీస్తుంది గ్రామంలో సదరు కార్యదర్శి రాకపోవడంతో అర్హుల

పెన్షన్ల దరఖాస్తులు పెన్షన్ అందజేత సంబంధించిన పనులు, ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ మౌలిక వసతుల సమస్యలు కోసం ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి గ్రామ పంచాయతీ పరిపాలన సక్రమంగా కొనసాగేందుకు కార్యదర్శి గ్రామంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.. సర్పంచ్-కార్యదర్శి మధ్య నెలకొన్న వివాదాన్ని అధికారులు యుద్ధ ప్రాతిపదికన. పరిష్కరించాలని గ్రామస్తులు తేల్చి చెబుతున్నారు.

### గ్రామ సమస్యలు గాలికి భూక్య బోస్

మా గ్రామంలో పంచాయతీ సమస్యలు గాలికి వదిలేసారని స్థానిక గ్రామస్తులు భూక్య బోస్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శి లేక నెల రోజులు దాటుతున్నది చరవాణి ద్వారా తెలుసుకోగ నేను సెలవులో ఉన్నానని తెలిపారు కానీ మా గ్రామస్తులు సర్పంచ్ కార్యదర్శి ఒకరినొకరు వాగ్వాదం జరగడంతో రావడం లేదని అన్నారు సర్పంచ్ తన సొంత పనులపై ఇతర ప్రాంతాలకు వెళుతూ గ్రామాన్ని పట్టించుకునే పరిస్థితి లేదు ఏదైనా సమస్య వస్తే ఎవరి దగ్గరికి వెళ్ళాలో అర్థం కాని దుస్థితి కానీ ఆనాటి నుండి మా గ్రామంలో జనన మరణాల గురించి గానీ ఇంటిపన్నుల విషయంలో మండలంలో అన్ని గ్రామాలలో పెన్షన్ల వెరిఫికేషన్ ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ జరుగుతుంటే మా గ్రామంలో పట్టించుకునే నాధుడు కరువయ్యారని ఆరోపించారు.

## తిరుమలగిరి మున్సిపాలిటీ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

తిరుమలగిరి, సెప్టెంబర్ 23 (మనం న్యూస్): తిరుమలగిరి మున్సిపాలిటీ రోడ్ల అభివృద్ధి కోసం 15 కోట్ల నిధులు మంజూరు చేయాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తంకుమార్ రెడ్డి , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు కు మున్సిపల్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్ రెడ్డి బుధవారం తాటిపాలకు వస్తున్న సందర్భంగా తిరుమలగిరిలో వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీ లోని తిరుమలగిరి నుండి నందాపురం వరకు, తిరుమలగిరి నుండి మాలిపురం వరకు, తిరుమలగిరి నుండి నెల్లిబండ తండా వరకు,నందాపురం నుండి అనంతారం వరకు రోడ్లు మున్సిపాలిటీ కేంద్రంలో సిసి రోడ్లు డ్రైనేజీలు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు 15 కోట్ల అంచనా తో పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోవిందమ్మ రవీందర్, కౌన్సిలర్ లు పనికెరి లక్ష్మియాదగిరి , జక్కుల రమేష్ , కారుపోతుల సోమలక్ష్మి నరేష్ , బత్తుల శకుంతలఅమ్మ , భూక్యా యాకూబ్ నాయక్ , కందకూరి గీత బాబు , సంకెపల్లి జ్యోతి నరోత్తమ



రెడ్డి , పత్తేపురం త్రిశూల్ కో ఆప్షన్ మెంబర్లు ఎండీ పాషా , మోడెపు పద్మ వీరేనా , ఎండి జక్కియా జావేద్ , దేశీనాయక్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మోడపు సురేందర్ , మధు, నాని శీను సుమను , కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మనందినపత్రిక వార్త కథనానికి స్పందించిన అధికారులు



- ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం.

నాగారం,సెప్టెంబర్ 23, మనం న్యూస్: నాగారం మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన చిన్నారులకు అందేంత తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్పై మనం దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. వార్త వెలువడిన వెను వెంటనే అధికారులు సమస్యను పరిశీలించి, ట్రాన్స్ఫార్మర్ను సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. ప్రధాన రహదారి పక్కనే ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకర స్థితిలో ఉన్న విషయాన్ని ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ అనే శీర్షికతో ప్రచురించిన విషయం తెలిసిందే. చిన్నారులు,వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతంలో ట్రాన్స్ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామ ఉప సర్పంచ్ వంగూరి అంజి యాదవ్, గ్రామపంచాయతీ ప్రతినిధులు,స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించారు.అనంతరం ట్రాన్స్ఫార్మర్ వద్ద అవసరమైన భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదానికి అవకాశం లేకుండా చేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారానికి కృషి చేయడంలో మనం దినపత్రిక కథనం ప్రభావం చూపిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యపై స్పందించి వెంటనే చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులు డిఈ వెంకట కృష్ణయ్య,ఏఈ మహేంద్ర కుమార్, విద్యుత్ సిబ్బంది జేఎల్ఎం అంజయ్య, నాగరాజు,సురేష్, కాంట్రాక్టర్ రామ్ రెడ్డి అధికారులకు గ్రామపంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు, యువకులు అనిల్,సతీష్, ప్రవీణ్, విజయ్,ఉమేష్, స్వామి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

# పుట్టి పెరిగిన ఊరికి సాయశక్తుల కృషి చేస్తా

- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి
- రూ. 7 కోట్ల నిధులతో ప్రాథమిక, ఉన్నత పాఠశాల అభివృద్ధికి శంకుస్థాపన
- రూ. 26 కోట్ల నిధులతో నిర్మాణం అవుతున్న చెక్ డాం బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి
- దేవాదుల నీటిని రప్పిస్తా వెల్లడి



తిరుమలగిరి, సెప్టెంబర్ 23 (మనం న్యూస్)ః పుట్టినరోజు తన సహాయ శక్తుల పనులు చేస్తానని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో రూ.7 కోట్ల సి ఆర్ ఎస్ నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాల పాఠశాలల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బోయపల్లి కృష్ణయ్య (కిషన్) అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తాటిపాముల గ్రామంలో అన్ని బజార్లలో సిసి రోడ్లకు, వివిధ పనులకు 35 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో పాఠశాలల అభివృద్ధికి ఏడు కోట్ల నిధులు మంజూరు చేయించానని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులు నిర్మాణమైన పాఠశాలల్లో విద్యను అభ్యసించడానికి నాణ్యతతో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని తిరుమలగిరి మండలానికి రప్పించి అన్ని చెరువులను నింపడానికి కృషి చేస్తానని చెప్పారు. గోదావరి జలాలను రాష్ట్రంలో అనువైన చోట ఉపయోగించడానికి కృషి చేస్తున్నమని చెప్పారు. కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమీక్షించామని తుమ్మిడి హేట్టి ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. సమ్మక్క సారక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయిస్తామని చెప్పారు. గత పాలకులు నిర్మించిన ప్రాజెక్టులు వారి హాయములోనే కూలిపోయాయని చెప్పారు. నీటిని వాడుకోవడంలో గత పాలకులు నిర్లక్ష్యం చేశారని చెప్పారు. పేద ప్రజలు కడుపునిండా తినడానికి సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల దళారీలకు అమ్ముకున్నారని తెలిపారు. తాటిపాముల గ్రామంలో ఏ సమస్యలున్న తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. యశ్వంతపూర్ వాగుపై25 కోట్ల తో నిర్మింస్తున్న చెక్డ్యామ్, బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, ఎసిసి మెంబర్ రాౕ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్, ఎస్పీ నర్సింహ, వ్యవసాయ కమిటీ మెంబర్ చెవిటి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, మార్కెట్ చైర్మన్. ఎల్సోజు చామంతి నరేష్, పిఎసిఎస్ చైర్మన్ పాలెం చంద్రశేఖర్, ఆర్డీవో వేణు మాధవరావు, తహసిల్దార్ వినోద్ కుమార్, ఎంపీడీవో లాజర్, తదితరులు పాల్గొన్నారు.

## శోభాయాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



- జిల్లావ్యాప్తంగా ఆరువేల విగ్రహాలు ఉన్నాయి
- శోభాయాత్రకు ఇబ్బందులు కలగకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్లగొండ -సెప్టెంబర్ 23 (మనం ప్రతినిధి ): నల్గొండ జిల్లాలో గణేష్ నిమజ్జనానికి, శోభాయాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ లోని ఒకటో నెంబర్ వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించి శోభ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,నల్గొండ మేయర్ ఇతర ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు జిల్లాలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లా వ్యాప్తంగా సుమారు 6000 విగ్రహాలు ఉన్నాయని, గడచిన 5 రోజుల నుండి నిమజ్జన ప్రదేశాలకు వినాయక విగ్రహాలు వస్తున్నాయని, బుధవారం నుండి శుక్రవారం వరకు మరో 2000 విగ్రహాలు నిమజ్జనం జరిగే అవకాశం ఉందని తెలిపారు. శోభాయాత్రను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రదేశాలలో ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని ,ముఖ్యంగా శాంతి కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అన్ని నిమజ్జన ప్రదేశాల వద్ద వైద్య బృందాలు, రెవెన్యూ, పోలీస్ తో పాటు ,ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామని, భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనంలో భాగంగా బుధవారం ఒక్కరోజే 2000 వినాయక విగ్రహాలు జిల్లాలోని 8 నిమజ్జన ప్రదేశాలలో నిమజ్జనం జరిపెందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. వినాయక శోభాయాత్రకు, విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, శోభయాత్ర శాంతియుత వాతావరణంలో కొనసాగేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, 14 మైలురాయి వద్ద నీళ్లు ఉన్నాయని, విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ,అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి

ఖమ్మం, సెప్టెంబర్ 23(మనం న్యూస్)ః సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 27న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్టీల్ పరిశ్రమలో భారత్ గ్లోబల్ ఫెర్రో-అలాయ్స్ హబ్‌గా బలోపేతం

- ఐఎఫ్ఎపీఏ



హైదరాబాద్, సెప్టెంబర్ 23(మనంన్యూస్)ః భారత్లో విస్తరిస్తున్న స్టీల్ పరిశ్రమ దేశీయ ఫెర్రో-అలాయ్స్ రంగానికి కొత్త వృద్ధి అవకాశాన్ని సృష్టిస్తోందని, అలాగే గ్లోబల్ మార్కెట్లలో దేశం తన స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోందని ఇండియన్ ఫెర్రో అల్లాయ్ ప్రొడ్యూసర్స్' అసోసియేషన్ గోవాలో నిర్వహించిన 6వ అంతర్జాతీయ ఫెర్రో అల్లాయ్స్ సమావేశం (ఐఎఫ్ఎసీ 2026)లో తెలిపింది.ఐఎఫ్ఎపిఎ నిర్వహిస్తున్న ఈ సదస్సు భారతదేశ ఉక్కు ఉత్పత్తి పెరుగుదలకు ఊతం: ఫెర్రో మిశ్రమ లోహాల (ఫెర్రో మిశ్రమ లోహాలు) పెరుగుతున్న ప్రాముఖ్యత అనే థీమ్తో జరుగుతోంది. వనరుల భద్రత మరియు పోటీతత్వకత ప్రధాన దృష్టి అంశాలుగా ఉన్నాయి.క్యాలెండర్ సంవత్సరం 2025లో భారత్ క్రూడ్ స్టీల్ ఉత్పత్తి సుమారు 165 మిలియన్ టన్నులకు చేరుకుంది, ఇది ఏడాది ప్రాతిపదికన 10% కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. స్టీల్ డిమాండ్ కూడా సంవత్సరానికి సుమారు 7% చొప్పున పెరుగుతూనే ఉంటుందని అంచనా. ఈ వృద్ధి, స్పెషలైజ్డ్ స్టీల్స్కు పెరుగుతున్న డిమాండ్తో కలిసి, మాంగనీస్, క్రోమియం, సిలికాన్ మరియు ఇతర అల్లాయింగ్ ఇన్పుట్లకు అవకాశాలను విస్తరిస్తోంది. భారత్ ఎఫ్వై 31 నాటికి సుమారు 300 మిలియన్ టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది మాంగనీస్, క్రోమియం, సిలికాన్ మరియు ఇతర అల్లాయింగ్ ఇన్పుట్లకు ఉన్న అవకాశాన్ని గణనీయంగా విస్తరిస్తుంది. భారత్ వినియోగంలో కూడా ఒక ముఖ్యమైన మైలురాయిని దాటింది. తలసరి స్టీల్ వినియోగం 1991లో సుమారు 24 కేజీ నుంచి 2025లో సుమారు 109 కేజీకు పెరిగింది. భారత్ ఇప్పుడు 100కేజీ స్థాయిని దాటినందున, వినియోగ వృద్ధి తదుపరి దశ స్టీల్ అవసరాన్ని, దాని ఫలితంగా స్టీల్ ఉత్పత్తికి అవసరమైన ఫెర్రో అలాయ్స్ డిమాండ్ను గణనీయంగా పెంచగలదు. ఇండియన్ ఫెర్రో అల్లాయ్ ప్రొడ్యూసర్స్' అసోసియేషన్ చైర్మన్ శ్రీ మనీష్ సర్దా మాట్లాడుతూ, ప్రపంచ స్థాయిలో పోటీతత్వకంగా మారడానికి మరియు ఆత్మనిర్భర్ భారత్ దృష్టికోణానికి మద్దతు ఇవ్వడానికి భారతీయ ఫెర్రో-అలాయ్ ఉత్పత్తిదారులకు కీలకమైన ముడిసరుకుల స్వదేశీ వనరులను భద్రపరచడం ప్రాధాన్యతగా ఉండాలి. దేశీయ మాంగనీస్, క్రోమ్ మరియు ఇతర కీలక ఖనిజాల అన్వేషణ, అభివృద్ధిని వేగవంతం చేయాలి. అనేక మాంగనీస్ ఓర్ గనులను అధిక ప్రీమియంతో వేలం వేసినప్పటికీ, ఆర్థికంగా అనుకూలంగా లేకపోవడం వల్ల చాలా గనులు ఇప్పటికీ కార్యకలాపాలు ప్రారంభించలేదు. కాబట్టి వేలం విధానాలు అత్యధిక బిడ్కే కాకుండా వాస్తవిక గని అభివృద్ధి మరియు ఉత్పత్తిని ప్రోత్సహించాలి. ఉత్పత్తి చేసే గని పరిశ్రమకు, ఆర్థిక వ్యవస్థకు విలువను సృష్టిస్తుంది; ఆర్థికంగా అనుకూలం కాని గని అలా చేయదు. దేశీయ ఖనిజ వనరులకు వాణిజ్యపరంగా సాధ్యమైన ప్రాప్యత దిగుమతి ఆధారపడటాన్ని తగ్గించడానికి మరియు బలమైన, స్వయం సమృద్ధి గల ఫెర్రో-అలాయ్స్ పరిశ్రమను నిర్మించడానికి కీలకం అవుతుంది. భారత్ 300 మిలియన్ టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యం వైపు కదులుతున్న నేపథ్యంలో ఇన్పుట్ ఖర్చుల పోటీతత్వకతను మెరుగుపరచాల్సిన అవసరాన్నిఐఎఫ్ఎపీఎ కూడా ప్రస్తావించింది. తగిన దేశీయ గ్రేడ్లు అందుబాటులో లేని చోట మాంగనీస్ ఓర్ మరియు నోబుల్ అలాయ్స్కు అవసరమైన ముడిసరుకులపై జీరో డ్యూటీలను దిగుమతి విధానం పరిగణించాలని తెలిపింది. ఇంధన-సాంద్రత అధికంగా ఉన్న ఫెర్రో-అలాయ్ ఉత్పత్తిదారులకు పోటీతత్వక విద్యుత్ ఖర్చులు మరియు విద్యుత్ సంబంధిత ఛార్జీలు, లెవీలను హేతుబద్ధీకరించాలని అసోసియేషన్ కోరింది. ఫెర్రో అలాయ్స్ స్టీల్ బలం, కాఠిన్యం మరియు తుప్పు నిరోధకతను మెరుగుపరచడానికి ఇనుమును మాంగనీస్, క్రోమియం మరియు సిలికాన్ వంటి మూలకాలతో కలుపుతాయి. మౌలిక సదుపాయాలు, ఆటోమొబైల్స్, రైల్వేలు, రక్షణ మరియు ప్రత్యేక అనువర్తనాల కోసం స్టీల్ ఉత్పత్తిలో ఇవి అవసరం. స్టీల్ డిమాండ్లో మారుతున్న కూర్పు కూడా అవకాశాలను విస్తరిస్తోంది. బిగ్మింట్ డేటా ప్రకారం, సిలికో-మాంగనీస్ ఉత్పత్తి ఎఫ్వై 20లో సుమారు 1.9 మిలియన్ టన్నుల నుంచి ఎఫ్వై 26లో దాదాపు 3.5 మిలియన్ టన్నులకు పెరిగింది. ఫెర్రో-మాంగనీస్ ఉత్పత్తి సుమారు 0.9 మిలియన్ టన్నుల నుంచి దాదాపు 1.7 మిలియన్ టన్నులకు పెరిగింది. ఈ ధోరణి భారత్ విస్తరిస్తున్న స్టీల్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్ను ప్రతిబింబిస్తోంది. బిగ్మింట్ ప్రకారం, 2025లో భారత్ ప్రపంచంలోనే మాంగనీస్ అలాయ్స్కు అగ్రగామి ఎగుమతిదారుగా నిలిచింది. పెరుగుతున్న దేశీయ మార్కెట్తో పాటు ఇప్పటికే ఉన్న ఎగుమతి ఆధారం భారతీయ ఉత్పత్తిదారులకు మరింత విస్తరించడానికి మరియు గ్లోబల్ సప్లై చైన్లలో తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి అవకాశాన్ని ఇస్తోంది. అయితే ముడిసరుకు భద్రత కీలకంగానే ఉంది. 2026 మొదటి అర్ధభాగంలో భారత్ మాంగనీస్ ఓర్ దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 27% పెరిగి 4.03 మిలియన్ టన్నులకు చేరాయి. అదే సమయంలో, ఎఫ్వై 2025-26లో క్రోమ్ ఓర్ ఉత్పత్తి 12% పెరిగి 3.53 మిలియన్ టన్నులకు చేరగా, ఫెర్రో-క్రోమ్ ఉత్పత్తి 10% పెరిగి 1.49 మిలియన్ టన్నులకు చేరింది. ఇది దిగుమతుల సవాలుతో పాటు దేశీయ విలువ వృద్ధికి ఉన్న అవకాశాన్ని కూడా స్పష్టం చేస్తోంది. ఐఎఫ్ఎసీ 2026లో 700 మందికి పైగా పాల్గొనేవారు, 35 మంది స్పీకర్లు మరియు 15+ నాలెడ్జ్ సెషన్లు ఉన్నాయి. వీటిలో మాంగనీస్ భద్రత, స్టీల్ మరియు అలాయ్ డిమాండ్, గ్లోబల్ ట్రేడ్, ఫెర్రో-క్రోమ్ మరియు ఫెర్రో-సిలికాన్, ఇంధన సామర్థ్యం మరియు కీలక ఖనిజాలు వంటి అంశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమం శారద గ్రూప్, ఎంవోఐఎల్ , జేఎస్డబ్ల్యూ స్టీల్ , ఎంఎఫ్ఎ , శ్యామ్ మెటాలిక్స్, ఎరామెట్, ది సండూర్ మాంగనీస్ఐరన్ ఓర్స్ లిమిటెడ్ , సెయిల్ , సుమిటోమో మెటల్ మైనింగ్, నావా లిమిటెడ్, హీరా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్, అంతర్జాతీయ మాంగనీస్ సంస్థ తదితర సంస్థల సీనియర్ నాయకులను ఒకచోటికి తీసుకువస్తోంది. ఇండియన్ ఫెర్రో అల్లాయ్ ప్రొడ్యూసర్స్' అసోసియేషన్ గురించి ఇండియన్ ఫెర్రో అల్లాయ్ ప్రొడ్యూసర్స్' అసోసియేషన్ 1961లో స్థాపించబడింది. గత 64 సంవత్సరాల్లో ఐఎఫ్ఎపీఎ ఫెర్రో అలాయ్స్ పరిశ్రమకు అపెక్స్ బాడీగా అభివృద్ధి చెంది, భారతదేశంలోని బల్క్ మరియు నోబుల్ ఫెర్రో అలాయ్ ఉత్పత్తిదారుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించడానికి, ప్రభుత్వంతో చర్చలు జరపడానికి మరియు పరిశ్రమ దీర్ఘకాలిక అభివృద్ధికి తోడ్పడే పరిష్కారాల కోసం పనిచేయడానికి ఇది ఒక వేదికను అందించింది.

## దసరా నుండి ఫించన్ల పంపిణీ పట్ల హర్షం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం, సెప్టెంబర్ 23(మనం న్యూస్)ః దసరా పండుగను పురస్కరించుకొని తెలంగాణలోని అర్హులైన ప్రజలకు అక్టోబర్ నెల నుంచి కొత్త సామాజిక భద్రతా పింఛన్లు (ఫెన్షన్లు) పంపిణీ చేయాలని ప్రభుత్వ నిర్ణయించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజల ముఖాల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రజాపాలన ముందుకు సాగుతోందని ఇందులో భాగంగానే రాబోయే దసరా పండుగను పురష్కరించుకొని రాష్ట్రంలో కొత్తగా లక్షలాది మంది అర్హులైన ప్రజలకు అక్టోబర్ నెల నుంచే కొత్త పెన్షన్ల పంపిణీని ప్రారంభించాలని



ముఖ్యమంత్రి నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి వేచి చూసిన నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల కష్టాలను గుర్తించి వారికి దసరా పండుగ కానుకగా వారి చేతికి పెన్షన్ సొమ్ము అందే విధంగా అధికారులు రాత్రింభవళ్ళు శ్రమిస్తున్నారని, లబ్దిదారుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పండుగ లోపే అర్హులందరికి ఈ ఆర్థిక భరోసా కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన ప్రజా ప్రభుత్వ అనుకూల విధానానికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేరుస్తూ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షపాతి అని నిరూపిస్తూ పండుగ వేళ లబ్దిదారుల ఇళ్లల్లో వెలుగులు నింపబోతున్నందుకు మరొక్కసారి అభినందనలు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి కారు పై బీఆర్యస్ నాయకులు చేసిన రాళ్ళ దాడిపై తీవ్రంగా ఖండించారు. బీఆర్యస్ నాయకులు చిల్లర వేషాలు మానుకోవాలని హితవు పలికారు. మళ్లీ ఇటువంటి ఆకతాయి చేష్టలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలుంటాయాని హెచ్చరించారు. పోలీస్ అధికారులు దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లాలో పర్యాటక, వైద్య, రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మంత్రి దనసరి సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 23, మనం ప్రతినిధి:** ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు లక్ష్మీనగర్లో 5.95 కోట్ల పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు పట్టణ విస్తరణకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. బృందావనం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో నివాసాలు విస్తరించడంతో స్థానికుల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. గతంలో మంజూరైన రహదారి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ములుగు గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో మంజూరైన అభివృద్ధి పనులతోపాటు మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత పెరిగిన అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అవసరమైన రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ములుగు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ట్యాంకులు, తోపుకుంట మినీ ట్యాంక్బండ్, అంతర్గత రహదారులు, స్మశానవాటిక అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం సమర్పించిన వినతులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి వివిధ శాఖల సమన్వయంతో నిరంతరం పనులు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. మంజూరైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతోపాటు కొత్తగా అవసరమైన పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ములుగులో 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు మంత్రి తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నామని, జిల్లా ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ములుగు పరిసర ప్రాంతాల్లో పర్యాటక సదుపాయాలను విస్తరించేందుకు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పరిసరాల్లో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మల్లూరు క్షేత్ర అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను నిర్మాణ నిపుణులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర అంచనాలు రూపొందించనున్నట్లు చెప్పారు. అవసరమైన మిగతా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. మేడారం సమ్మక్క-సారలమ్మ క్షేత్ర పరిసరాల్లో భక్తులు, స్థానికులకు మెరుగైన సేవలు అందించేందుకు 30 పడకల ఆసుపత్రి, రహదారులు-భవనాల శాఖ అతిథిగృహం, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జాతర ప్రాధాన్యం, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు, గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, నీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా, తాగునీటి వసతులు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల ధాన్యం నిల్వ సమస్య పరిష్కారానికి ప్రతి మండలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గోదాం నిర్మించేందుకు వ్యవసాయ శాఖకు నివేదికలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రతిపాదనల పరిశీలన అనంతరం గోదాముల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ బానోత్ రవిచందర్, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యాన్ని పల్లె ప్రజలకు చేరువ చేయాలి

### మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

### ఏటూరునాగారం ఆయుర్వేద ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

### జాతీయ ఆయుర్వేద దినోత్సవ శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 23, మనం ప్రతినిధి:** ఆయుర్వేద వైద్య సేవలను మారుమూల గ్రామాల ప్రజలకు చేరువ చేయాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆయుష్ విభాగం అధికారులకు సూచించారు.

11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బుధవారం ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ఆయుర్వేదం పురాతన వైద్య విధానమని, గ్రామీణ ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా శిబిరాలు నిర్వహించాలని అన్నారు. వర్షాకాలంతోపాటు రాబోయే కాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సదుపాయాలు తక్కువగా ఉన్న మారుమూల గ్రామాలకు వైద్య బృందాలు వెళ్లాలని మంత్రి తెలిపారు. శిబిరాల తేదీలను ముందుగానే స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసి, ఎక్కువ మంది ప్రజలు సేవలు పొందేలా చూడాలన్నారు. ఈ నెల 27న చిన్నబోయినపల్లిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య బృందం పాల్గొనాలని కోరారు. ఏటూరునాగారంలోని ఆయుర్వేద ఆసుపత్రికి సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రికి పక్కా భవనాలు, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ బానోత్ రవిచందర్, వైద్య బృందం, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు అందిన ప్రతి ఒక్కరూ స్పందించాలి



**దుగ్గొండి, సెప్టెంబర్ 23 మనం ప్రతినిధి:** దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో బుధవారం నోటీసులు జారీ చేసిన ఓటర్లతో మాట్లాడిన ఎంపీడీవో లెక్కల అరుంధతి.. నోటీసులు అందిన ప్రతి ఓటరు అధికారులకు సహకరించాలన్నారు. నిబంధనల మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటీసులు వచ్చినంత మాత్రాన ఓటు కోల్పోయినట్లు కాదన్నారు. అధికారులు సూచించిన విధంగా సరైన పత్రాలు చూపి ఓటు హక్కును కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొగాకు శోభారాణి, వెంకటేశ్వర్లు గౌడ్, ఉపసర్పంచ్ మాటేటి రవి,కార్యదర్శి యాదగిరి, బిఎల్ఓ, స్థానికులు పాల్గొన్నారు.

## నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారుల మృతి



- కుటుంబానికి సీతక్క పరామర్శ

**ములుగు, సెప్టెంబర్ 23, మనం ప్రతినిధిః** ములుగు మండలం కాశీందేవిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఇటీవల పొలం వద్ద పనుల్లో ఉన్న అహ్మద్ పాషా ఇద్దరు ఆడపిల్లలు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి సీతక్క.. జరిగిన ఘటనపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. మంత్రి సీతక్క వెంట ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజు యాదవ్, ఎర్రబెల్లి మనోజ్ కుమార్, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై అపోహలు తొలిగించాలి

- కేంద్ర పరిశీలకులు డాక్టర్ వీరకుమార్



**కాటారం, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** కుష్టు వ్యాధిపై ప్రజలకు అపోహలు తొలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కుష్టు వ్యాధి నిర్మూలన కేంద్ర పరిశీలకులు డాక్టర్ వీరకుమార్ వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. కుష్టు వ్యాధి నిర్మూలన (ఎన్ఎల్ఈపీ) కేంద్ర, రాష్ట్ర బృందం సభ్యులు బుధవారం కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలు, రికార్డులు, కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. పీహెచ్సీ కాటారం పరిధిలో నిర్వహిస్తున్న ఎన్ఎల్ఈపీ కార్యక్రమాలు, కుష్టు వ్యాధి గుర్తింపు, చికిత్స, ఫాలోఅప్, రికార్డుల నిర్వహణ, అవగాహన కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పీహెచ్సీ కాటారం వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ హారిక, పీఎంఓలు మల్లయ్య, భోజనాయక్, హెల్త్ అసిస్టెంట్స్ రాజు, పరమేశ్వర్ కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను బృందానికి సమర్పించి, అమలు వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు, సెంట్రల్ లెప్రసీ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, చెంగల్పట్టు డైరెక్టర్ వీరకుమార్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం, వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి కృషి చేయాలని సూచించారు. వ్యాధి నిర్మూలనకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఈ బృందంలో కేంద్ర పరిశీలకులు డాక్టర్ వీరకుమారన్, రాష్ట్ర లేప్రోసీ బృందం సభ్యులు డాక్టర్ నాగరాజు, వెంకటేశ్వరరావు, జిల్లా లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సందీప్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణపయ్యకు ప్రత్యేక పూజలు



**టేకుమట్ల సెప్టెంబర్ 23 మనం న్యూస్:** టేకుమట్ల మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో కొలువుదీరిన గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టేకుమట్ల మండల ప్రజలు సుఖ సంతోషాలతో పాడిపంటలతో అష్ట ఐశ్వర్యలతో ఆయురారోగ్యాలతో ఆ వినాయకుని కృపాకటాక్షాలు టేకుమట్ల ప్రజలపై ఉండాలని ఆ భగవంతున్ని కోరుకున్నారు. తదనంతరం టేకుమట్ల అంబేద్కర్ కాలనీ కోలాట కళాకారులకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచర్ల మహేందర్, దూడం బిక్షపతి, దండు సతీష్ పాల్గొన్నారు.

## గణపయ్యకు పూజలు



**భూపాలపల్లి సెప్టెంబర్ 23 మనం న్యూస్:** జిల్లా కేంద్రంలోని 6ఇంక్లైన్ బ్యారెక్స్ గణేష్ మండలి గణపతి నవరాత్రి ఉత్సవాలు చివరి రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని వెయ్యి దీపాలతో భక్తిశ్రద్ధలతో అలంకరించారు.కాలనీవాసులంతా ఒకే కుటుంబంలా, ఒకే మండపం వద్దకు చేరుకుని గణనాథుడికి దీపాలు వెలిగించి మంగళహారతులు సమర్పించారు. మహిళల భక్తి పాటలు, హారతులతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల గణపతి నామస్మరణతో జై వినాయక జై వినాయక మార్మోగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ దీపాలంకరణ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



## అడవుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

- కాళేశ్వరం జోన్ సిసిఎఫ్ డాక్టర్ ప్రభాకర్

**కాటారం, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** అడవుల సంరక్షణకు అటవీ శాఖ ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపట్టాలని కాళేశ్వరం జోన్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ ప్రభాకర్ ఆదేశించారు. కాటారం మండలం చింతకాని రేంజ్ పరిధిలోని సహజ అటవీ ప్రాంతాన్ని సీసీఎఫ్ బుధవారం పరిశీలించారు. అధికారులతో కలిసి అడవి మొత్తం కలియ తిరిగి అడవిలో సహజంగా పెరిగిన చెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడవులను పెంపొందించడానికి కృషి చేయాలని, అడవుల సంరక్షణ కోసం పగడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. అడవి ప్రాంతంలో చెట్లను నరికే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, అడవుల హరిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న తరాలకు ప్రస్తుతం పెంచే చెట్లే ఉపయోగకరంగా నిలుస్తాయని, అటవీ సంరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సీసీఎఫ్ పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న అటవీ భూముల్లో పలు రకాల మొక్కలను నాటి కొత్తగా అడవులను తీర్చిదిద్దాలని తెలిపారు. అడవుల సంరక్షణ మొక్కల పెంపకం తదితర అంశాలపై అటవీ శాఖ అధికారులకు, సిబ్బందికి సిసిఎఫ్ పలు సూచనలు చేశారు. సీసీఎఫ్ వెంట భూపాలపల్లి డిఎఫ్ఓ కిష్టాగౌడ్, ఎఫ్డీఓ సందీప్ రెడ్డి, కాటారం రేంజర్ స్వాతి, డిప్యూటీ రేంజర్ సురేందర్, బీట్ అధికారులు ఉన్నారు.

## వక్రతుండునికి వీడ్కోలు

**భూపాలపల్లి సెప్టెంబర్ 23 మనం ప్రతినిధి:** తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చేందుకు బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజల అనంతరం గణనాథుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో నిమజ్జనానికి తరలించారు. అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.



## హోంగార్డ్ కుటుంబానికి చెక్కు అందజేత



**భూపాలపల్లి సెప్టెంబర్ 23 మనం ప్రతినిధి:** జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ గోలి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున వెల్ఫేర్ ఎక్స్గ్రేషియా కింద మంజూరైన రూ.20,000 చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డ్ గోలి శ్రీనివాస్ అకాల మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ వెల్ఫేర్ పథకాలు సిబ్బంది కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో కీలకంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్ పాటు హోంగార్డ్ గోలి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**టేకుమట్ల, సెప్టెంబర్ 23 మనం న్యూస్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రాఘవపురం గ్రామంలో బుధవారం నాడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు . ఈ శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. రక్త నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం పంపించడం జరిగింది .ప్రతి ఇంటింటికి తిరిగి డ్రై డే పాటించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. దోమల లార్వా నివారణకు స్ప్రే చేయించడం జరిగింది. .ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలిశాల వైద్యులు ఆశాజ్యోతి ,గిద్ద ముత్తారం ఎం ఎల్ పి హెచ్ డాక్టర్ ప్రియాంక , రాఘవపురం సర్పంచ్ అంబాల కిరణ్ కుమార్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండి అలియాస్,, కారోబార్ రాజి రెడ్డి ,పంప్ ఆపరేటర్ హరీష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలిశాల హెల్త్ సూపర్వైజర్ విజయ ,హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి , ఏఎన్ఎం రాజేశ్వరి ,ఆశా కార్యకర్తలు శ్రావణి, మానస రాజమణి మొదలగు వారు పాల్గొన్నారు.



## సేవామూర్తి మెడలో మరో మణిహారం

### నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డుకు కడవెండి శ్రీనివాస్ ఎంపిక

### మూడు దశాబ్దాల నిస్వార్థ సేవలకు దక్కిన అరుదైన గుర్తింపు

**ఖమ్మం సెప్టెంబర్ 23(మనం న్యూస్)ః** ఖమ్మంసమాజ సేవే ధ్యేయంగా మూడు దశాబ్దాలకు పైగా నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాల్లో ముందుండి, నిస్వార్థంగా సేవలందిస్తున్న కడవెండి శ్రీనివాస్కు ప్రతిష్టాత్మకమైన నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు లభించడం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సమాజానికి తన వంతు బాధ్యతగా భావించి ఎన్నో సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న కడవెండి శ్రీనివాస్ సేవలను గుర్తించిన ఎన్ఎంఐ ఫౌండేషన్, నోయిడా, ఉత్తరప్రదేశ్ సంస్థ ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డు ఆయన సేవా ప్రస్థానానికి లభించిన అరుదైన గౌరవంగా పలువురు అభివర్ణించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విసిఐ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొదుమూరి జగన్నాథం మాట్లాడుతూ.. కడవెండి శ్రీనివాస్కు నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వ్యక్తికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం గర్వకారణమన్రాఉ. సేవామూర్తి మెడలో మరో మణిహారం చేరిందన్నారు. కడవెండి శ్రీనివాస్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్గా, వివిఎన్ డైమండ్ కెసిజిఎఫ్ శ్రేయోభిలాషిగా పలు సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలను ఆశించకుండా సమాజ సేవకు అంకితమై పనిచేయడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ అవార్డు ఆయనకు మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ కడవెండి విశ్వనాథం, రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు, తెలుకుంట ధనంజయ, తెలుకుంట్ల ఓంకార్, చలవారి శ్రీనివాసరావు, సుగ్గల శ్రీహరి, మారేమళ్ళ రామకృష్ణ, కురివెళ్ల గోపాలకృష్ణ, డోకుపర్తి నాగేశ్వరరావు, పెనుగొండ సూర్యప్రకాష్ తదితరులు కడవెండి శ్రీనివాస్కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.




## ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

**కాటారం, సెప్టెంబర్ 23మనం న్యూస్:** కాటారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల అప్ గ్రేడెడ్ జూనియర్ కళాశాలలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 24న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎన్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ విభాగంలో 20, బైపీసీ విభాగంలో 19, ఫిజియోతెరపిలో 01 చొప్పున మొత్తం 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాలికలు అర్హులని తెలిపారు. కౌన్సెలింగ్కు హాజరయ్యే అర్హులైన విద్యార్థినులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఎస్ఎస్సీ మెమో, టీసీ, ఆధార్ కార్డు, నాలుగు పాస్ పోర్ట్ ఫొటోలతో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరుకావాలని సూచిం చారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీలు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## నిమజ్జనానికి తరలిన వినాయకులు



**కాటారం, సెప్టెంబర్23 మనం న్యూస్:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథులు బుధవారం నిమజ్జనానికి తరలి వెళ్లారు. చివరి రోజు పూజల్లో భాగంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు పలు రకాల వాహనాలను శోభయమానంగా అలంకరించి అంగరంగ వైభవంగా వినాయకులకు శుభయాత్ర నిర్వహించారు. మహిళలు, యువత కోలాట నృత్యాలు చేస్తూ గణనాథుడికి వీడుకోలు పలికారు. గణనాథుల ఊరేగింపుతో గ్రామాల్లో సందడి నెలకొంది. అనంతరం వినాయకులను నిమజ్జనం కోసం కాలేశ్వరం లోని త్రివేణి సంగమానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కాటారం డిఎస్పి సూర్యనారాయణ, సిఐ నాగార్జున రావు, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

# చైనా చేతిలో ఓటమి.. కాంస్యంతో సరిపెట్టుకున్న భారత జట్టు



ఆసియా క్రీడలు-2026 టోర్నీ పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్లో భారత్కు చుక్కెదురైంది. సెమీ ఫైనల్లో భారత జట్టు చైనా చేతిలో ఓడిపోయింది. తద్వారా కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సెమీస్ లో డిఫెండింగ్ చాంపియన్ చైనాతో తలపడ్డ భారత జట్టు ఆరంభంలో అలరించినా ఆ తర్వాత ప్రత్యర్థి ముందు తలొగ్గింది. సింగిల్స్లో షి యు కీ చేతిలో లక్ష్య సేన్ 21-16, 21-18 పాయింట్ల తేడాతో ఓడిపోగా.. డబుల్స్లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి.. లియాండ్ వెయ్ కెంగ్, వాంగ్ చాంగ్లపై 21-11, 22-20 తేడాతో గెలిచారు.

ఇక మూడో మ్యాచ్లో లి షి ఫెంగ్ ఆయుశ్ శెట్టిని 21-19, 21-13 తేడాతో ఓడించగా.. నాలుగో మ్యాచ్లో హి ఝి టింగ్, లియూ యి- హరిహరన్ అమ్సకరుణన్, ఎంఆర్ అర్జున్లపై 21-16, 18-21, 21-9 తేడాతో విజయం సాధించారు. దీంతో భారత బ్యాడ్మింటన్ జట్టు చైనా చేతిలో 3-1 తేడాతో ఓటమిపాలైంది. దీంతో భారత్ కాంస్యానికి పరిమితమైంది.

**ఇప్పటి వరకు లభించిన పతకాలు ఇవే**

కాగా ఆసియా క్రీడల తాజా ఎడిషన్లో భారత్ ఇప్పటి వరకు ఒకే ఒక్క స్వర్ణం గెలిచింది. భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్లో శ్రీలంకను ఓడించి పసిడి పతకం సాధించింది. ఇక మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రజతం, మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఇలవేణిల్ వలరివన్ రజతం గెలవగా.. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో రజతం, పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో హిమాన్షు ధిల్లాన్ రజతం వచ్చాయి.

ఇక మహిళల 49 కిలోల వెయిట్లిఫ్టింగ్ విభాగంలో మీరా బాయి చాను వెండి పతకం గెలవగా.. రుద్రాంక్ష్ పాటిల్ (షూటింగ్), సుచిక తరియాల్ (మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్) కాంస్యం కైవసం చేసుకున్నారు. మహిళల, పురుషుల స్కీట్ టీమ్లో కాంస్యాలు వచ్చాయి. ఇక మెన్స్ సింగిల్స్ సాఫ్ట్ టెన్నిస్లో జై మీనా కాంస్యం గెలిచాడు.

# ‘ది ప్యారడైజ్’తో నా కల నిజమైంది.. : శ్రీకాంత్ ఓదెల




నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’. సంచలన విజయం సాధించిన ‘దసరా’ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న మూవీ కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు పీక్స్కు చేరాయి. ఈ సినిమా మరికొద్ది గంటల్లో థియేటర్లలో గ్రాండ్గా విడుదల కాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఒక ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. జడల్ పుట్టుక, పోరాటం కల్పితం కావచ్చునని, కానీ అతని జడలు, రూపం తన చిన్ననాటి నుండి ప్రేరణ పొందాయని శ్రీకాంత్ తెలిపారు. తాను పెరిగేకొద్దీ, ఈ సినిమాలో చాలా సన్నివేశాలు తన చిన్ననాటి జ్ఞాపకాలతో ప్రభావితమయ్యాయని తన బాల్యపు రోజులను గుర్తు చేసుకున్నారు.

తనకు ఐదేళ్ల వయసు వచ్చే వరకు అమ్మ జడలు వేసి కట్టేదని, పెద్దయ్యాక కమర్షియల్ సినిమాలో 70ఌతెరపై జడలతో హీరో ఎలా కనిపిస్తాడో అని ఎప్పుడూ ఊహించుకునేవాడినని చెప్పారు. ఇక ఇప్పుడు ఆ కల నిజమైందని చెబుతూ.. జడల్తో ఉన్న తన హీరో నాని అన్నను అందరికీ పరిచయం చేస్తున్నానని, ఈ చిత్రం కేవలం తన కల మాత్రమే కాదని, ఇది తన స్వర్గం అని భావోద్వేగానికి లోనయ్యారు. కొన్ని గంటల్లో అందరికీ ‘ది ప్యారడైజ్’ ప్రపంచంలోకి స్వాగతం అంటూ ఆయన చేసిన ఈ పోస్ట్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. నాని మాస్ యాక్షన్ అవతార్ను బిగ్ స్క్రీన్పై చూసేందుకు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

# అప్పుడు మల్లీశ్వరి.. ఇప్పుడు మీరాబాయి ఆసియా గేమ్స్లో 28ఏళ్ల ‘వెయిట్’ ఓవర్

ఆసియా గేమ్స్లో వెయిట్లిఫ్టింగ్ మెడల్ కోసం భారత సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 28 ఏళ్ల తర్వాత ఈ విభాగంలో మన వెయిట్లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు పతకం సాధించింది. జపాన్ వేదికగా జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 49కేజీల విభాగంలో ఆమె రజతాన్ని ముద్దాడింది. అంతేకాదు.. ఆసియా క్రీడల్లో (అటెమ్ప్ట్ ఎర్రర్) మెడల్ రాలేదన్న వెలితి కూడా చానుకు ఇప్పుడు తీరిపోయింది.




బుధవారం జరిగిన పోటీల్లో మీరాబాయి చాను స్నాచ్లో 87 కేజీలు, క్లీన్ అండ్ జర్క్లో 111 కేజీలు ఎత్తింది. మొత్తంగా 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో తొలి స్థానంలో నిలిచిన ఉత్తరకొరియా వెయిట్లిఫ్టర్ రి సాంగ్ గమ్.. రికార్డు స్థాయిలో మొత్తం 215 కేజీలు (స్నాచ్లో 94 కిలోలు, క్లీన్ అండ్ జర్క్లో 121 కిలోలు) ఎత్తి బంగారు పతకం సాధించింది. ఆసియా గేమ్స్లో వెయిట్లిఫ్టింగ్ విభాగంలో భారత్కు పతకం రావడం 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. చివరిసారిగా 1998లో జరిగిన ఆసియా క్రీడల్లో కరణం మల్లీశ్వరి రజతం సాధించింది. ఇక, ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్షిప్, కామన్వెల్త్ ఇలా అంతర్జాతీయ టోర్నీల్లో అనేక పతకాలు సాధించినా.. ఆసియా క్రీడల్లో మాత్రం ఆమె ఇప్పటివరకు మెడల్ తీసుకోలేదు. నేటితో ఆ కొరత తీరింది. మీరాబాయి చాను గతంలో టోక్యో ఒలింపిక్స్లో రజతం, రెండు ప్రపంచ ఛాంపియన్షిప్ పతకాలు, కామన్వెల్త్ గేమ్స్లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాలను సాధించిన సంగతి తెలిసిందే.



# ‘రూట్’ సంచలన నిర్ణయం.. క్రికెట్కు గుడ్బై

ఇంగ్లండ్ దిగ్గజం జో రూట్ సోదరుడు, గ్లామోర్గాన్ స్టార్ బిల్లీ రూట్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ ఏడాది డొమాస్టిక్ సీజన్ తర్వాత ప్రొఫెషనల్ క్రికెట్కు వీడ్కోలు పలకనున్నట్లు రూట్ ప్రకటించాడు. 34 ఏళ్ల రూట్ 2017లో నాటింగ్హామ్షైర్ క్లబ్ తరపున ప్రొఫెషనల్ క్రికెట్లోకి అడుగుపెట్టాడు. రెండేళ్ల తర్వాత అతడు 2019లో గ్లామోర్గాన్ క్లబ్తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గ్లామోర్గాన్ క్లబ్ 2021, 2024 లలో వన్డే కప్ టైటిల్స్ గెలవడంలో బిల్లీ రూట్ కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా ఈ రైట్ హ్యాండ్ బ్యాటర్ 83 ఫస్ట్-క్లాస్, 60 లిస్ట్-ఎ, 50 టీ20 మ్యాచ్లు ఆడి 6406 పరుగులు సాధించాడు.

అతడి పేరిట 7 ఫస్ట్ క్లాస్, 3 లిస్ట్-ఎ సెంచరీలు ఉన్నాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో రూట్ అత్యధిక స్కోర్ 229 పరుగులగా ఉంది. అయితే ప్రస్తుత కౌంటీ సీజన్లో బిల్లీ అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోతున్నాడు. ఆడిన నాలుగు ఇన్నింగ్స్లో కేవలం 28 పరుగులు మాత్రమే చేయగలిగాడు. గత సీజన్లోనూ ఇదే తీరు కనబరిచాడు.

ఐదు మ్యాచ్లు కేవలం 56 పరుగులు మాత్రమే సాధించగలిగాడు. తన పేలవ ఫామ్ కారణంగా అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా మంగళవారం మరో గ్లామోర్గాన్ లెజెండ్ కొలిన్ ఇంగ్రామ్ కూడా తన 22 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్కు ముగింపు పలికాడు.



# శర్వానంద్కు జోడీగా మానస వారణాసి

టాలీవుడ్లో దూసుకుపోతున్న యంగ్ బ్యూటీ మానస వారణాసి మరో క్రేజీ ప్రాజెక్టును తన ఖాతాలో వేసుకుంది. ‘దేవకి నందన వాసుదేవ’ సినిమాతో టాలీవుడ్లోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు, రీసెంట్గా వచ్చిన ‘కపుల్ ఫ్రెండ్లీ’ మూవీతో భారీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇలా వచ్చిన రెండు సినిమాలతోనే యూత్లో భారీ ఫాలోయింగ్ను సంపాదించుకుంది. అయితే గత కొంతకాలంగా ఈ భామ టాలీవుడ్లో మరో స్టార్ హీరో సరసన నటించబోతుందంటూ జోరుగా ప్రచారం సాగింది. తాజాగా, ఆ రూమర్స్ను నిజం చేస్తూ మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. టాలెంటెడ్ హీరో శర్వానంద్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ‘జా క్రిష్’ చిత్రంలో హీరోయిన్గా మానస వారణాసి ఎంపికైనట్లు మేకర్స్ ప్రకటించారు. ‘ఒక రిఫ్రెషింగ్ కపుల్ను రాబోయే సంక్రాంతి స్పెషల్ ఎంటర్టైనర్లో బిగ్ స్క్రీన్పై చూసేందుకు సిద్ధంకండి’ అంటూ అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇచ్చారు. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శ్రీను వైట్ల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఫుల్ లెంత్ ఎంటర్టైనర్గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది పొంగల్ కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు.

# టాలీవుడ్లో మరో సెన్సేషన్.. డ్యాన్సర్స్ అసోసియేషన్ కార్యవర్గం రద్దు




టాలీవుడ్లో డ్యాన్సర్ల సంఘం వ్యవహారం పీక్స్కు చేరింది. ఈ క్రమంలోనే ఇవాళ టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్ ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. అసోసియేషన్ లో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో హైకమాండ్ తరహాలో ఫెడరేషన్ పెద్దలు రంగంలోకి దిగి కీలక చర్యలు చేపట్టారు. డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదంపై చర్చించేందుకు ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు సుమలత, రఘు మాస్టర్ తో సమావేశం నిర్వహించారు. ఈ కీలక సమావేశానికి మొత్తం 225 మంది డ్యాన్సర్లు హాజరయ్యారు. సమావేశంలో సభ్యుల మద్దతుపై జరిగిన పరిశీలనలో ఇరువర్గాల బలాబలాలు స్పష్టంగా బయటపడ్డాయి. ఈ మద్దతు సేకరణలో సుమలతకు కేవలం 11 మంది డ్యాన్సర్లు మాత్రమే మద్దతు తెలపగా, రఘు మాస్టర్ కు ఏకంగా 214 మంది డ్యాన్సర్లు పూర్తి మద్దతు ప్రకటించారు.

**కార్యవర్గం రద్దు, ఎన్నికల తేదీ ఖరారు..**

సమావేశంలో వెల్లడైన డ్యాన్సర్ల మద్దతు ఆధారంగా ఫిల్మ్ ఫెడరేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కొనసాగుతున్న సుమలత కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నట్లుగా ఫిల్మ్ ఫెడరేషన్ ప్రకటించింది. ఈ నిర్ణయం అనంతరం డ్యాన్సర్స్ అసోసియేషన్ కు కొత్త కార్యవర్గ ఏర్పాటు కోసం ఎన్నికల షెడ్యూల్ను వెల్లడించారు. డ్యాన్సర్స్ అసోసియేషన్ కు రాబోయే అక్టోబర్ 11న ఎన్నికలు నిర్వహించాలని ఫెడరేషన్ అధికారికంగా నిర్ణయించింది.

# అత్యున్నత స్థాయి సినిమా అనుభూతిని అందించడానికి కష్టపడుతున్నాం: అల్లు అర్జున్



అత్యంత భారీ అంచనాలతో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ ‘రాకా’. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్లో తెరకెక్కుతోంది. సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్గా నటిస్తోంది. అయితే ఈ సినిమా ఇప్పుడో అరుదైన ఘనత సాధించి గ్లోబల్ లెవెల్లో ట్రెండ్ అవుతోంది. షూటింగ్ దశలోనే ఈ చిత్రం ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్ రికార్డ్ను సొంతం చేసుకుంది. ‘రాకా’ చిత్రంలో ఒకేసారి అత్యధిక మంది పెర్ఫార్మర్లను రియల్ టైమ్లో ఏకకాలంలో మోషన్ క్యాప్చర్ చేసిన సినిమాగా ఈ రికార్డ్ కెక్కింది. ఏకంగా 37 మంది పెర్ఫార్మర్లను లైవ్ మోషన్ క్యాప్చర్ ద్వారా బంధించి గిన్నిస్ బుక్లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ఈవెంట్లో అల్లు అర్జున్ ఎమోషనల్ కామెంట్స్ చేశారు.

‘ఇక్కడ ఉండటం నాకు ఎంతో గర్వకారణం, ఇది నాకు ఎంతో వినమ్రతను కలిగించే విషయం. ప్రపంచ సినిమాకు కొత్త ప్రమాణాలను నెలకొల్పి, ఈ చిత్రం ఒక అద్భుతమైన ఘనతను సాధించినందుకు మేము ఎంతో గర్విస్తున్నాం‘ అని బన్నీ పేర్కొన్నారు. ఇక సినిమా విడుదల కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న అభిమానులనుద్దేశించి అల్లు అర్జున్ ఒక విజ్ఞప్తి చేశారు. ‘సినిమా ప్రేమికులకూ, అభిమానులందరికీ నేను ఒకటే చెప్పాలనుకుంటున్నాను.. మేము ఈ ప్రాజెక్ట్ కోసం తగినంత సమయం తీసుకుంటున్నామని మాకు తెలుసు, కానీ దయచేసి మా పట్ల కొంచెం ఓపిక వహించండి. మీకు థియేటర్లలో ఎప్పటికీ గుర్తుండిపోయే అత్యున్నత స్థాయి సినిమా అనుభూతిని అందించడానికి కష్టపడుతున్నాం. మీరందరూ మరికొంత కాలం వేచి ఉండాలని కోరుకుంటున్నాను, ఆ నిరీక్షణకు వందశాతం తగిన ఫలితం దక్కుతుంది‘ అని బన్నీ భరోసానిచ్చారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.